బ్రిటన్‌లో సోషల్ మీడియా నిషేధం



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 16 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 161 | పేజీలు:12 | వెల రూ.5

జీ-7పై నిరసనలు



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


# 'మెట్రో'కు కిషన్ రెడ్డి అడ్డు

## ప్లాన్ కేసీఆర్‌ది... యాక్షన్ కిషన్ రెడ్డిది

- కేంద్ర మంత్రులు ఖట్టర్, అశ్వినీ వైష్ణ వ్‌తో ఐఆర్‌ఎఫ్‌సి రుణాన్ని అడ్డుకున్నరు
- ఐఆర్‌ఎఫ్‌సి నిలిపివేసిన రూ.13600 కోట్లు రుణం విడుదల చేయించాలె
- కేంద్రం ఎన్‌వోసీ ఇస్తే 'మెట్రో' ప్రాజెక్టు మేమే పూర్తి చేసుకుంటం
- పదేళ్లలో బీఆర్‌ఎస్ 'మెట్రో'విస్తరణపై ఆలోచించలేదు
- అందుకే....రూ.15 వేల కోట్ల ప్రాజెక్టు 22 వేల కోట్లకు చేరింది
- హామీలు నెరవేర్చని ప్రధాని మోడీ రాజీనామా చేస్తే నేనూ చేస్తా
- మీడియా ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 15 ( మనం బ్యూరో ) :** హైదరాబాద్ మెట్రో రేల్ రెండో దశ విస్తరణ పనులకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మోకాలడ్డుతున్నడని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో విస్తరణను అడ్డుకోవాలన్న కుట్ర కేసీఆర్‌ది...దానిని కిషన్ రెడ్డి అమలు చేస్తున్నరని విమర్శించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సీఎం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. నాటి సీఎం వైఎస్ హయంలో అప్పటి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి హైదరాబాద్‌కు 'మెట్రో' ప్రాజెక్టు తీసుకొచ్చారనీ, వైఎస్ మరణానంతరం రోశయ్య హయాంలో మొదటి దశ మెట్రో కోసం ఒప్పందాలు జరిగాయన్నారు. 2017 నాటికి మెట్రో మొదటి దశ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రాజెక్టు మొదలైందనీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ చర్య లతో మొదటి దశ మూడేళ్లు ఆలస్యమైందని తెలిపారు. రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు 22 వేల కోట్లకు చేరిందనీ ప్రాజెక్టు ఆలస్యం, కోవిడ్ ప్రభావంతో ఎల్‌అండ్‌టి నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. గతంలో దేశంలో రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో 9వ స్థానానికి పడిపోయిందన్నారు. కేసీఆర్‌కు పీఎఫ్‌సి, ఆర్‌ఈసీ ద్వారా పదేళ్లలో రూ.3 లక్షల 15 వేల కోట్ల ఎలాంటి గ్యారెంటీ లేకుండా కేంద్రం అప్పు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మెట్రో రెండో దశ విస్తరణకు నిర్ణయం తీసుకుందన్నారు. ఫేజ్ 1 నిర్మించిన ఎల్‌అండ్‌టి తోనే ఫేజ్ 2 నిర్మించాల్సి ఉంటుందని కేంద్రం పెట్టిన నిబంధనకు రూ.30 వేల కోట్ల ఆస్తిని సృష్టించినా ఏటా రూ.400 కోట్ల నష్టం వస్తుందన్న కారణంతో ఆ సంస్థ ఒప్పుకోలేదని వివరించారు. దీంతో మెట్రో ఆస్తిని రూ.15 వేల కోట్లకే ప్రభుత్వం కొనుగోలు చేసిందనీ, ఎల్‌అండ్‌టి తీసుకున్న రూ.13600 కోట్ల రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో మెట్రో రెండో దశ విస్తరణ కోసం రూ.13,400 కోట్ల భారీ రుణాన్ని కేవలం 4 శాతం వడ్డీకే 20 ఏళ్ల కాలపరిమితితో తెచ్చేందుకు అన్ని ఒప్పందాలూ పూర్తయ్యాయన్నారు. డాక్యుమెంట్ల కింద రూ.84 కోట్లు ...మిగతా 2లో

## భారత్-ఫ్రాన్స్ మధ్య 13 ఒప్పందాలు



- ఐదేళ్లలో రూ. 3 లక్షల కోట్ల వాణిజ్యం
- హైస్పీడ్ రైల్వేకు సహకారం
- రఫేల్ యుద్ధ విమానాలపై పురోగతి
- ఫ్రాన్స్‌లో మెక్రాన్‌తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు

**నీస్ (ఫ్రాన్స్), జూన్ 15:** వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్-ఫ్రాన్స్ నిర్ణయించుకున్నాయి. ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఐదేళ్లలో రెట్టింపు చేసుకుని రూ. 3 లక్షల కోట్ల (3,200 కోట్ల డాలర్ల)కు చేర్చాలని అంగీకారానికి వచ్చాయి. కీలకమైన రఫేల్ యుద్ధ విమానాల సరఫరాపైనా కొంత ముందడుగు పడింది. ఫ్రాన్స్ పర్యటనకు వచ్చిన భారత ప్రధాని నరేంద్రమోడీ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరువురి సమక్షంలో మొత్తం 13 ఒప్పందాలు ...మిగతా 2లో

## తెలంగాణ బియ్యానికి ఫుల్ డిమాండ్ 3

## 'సర్'ను ఆషామాషీగా తీసుకోవద్దు

- అనుమానాస్పదం పేరుతో ఓట్లు తొలగిస్తరు
- గాంధీభవన్‌లో వార్ ఏర్పాటు చేసి బూత్ లెవల్ మానిటరింగ్ చేయాలె
- 'సర్'పై జూమ్ మీటింగ్‌లో సీఎం
- బీజేపీకి ఓట్ చోరీనే పని మీనాక్షి నటరాజన్



**హైదరాబాద్, జూన్ 15, (మనం బ్యూరో) :** 'సర్' విషయంలో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అనుమానాస్పదం పేరుతో వాటిని తొలగించే ప్రయత్నం...మిగతా 2లో

## ప్రజలకు మరింత చేరువయ్యాం


- క్షేత్రస్థాయికి వెళ్లని అధికారులపై చర్యలు
- ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలె
- విద్య, వైద్య విభాగాల్లో ముఖ గుర్తింపు
- నియోజకవర్గాలవారీగా హామీల పురోగతిపై నివేదిక ఇవ్వండి
- 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' సమీక్షలో సీఎం రేవంత్



**హైదరాబాద్, జూన్ 15 ( మనం బ్యూరో ) :** మార్చి 16 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'తో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కార్యక్రమాలపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను అభినందించిన సీఎం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని, వారిపై క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో ...మిగతా 2లో

# వలపు వలతో మనీ ట్రాప్

- సోషల్ మీడియా వేదికగా దందా
- సంపన్నులే వారి టార్గెట్
- సన్నిహితంగా ఉంటూ బ్లాక్‌మెయిల్
- పరువు పరుపోతుందని పైసల బేరం
- హనీట్రాప్‌లో 10శాతమే వెలుగులోకి
- లోలోపల భారీ సెటిల్‌మెంట్‌లు



**హైదరాబాద్,జూన్ 15(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** హనీ ట్రాప్ ముఠాలు కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఒకప్పుడు నిరక్షరాస్యులను టార్గెట్ చేసుకున్న కేటుగాళ్లు ఇప్పుడు రూటు మార్చి.. మధ్యవయసు వారు, వృద్ధులను టార్గెట్ చేసుకుని.. మాయమాటలతో వారిని బురిడీ కొట్టిస్తున్నారు.వలపు వల విసిరి ఆపై సన్నిహితంగా నటించి పెద్ద ఎత్తున దండుకుంటున్న హ(మ)నీట్రాప్ ముఠాలు, సైబర్ నేరగాళ్లున్నారు తస్మాత్ జాగ్రత్త అంటున్నారు పోలీసులు. కొందరు హనీట్రాప్‌ను దందాగా ఎంచుకుని సంపన్నులు, వారి పిల్లలను టార్గెట్ చేసుకుని పనికానిస్తున్నారని, సమాజంలో పేరు, ప్రతిష్ఠలున్న వారి ఎంచుకుని హనీట్రాప్‌కు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. మరోకొందరు సంపన్న వర్గాల వారి పిల్లలను ప్రేమపేరుతో వంచించి ఆపై వారి నిజ స్వరూపం బయటపెడుతున్నారని వివరిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట్‌లో 81 ఏళ్ల వృద్ధుడిని బురిడీ కొట్టించి రూ. 7 లక్షలు కాజేశారు. మాయమాటలతో అతడికి దగ్గరై.. సదరు వృద్ధుడి నుంచి డబ్బులు గుంజారు. అప్పటికే లక్షలు పొగోట్టుకున్న బాధితుడిని స్కామర్స్ మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో.. చివరికి కుటుంబ సభ్యులకు చెప్పడంతో అసలు విషయం బయటపడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వాట్సాప్ కాల్ ...మిగతా 2లో

## ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు



2

## నీట్ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తోన్న ఎన్టీఏ





**ఢిల్లీ, జూన్ 15:** నీట్ యూజీ అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చుక్కలు చూపిస్తోంది. గత నెలలో నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం కారణంగా రద్దవ్వడంతో తీవ్ర నిరాశలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆ సంస్థ పనితీరు మరింత చిరాకు తెప్పిస్తోంది. దేశ వ్యాప్తంగా జూన్ 21న మళ్లీ జరగనున్న నీట్ పరీక్షకు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో పెట్టినట్లు ఈ నెల 14న ఎన్టీఏ ప్రకటించింది. అయితే, ఈ డౌన్‌లోడ్ లింక్ సైతం ఓపెన్ కాకపోవడంతో పలువురు అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. మొత్తంగా దాదాపు 23 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉండగా అడ్మిట్ కార్డుల జారీ ప్రారంభమైనప్పట్నుంచి నేటి ఉదయం వరకు కేవలం 4లక్షల మంది మాత్రమే డౌన్‌లోడ్ చేసుకున్నట్లు ఎన్టీఏనే స్వయంగా ...మిగతా 2లో



## ప్రజల భద్రతకు ప్రాధాన్యత

- వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి
- వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,జూన్15(మనం న్యూస్):** ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,ప్రజా ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం మంత్రి పొంగులేటి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అప్రమత్తం చేస్తూ అధికారులతో సమీక్ష నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం ముగిసే వరకు అన్ని జిల్లాల అధికారులు ...మిగతా 2లో

## అమెరికాతో ఇరాన్‌కు

# కుదిరిన ఒప్పందం

- హర్మూజ్‌లో టోల్ ఫ్రీ అంటున్న ట్రంప్
- పశ్చిమాసియాను మార్చేస్తుంది: వాన్స్
- ఒప్పందాన్ని ధ్రువీకరించిన ఇరాన్

**వాషింగ్టన్, జూన్ 15:** ఇరాన్ తో శాంతి ఒప్పందంలో భాగంగా అమెరికా టోల్ రహిత హర్మూజ్‌తోనే సర్దుకొన్నట్లు కనిపిస్తోంది. టెహ్రాన్‌తో ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ప్రకటనలో పేర్కొంటూ హర్మూజ్ తెరుచుకొంటుందన్న



విషయాన్ని తెలియజేశారు. అక్కడ టోల్ కూడా వసూలు చేయరని ఆయన నొక్కిచెప్పారు. వాస్తవానికి ఇరాన్ అణ్వాయుధాల ఊసు మాత్రం ఈ ఒప్పందంలో లేకపోవడం గమనార్హం.

మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ డీల్ విషయాన్ని ధ్రువీకరించిన తర్వాతే ఇరాన్ స్పందించింది. ఐఆర్జీసీ దళాలకు అనుబంధంగా పనిచేసే ఐఆర్ఐబీ వార్తా సంస్థ తొలుత దీనిని ఇరాన్ విజయంగా అభివర్ణించింది. ఒప్పందానికి వచ్చే పరిస్థితి అమెరికాకు కల్పించినట్లు పేర్కొంది. ఆ తర్వాత సుప్రీం నేషనల్ కౌన్సిల్ సెక్రటేరియట్ ఈ ఒప్పందాన్ని ధ్రువీకరించింది. లెబనాన్, ఇరాన్ అనుకూల పక్షాలపై అమెరికా శాశ్వతంగా సైనిక ఆపరేషన్లను నిలిపివేయడం, ఇరాన్ రేవులపై నౌకాదళ దిగ్బంధాన్ని తక్షణం తొలగించడం వంటి వాటికి అంగీకరించినట్లు పేర్కొంది. ఈ అవగాహన ఒప్పందంపై జూన్ 19వ తేదీన సంతకాలు జరుగుతాయని ఇరాన్ విదేశాంగశాఖ ఉప మంత్రి కాజెమ్ గరీబాబడీ వెల్లడించారు. ఈ ఒప్పందం కోసం తుదివిడతగా 15 గంటలపాటు చర్చలు జరిగినట్లు వెల్లడించారు. ఇక తుది చర్చలు మాత్రం ఈ డీల్లోని అంశాల అమలుపై ఆధారపడి ఉంటాయని ఇరాన్ చెబుతోంది. జూన్ 19న ఒప్పందంపై ...మిగతా 2లో

## అమెరికా-ఇరాన్ డీల్

# ఉద్రిక్తతలు తగ్గుతాయి

## ప్రధాని నరేంద్ర మోడీ



**ఢిల్లీ, జూన్ 15:** అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోడీ పోస్ట్ చేశారు. ''పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం'' అని మోదీ ...మిగతా 2లో

# ఏఐను వాడి గూగుల్‌ను ఓడించిన లాయర్

**వాషింగ్టన్, జూన్ 15:** ఓ కేసులో ఏఐ సహాయంతో టెక్ దిగ్గజాలైన మెటా, గూగుల్‌ను అమెరికాకు చెందిన ఓ లాయర్ ఓడించారు. సోషల్ మీడియా తనను బానిసగా మార్చేసిందంటూ 20 ఏళ్ల యువతి వేసిన కేసును వాదించడానికి తాను ఏఐ సాయం తీసుకున్నట్లు లాయర్ మార్క్ లానియర్ తాజాగా వెల్లడించారు. ఈ ఏడాది మార్చిలో వేసిన ఈ కేసును వాదించడానికి కోర్టుకు వెళ్లే ముందు తాను మెటా చీఫ్ ఎగ్జిక్యూటివ్ మార్క్ జుకర్‌బర్గ్‌ను క్రాస్-ఎగ్జామినేషన్ చేశానని.. చాట్జీపీటి, క్లాడ్, జెమినితో సహా పలు మోడళ్లకు యాక్సెస్ ఇచ్చే బూడిల్‌బాక్స్ అనే ఏఐ సాధనాన్ని కేసు విచారణ కోసం వాడానని పేర్కొన్నారు.

న్యాయవ్యవస్థలో ఏఐని వాడడం వల్ల వేగంగా కేసులు పూర్తవుతాయని మార్క్ లానియర్ పేర్కొన్నారు. కృత్రిమ మేధ చేతిలో ఉంటే తనకు అదనంగా 10మంది ఉద్యోగులు సహకరించినట్లు అనిపించిందన్నారు. వేల సంఖ్యలో తీర్పులను గంటల్లోనే సమీక్షించగలిగినట్లు తెలిపారు. ఆ ఉద్యోగులు ఎటువంటి విరామం తీసుకోకుండా 24గంటలు పని చేస్తారంటూ చమత్కరించారు.



అయితే అందుకు ఖర్చు మాత్రం చాలా ఎక్కువ అవుతుందన్నారు.

**కోర్టు ఏమందంటే..?**

ఇన్‌స్టాగ్రామ్, టిక్టాక్, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్‌లోని వ్యసనపూరిత ఫీచర్ల వల్ల తన బాల్యాన్ని నష్టపోయానని బాధితురాలు తన పిటిషన్లో ఆరోపించింది. ఎనిమిదేళ్ల...మిగతా 2లో

# బ్రిటన్‌లో పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

**లండన్, జూన్ 15:** పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా చట్టం తీసుకురానున్నట్లు ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రకటించారు. గేమింగ్, లైవ్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై పరిమితులు విధించనున్నట్లు తెలిపారు. పిల్లలు గంటలకొద్దీ సమయాన్ని స్క్రీన్లకు కేటాయించడం వల్ల వారిలో తలెత్తుతున్న ఆరోగ్య, మానసిక సమస్యలను నివారించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తమ దేశంలోని పిల్లల భద్రత, సంతోషం విషయంలో రాజీ పడబోమని.. ఈ నిర్ణయంపై టెక్నాలజీ కంపెనీలు ప్రతిఘటిస్తే తాను ఎదురు తిరుగుతానని పేర్కొన్నారు.

సోషల్ మీడియా నిషేధంపై దేశ ప్రజల నిర్ణయం తెలుసుకున్నాక.. జులైలో చట్టం తీసుకురానున్నట్లు కీర్ స్టార్మర్ తెలిపారు. యూట్యూబ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, రోబ్లాక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఈ నిషేధం వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. కాగా, ఇప్పటికే బ్రిటన్ టెక్ కంపెనీలకు కఠిన నిబంధనలు జారీ చేసింది. పిల్లలకు సోషల్ మీడియా యాప్లను అందుబాటులో ఉండకుండా ఏజ్ వెరిఫికేషన్‌ను తప్పనిసరి చేయాలని ఆదేశించింది. తమ అల్గారిథమ్‌లను మార్చుకోవాలని సూచించింది. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇండోనేషియా ప్రభుత్వాలు తమ దేశాల్లో 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధించాయి.

# జీ-7పై నిరసనలు

**జెనీవా, జూన్ 15 :** ఫ్రాన్స్‌లో సోమవారం నుంచి జరగనున్న జీ-7 శిఖరాగ్ర సదస్సును నిరసిస్తూ వేల సంఖ్యలో ప్రజలు ఆదివారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నవారు, స్వతంత్ర మీడియాకు మద్దతుగా నిలుస్తున్నవారు, పాలస్తీనా హక్కుల మద్దతుదారులు తదితరులు ఇందులో పాల్గొన్నారు. వారంతా కలిసి ఒక టెస్లా కారును తగులబెట్టారు. 20 పడవలను వరుసగా నిలిపి 'నో జీ-7' అని రాసిన పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను, శాంతి లేకుండా చేయిస్తున్న యుద్ధాలను నిరసిస్తున్నట్లు ఆందోళనకారులు తెలిపారు. ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో మూడురోజుల పాటు జరిగే శిఖరాగ్ర సదస్సు సోమవారం ప్రారంభం కానుంది. పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలతోపాటు ప్రపంచంలో ఆర్థిక అసమానతలపై నేతలు చర్చిస్తారు. నిరసనల నేపథ్యంలో స్విస్, ఫ్రెంచ్ వర్గాలు వేలమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాయి. రహదారుల్ని స్తంభింపజేశాయి. అనధికార సమావేశాలను నిషేధించడం సహా రకరకాల ఆంక్షల్ని విధించాయి.

## అమెరికాతో ఇరాన్‌కు
# కుదిరిన ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

సంతకాలు జరిగిన వెంటనే హర్మూజ్ జలసంధి తెరుచుకొంటుందని ట్రంప్ పేర్కొన్నారు. చమురు రవాణ, సీమైన్స్ తొలగింపు ప్రారంభమవుతాయని వెల్లడించారు. దీంతో దాదాపు 107 రోజులపాటు మూతపడిన హర్మూజ్ మళ్లీ తెరుచుకోనుంది.

తాజాగా ఇరాన్తో కుదిరిన ఒప్పందం రానున్న 50 ఏళ్లలో పశ్చిమాసియా మౌలిక స్వరూపాన్నే మార్చేస్తుందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. టెహ్రాన్ ఇక ఎప్పటికీ అణ్వాయుధాలు సంపాదించలేదన్నారు. కాకపోతే శుక్రవారం జరగనున్న సంతకాల కార్యక్రమానికి ఎవరు వెళ్లాలన్న అంశంపై ట్రంప్ కార్యవర్గం ఆలోచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మరోవైపు ట్రంప్నకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సెనెటర్ లిండ్సే గ్రాహం మాత్రం ఆచితూచి స్పందించారు. అమెరికా బృందం కంటే భిన్నంగా ఇరాన్ ఈ ఒప్పందాన్ని చూస్తుందని అభిప్రాయపడ్డారు. టెహ్రాన్ అణ్వాయుధాలను వదులుకోవడంపై సందేహాలను వ్యక్తంచేశారు.

# అమెరికా-ఇరాన్ డీల్

(మొదటి పేజీ తరువాయి)

రాసుకొచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

# ఏఐను వాడి గూగుల్‌ను ఓడించిన లాయర్

(మొదటి పేజీ తరువాయి)

వయసులోనే తాను యూట్యూబ్, ఫేస్‌బుక్ ఖాతాలను తెరిచానని.. 'ఇన్ఫినిట్ స్క్రోల్' వంటి డిజైన్ల వల్ల అత్యధిక సమయం వాటిలోనే గడిపానని పేర్కొంది. ఈమెలాగే వేల మంది ఈ ప్లాట్ఫామ్లకు బానిసలవుతున్నారని లాయర్ నిరూపించారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు ప్రమాదకరమైనవని తెలిసినా మెటా, గూగుల్లు వాటిని సరిచేయడంలో విఫలమయ్యాయని న్యాయస్థానం పేర్కొంది. బాధితురాలికి 6 మిలియన్ డాలర్లు (రూ.56 కోట్లు) చెల్లించాలని ఆదేశించింది. ఆ మొత్తంలో 70శాతం మెటా చెల్లించాలని, మిగిలిన మొత్తాన్ని గూగుల్ యాజమాన్యంలోని యూట్యూబ్ చెల్లించాలని పేర్కొంది. కృత్రిమ మేధను అభివృద్ధి చేసే మెటా, గూగుల్లను ఓడించడానికి లాయర్ అదే ఏఐని వాడడం గమనార్హం.

# ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ శుక్లా, సీఎం రేవంత్

### కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో కేట్ కట్ చేసిన భట్టి

**హైదరాబాద్, జూన్ 15 ( మనం బ్యూరో ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు సోమవారం ప్రజా భవన్‌లో ఘనంగా జరిగాయి. భట్టి జన్మదినం సందర్భంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ



చీఫ్ మీనాక్షి నటరాజన్‌తో పాటు పలువురు మంత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, మెయినాబాద్ నజీబ్‌నగర్‌లో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి భట్టి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అక్కడే పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసిన భట్టి మన బిడ్డల భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తున్నదనీ, ప్రైవేటు పాఠశాలల్లో ఆదాయ వర్గాల పిల్లలు ఏ విధంగా చదువుతున్నారో అదే స్థాయిలో ప్రభుత్వ వసతి సంక్షేమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అదే స్థాయిలో మెరుగైన బోధన, నాణ్యతతో కూడిన యూనిఫార్మ్స్, షూస్ అందిస్తున్నట్లు వెల్లడించారు.

# భారత్-ఫ్రాన్స్ మధ్య 13 ఒప్పందాలు

(మొదటి పేజీ తరువాయి)




ఖరారయ్యాయి. నవకల్పనల రంగానికి ఒక మార్గసూచీని నిర్ణయించారు. సంక్లిష్ట రంగాల్లో సంబంధాల విస్తృతికి సంయుక్తంగా ఏఐ ఆధారిత వ్యవస్థను తీర్చిదిద్దాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారు. హైస్పీడ్ రైల్వేకు సహకారం, రహస్య సమాచారంపై భద్రతా ఒప్పందం, పారిస్.. నీస్ విమానాశ్రయాలకూ యూపీఐ చెల్లింపుల వ్యవస్థ విస్తరణ వంటివి ఒప్పందాల జాబితాలో ఉన్నాయి.

**భారత్‌లో తయారీకి పెద్దపీట**

డసో ఏవియేషన్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాలు కొనాలన్న ప్రతిపాదన కూడా చర్చకు వచ్చిందని, ఉమ్మడిగా చేపట్టే రక్షణరంగ ప్రాజెక్టుల్లో గరిష్ఠస్థాయిలో స్థానిక ఉత్పత్తుల వినియోగం ఉండాలనే అంశంపై భారత్ ఎక్కువగా దృష్టి సారించిందని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ విలేకరులకు వెల్లడించారు. కలిసి అభివృద్ధి చేయడం, ఉమ్మడిగా డిజైన్ రూపొందించడం, కలిసి ఉత్పత్తి చేయడం, భారత్లో తయారీకి అగ్రతాంబూలం ఇవ్వడం గురించి మోదీ నొక్కి చెప్పారని తెలిపారు. జైతాపుర్ అణు ఇంధన ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థిక అంశాలపైనా చర్చించారని వెల్లడించారు. ఫ్రాన్స్‌కు చెందిన న్యూక్లియర్ కంపెనీలు భారతీయ అణు రంగంలో నేరుగా పాల్గొనేందుకు, ప్రైవేటు రంగ కంపెనీలతో కలిసి పనిచేసేందుకు వీలుగా చర్చలు జరిగాయని చెప్పారు. వాణిజ్యం పెంపుదలకు ఉన్నతస్థాయి యంత్రాంగం నెలకొల్పడం, నవకల్పనల్లో 2030 నాటికి మార్గసూచీ రూపకల్పన, వివిధ సంస్థల మధ్య 19 ఒప్పందాలకు సంతకాలు, ఏఐపై సంయుక్త బృందం ఏర్పాటు వంటివి దీనిలో ఉన్నాయని మిస్రీ తెలిపారు. విద్యార్హతల్ని పరస్పరం గుర్తించడంపైనా, ఒక దేశ విద్యార్థులు రెండో దేశంలో చదువుకోవడంపైనా మోదీ, మెక్రాన్ చర్చించినట్లు చెప్పారు. నూతన విద్యా విధానం కింద ఫ్రెంచి విశ్వవిద్యాలయాలు భారత్‌లో ప్రాంగణాలు నెలకొల్పాలని ప్రధాని కోరినట్లు తెలిపారు. ఏరోనాటిక్స్, అనుబంధ రంగాల్లో జాతీయ నైపుణ్య కేంద్రాన్ని కాన్పుర్లో నెలకొల్పేందుకు కూడా ఒక ఒప్పందం కుదిరింది. విమానయాన రంగంలో పరిశోధనలకు, సంస్థల మధ్య సమన్వయానికి ఇది వీలు కల్పిస్తుంది. పౌర అణు ఇంధనం, రక్షణ, భద్రత, శాంతి, వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, నవ్యావిష్కరణలు, విద్య, ప్రజల మధ్య సంబంధాలు సహా అనేక అంశాలపై మోదీ, మెక్రాన్ చర్చించుకున్నారు.

# 'మెట్రో'కు కిషన్ రెడ్డి అడ్డు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించామనీ, ఈక్విటీ కింద మరో 1400 కోట్లు జమ చేశామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులు ఖట్టర్‌ను మే 20న, 21న అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి రుణం ఇవ్వొద్దని చెప్పారన్నారు. అందుకే కిషన్ రెడ్డి వెంట పడుతున్నాయనీ, ఆగిపోయిన నిధులను విడుదల చేయించే బాధ్యత కిషన్ రెడ్డిదేనన్నారు. మీకు కష్టమనుకుంటే 50 శాతం భాగస్వామ్యం అవసరం లేదు, ఎన్‌వోసీ ఇవ్వండి మేమే పూర్తిగా భరించి మెట్రో విస్తరణ చేసుకుంటామని స్పష్టం చేశారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు స్పీడ్ అయ్యాక వెళ్లి రామ్మోహన్ నాయుడిని కలిశాడు...ఆ పనులు స్లో అయ్యాయని ఆరోపించారు. తెలంగాణలో మెట్రో విస్తరణ పూర్తయితే బీజేపీకి ఇబ్బందులు వస్తాయని చెప్పి ఐఆర్ఎఫ్‌సి వద్దకు వెళ్లి రుణ ప్రక్రియను అడ్డుకున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో బీజేపీ ఉండాలా ? మూసి వేయాలా ? అంటూ ఒత్తిడి తెచ్చి సోమవారం బదిలీ కావాల్సిన లోన్‌ను అడ్డుకున్నారని తెలిపారు. అసలు ఐఆర్ఎఫ్‌సి లోన్ ఎందుకు ఇవ్వడం లేదో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలనీ, దీనిపై కేంద్ర మంత్రిగా మీరు బాధ్యత తీసుకుని మాట్లాడతారా ? అని ప్రశ్నించారు. ఒకవేళ కేంద్రం లోన్ ఇవ్వని పక్షంలో ఎన్‌వోసీ అయినా ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ తిట్టినట్లు తామెప్పుడూ కిషన్ రెడ్డిని అసభ్య పదజాలంతో తిట్టలేదనీ, కేంద్ర మంత్రిగా ఆయన మెట్రో రైల్‌కు కేంద్రం అనుమతులు, నిధులు తీసుకొస్తే శాలువా కప్పి సన్మానం చేస్తామన్నారు. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీని మోదీ నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. కేంద్రంలో బీజేపీ మిత్రుల సహకారంతో నడుస్తోంది. నేను ఫుల్ మెజార్టీతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నా. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే...నేనూ రాజీనామా చేస్తానని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# వలపు వలతో మనీ ట్రాప్

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా వృద్ధుడితో పరిచయం పెంచుకున్న సైబర్ కేటుగాళ్లు అతనితో శృంగారంలో పాల్గొన్నట్లు వీడియో క్రియేట్ చేసి ఆపై బెదిరించి లక్షల రూపాయలు దోచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడికి మాయ రాజ్‌పుత్ అనే మహిళ పేరుతో ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఆ తర్వాత అవి వాట్సాప్ కాల్స్‌లా మారాయి. మహిళ పేరుతో స్కామర్స్ వృద్ధుడిని హనీ ట్రాప్ చేశారు. అతడితో చనువుగా మాట్లాడుతూ.. తమ వలలో వేసుకున్నారు.వృద్ధుడు హనీట్రాప్ ముఠాను పూర్తిగా నమ్మడం మహిళ పేరుతో మాట్లాడుతూ.. ఆస్పత్రి ఖర్చులు, బంగారం తాకట్టు నుంచి విడిపిం చడం, ఫ్లాట్ రిజిస్ట్రేషన్ అంటూ రకరకాల కారణాలు చెప్పి వృద్ధుడి వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు కాజేశారు. అలా బాధితుడిని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి.. అతడి వద్ద నుంచి రూ.7.11 లక్షలు కాజేశారు. అంతటితో ఆగక.. మరింత డబ్బులు కావాలని డిమాండ్ చేయసాగారు. వృద్ధుడు తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో.. పర్సనల్ వీడియో చూపించి బెదిరించసాగారు.దీంతో ఆందోళనకు గురైన వృద్ధుడు తన సమస్య గురించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే వారి సాయంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునే పనిలో ఉన్నారు. పెళ్లి పేరిట నమ్మించి ఆపై ట్రాప్ చేసిన ఘటన హైదరాబాద్ నగరంలోని రహమత్‌నగర్‌లో చోటుచేసుకుంది. రహమత్‌నగర్‌కు చెందిన లక్ష్మి భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటోంది. ఆమె రేషన్ కార్డు కోసం ఖైరతాబాద్ సివిల్ సప్లై ఆఫీసు వెళ్లడంతో అక్కడ ఎల్డీసీగా పనిచేస్తున్న సాయికిరణ్‌తో పరిచయం ఏర్పడింది.



దీన్ని ఆసరాగా చేసుకుని సాయికిరణ్‌ను లక్ష్మి తన వలలో వేసుకుంది. ఆ తర్వాత ఇద్దరూ ఓయో రూమ్‌లకు వెళ్లడం, ఆమె ఇంటికి అతడు రావడం వంటివి సాగాయి. ఈ క్రమంలోనే పెండ్లి చేసుకుంటానని నమ్మించి సాయికిరణ్ నుంచి డబ్బులు లాగడం మొదలుపెట్టింది. మొదట్లో రూ.5 వేలతో మొదలుపెట్టి ఆ తర్వాత లక్షల్లో డిమాండ్ చేసింది. ఇద్దరి ఫొటోలు, ఓయో రూమ్ రసీదులను పోలీసులకు చూపిస్తానని బెదిరించి రూ.6 లక్షల వరకు స్వాహా చేసింది. ఇటీవల కొడుకు ప్రవర్తనను గమనించిన తల్లి భూదేవి నిలదీయడంతో లక్ష్మి చేతిలో బ్లాక్‌మెయిలింగ్‌కు గురవుతున్నట్లు వివరించాడు. దీంతో పోలీసులు లక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారించగా, మోసం నిజమేనని తేలడంతో ఆమెను జైలుకు తరలించారు.

ఇటీవల జూబ్లీహిల్స్‌లో ఏపీలోని గుంటూరుకు చెందిన అర్జున్, ప్రవీణ్ పేర్లతో ఇన్‌స్టాగ్రామ్‌ను వేదికగా చేసుకుని పదుల సంఖ్యలో మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని మనీ ట్రాప్‌కు పాల్పడ్డారు. ఈ కేసులో కీలక నిందితుడు అర్జున్ రిచ్ కిడ్స్‌ను టార్గెట్‌గా ఎంచుకుని సోషల్ మీడియాలో వారిని ఆకర్షించేలా కంటెంట్ తయారు చేసి, వారిని నమ్మించేవాడు. ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవితం చూపిస్తూ బాలికలను వలలో వేసేవారు. వారిని బయటకు తీసుకెళ్లిన తర్వాత కార్లలోనే లైంగిక దాడులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ ఘటనలను రహస్యంగా చిత్రీకరించి, ఆ వీడియోలతో బాధితులను బెదిరించి డబ్బులు వసూలు చేసేవారు. ఒక మైనర్ బాలిక నుంచి రూ.13 లక్షలు తీసుకున్న విషయం బయటపడింది. సదరు నిందితులు ఇప్పటివరకు సుమారు 19 మంది బాలికలను ఈ గ్యాంగ్ ట్రాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఇటీవల హనీట్రాప్‌లో హరియాణకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకుంది. ఈక్రమంలో ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే..హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్‌తో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

# నీట్ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తోన్న ఎన్టీఏ

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. సాంకేతిక సమస్యలు, సర్వర్ ఇబ్బందుల కారణంగా అడ్మిట్ కార్డులను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోలేకపోతున్నట్లుగా పేర్కొంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు తమ టీమ్ పనిచేస్తోందని, అభ్యర్థులందరికీ అతి త్వరలోనే అడ్మిట్ కార్డులు అందేలా చూస్తామని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నట్లుగా 'ఎక్స్'లో రాసుకొచ్చింది. మరోవైపు, డౌన్‌లోడ్ లింక్ సరిగ్గా పనిచేయకపోవడంతో ఆల్టర్నేటివ్ లింక్ను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఏటా తప్పిదాలు చోటుచేసుకుంటున్నా ఈ సంస్థ మాత్రం తన పనితీరును మార్చుకోవడం లేదంటూ తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. దీనికితోడు రీఎగ్జామ్ హాల్టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొనే ముందే రీఫండ్‌కు సంబంధించి బ్యాంకు వివరాలను ధ్రువీకరించుకోవడం తప్పనిసరి చేయడం మరింత గందరగోళానికి దారితీసినట్లు కనబడుతోంది.

అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసే క్రమంలో ఫీజు రీఫండ్ ఆప్షన్ మరోసారి చెక్ చేసుకోవాలని మెసేజ్ వస్తోందని, బ్యాంకు వివరాల నమోదు చేసేందుకు వెళ్తే తమ పాత వివరాలు కనిపించడంలేదని పలువురు వాపోతున్నారు. 'మీకు రీఫండ్ అవసరం లేకపోతే ముందుకెళ్లండి' అనే మెసేజ్ కనబడటంతో డబ్బులు రీఫండ్ చేయకుండా ఉండేందుకు ఎన్టీఏ ఎత్తుగడలు వేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

**సమస్య పరిష్కరించాలని విద్యార్థుల వేడుకోలు**

బ్యాంకు వివరాలను వెరిఫై చేసుకున్నా.. అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ కావడం లేదని మరికొందరు విద్యార్థులు వాపోతున్నారు. ఎన్టీఏ ఎక్స్‌లో పెట్టే పోస్టుల కింద తమ సమస్యను పరిష్కరించాలంటూ వేడుకొంటున్నారు. నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసే సమయంలో తమకు ఎదురైన అనుభవాలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను జత చేస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి 12 గంటల మధ్య తాను ఎంత ప్రయత్నించినా అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ కాలేదని, నాలుగుసార్లు ప్రయత్నిస్తే డౌన్‌లోడ్ చేయగలిగినట్లు ఓ విద్యార్థిని తెలిపారు.

# ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

నిరంతర అప్రమత్తతతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే అన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు తీసుకోవడం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. సీఎంరేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంచాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తూ రాబోయే 3 నుంచి 4 రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరించే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించగా, ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతోందన్నారు. జూన్ 14 నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాలు, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు ఉందని పొంగులేటి పేర్కొన్నారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బందితో నిరంతరం సమన్వయం కొనసాగించాలని మంత్రి స్పష్టం చేశారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

# తెలంగాణకు అలర్ట్...

- జూన్ 19 నుంచి వారం రోజుల పాటు భారీ వర్షాలు
- రాష్ట్రవ్యాప్తంగా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగాలను అప్రమత్తం చేసింది. జూన్ 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇవి వారం రోజుల పాటు కొనసాగవచ్చన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రభుత్వం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. నైరుతి రుతుపవనాలు జూన్ 8న జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశించి, జూన్ 14 నాటికి దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాలకు విస్తరించాయి. ఇవి రానున్న మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా, జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 49.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సాధారణ వర్షపాతం 54.9 మి.మీ. కంటే ఇది 10 శాతం తక్కువగా నమోదైంది. వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే, జూన్ 18-20 తేదీల మధ్య హైదరాబాద్, రంగారెడ్డి సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు (64.5-115.5 మి.మీ.) కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో అలర్ట్ జారీ చేశారు. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని అధికారులకు సూచించారు.

## 'సర్'ను ఆషామాషీగా
# తీసుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుందనీ, అదే జరిగితే రాజకీయంగా అత్యంత ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో 'సర్'పై నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 2028 ఎన్నికలకు 2026 అక్టోబర్‌లోనే ఓటర్ల జాబితా ఫైనల్ అవుతుందనీ, ఓట్లు తొలగిపోతే తరువాత చేసేదేం ఉండదని పేర్కొన్నారు. 119 నియోజకవర్గాలలో ప్రతి గ్రామంలో ప్రతి బూత్‌లో బీఎల్‌వోలతో ముఖ్య నాయకులను అనుసంధానం చేసుకోవాలనీ, వలసలు వెళ్లిన ఓటర్లు బీఎల్‌వోలు వెళ్లినప్పుడు నివాసంలో ఉండకపోవచ్చనీ, అలాంటి



ఓట్లను తొలగించకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు. ఈనెల 20లోగా జిల్లాల ఇంచార్జి మంత్రులు సంబంధిత పార్లమెంటు, అసెంబ్లీ ఇంచార్జిలతో సమీక్ష నిర్వహించుకోవాలనీ, ఎక్కడైనా సమస్య వస్తే సంబంధిత అసెంబ్లీ ఇంచార్జిని అప్రమత్తం చేయాలని సూచించారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఎక్కడైనా సమస్య వస్తే సంబంధిత ఇంచార్జిలదే బాధ్యత అనీ సర్‌ను ఆషామాషీగా తీసుకోవద్దని హెచ్చరించారు. ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ బీజేపీ ఎన్నికల కమిషన్ ఓట్ చోరీనే పనిగా పెట్టుకుందన్నారు. ఓట్‌ను నిలబెట్టడానికి అవసరమైన అన్ని పత్రాలు సిద్ధం చేసుకుని సిద్ధంగా ఉండాలనీ, అందుకోసం ప్రతి కార్యకర్త అవగాహన పెంచుకొని ప్రజల్లో చైతన్యం తేవాలని సూచించారు.

## ప్రజలకు మరింత
# చేరువయ్యాం

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేకపోయామనీ వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలనీ మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తాము చేసిన మంచి పనులను చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను నమోదు చేయాలనీ, గ్రామాల్లో వచ్చిన సమస్యలను ఆయా శాఖలు పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు లేని భవనాలు లేని గ్రామాలను గుర్తించి ఆ జాబితాను



సిద్ధం చేయాలనీ, వెంటనే కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యా, వైద్య విభాగాల్లో పాఠశాల నుంచి కాలేజీల వరకు, పీహెచ్‌సి నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలనీ సూచించారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించినట్లే జిల్లాల వారీగా వెంటనే సమీక్షలు జరపాలనీ, ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి ఆ జిల్లాకు పంపాలని పేర్కొన్నారు. స్పెషలాఫీసర్ జిల్లా కలెక్టర్లతో కలిసి 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలపై వచ్చిన స్పందనలన్నీ సమీక్షించాలనీ, జిల్లాల వారీగా ప్రగతి నివేదికలు విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలవారీగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సేకరించి డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



# అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలపెంపుపై ప్రత్యేక దృష్టి

- 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట'తో నూతన విద్యా సంవత్సరానికి శ్రీకారం
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్,జూన్15(మనం న్యూస్)ః రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల నమోదు పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ఎంజీ నగర్-2 అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, మురాద్‌నగర్, మాసాబ్‌ట్యాంక్, చాచా నెహ్రూ పార్క్ సమీపంలో నిర్వహించిన 'అమ్మ మాట అంగన్వాడీ బాట' కార్యక్రమాన్ని ప్రారంభించి నూతన విద్యా సంవత్సరానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా మంత్రి చిన్నారులకు స్థానిక శాసనసభ్యులు మాజిద్ హుస్సేన్ , ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తో కలసి రెండు జతల యూనిఫారాలు అందచేసి , పలకపై అక్షరాభ్యాసం చేయించారు.తదుపరి విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ప్రాథమిక బాల్య విద్యా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా ప్రోత్సహించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య, పోషకాహారం కీలక పాత్ర పోషిస్తాయని, అర్హులైన ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అందిస్తున్న సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలకు పిలుపునిచ్చారు.

తదనంతరం మంత్రి 'అమ్మ మాట అంగన్వాడీ బాట' నినాదాలతో అవగాహన ర్యాలీలో పాల్గొని, సమీప అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలను నమోదు చేయాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న ప్రాథమిక బాల్య సంరక్షణ, విద్య, పోషకాహారం అలాగే ఆరోగ్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమని సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# 'బడి' భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం

- వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సర్కార్
- వారంలో మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి మాల్ట్ పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 1,269 పాఠశాలల్లో 1.44 లక్షల మందికి ప్రయోజనం
- హైదరాబాద్‌లో లాంచనంగా ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,జూన్15(మనం న్యూస్)ః వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకువిద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లుప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

**రాజధానిలో ప్రారంభంః**

హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు.


**విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలుః**

పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 'పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం' అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. 'అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు.

విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద' అని విద్యార్థులకు సూచించారు.

# అస్తిత్వాన్ని కాపాడేందుకు పోరాటం చేస్త

- టీఆర్ఎస్ చీఫ్ కవిత



హైదరాబాద్,జూన్ 15(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడడం కోసం పోరాటం చేస్తానని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. మంచిర్యాల జిల్లాలో సోమవారం బాయి బాట కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. బెల్లంపల్లి పట్టణంలోని పాత బస్టాండ్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తిలక్ స్టేడియం వరకు ర్యాలీగా తరలి వెళ్లారు. సందర్భంగా కవిత మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిని పక్కకు పెట్టి ఎమ్మెల్యే హైదరాబాదులో ఉండడం విడ్డూరం అన్నారు. రెండు నెలలకు ఒకసారి నియోజకవర్గానికి వస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా గారడి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఎల్లంపల్లి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపిస్తానని మాట ఇచ్చారు. బెల్లంపల్లిలో చింతలమయమైన రోడ్లను చూసి ధ్వజమెత్తారు. తెలంగాణ రక్షక సేన టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటుతో ముందుకు రావడం జరిగిందన్నారు. ఐదు అంశాలతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు విద్య అందని మిద్దెగానే మారిందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య, వైద్యం, యువకులకు సొంతగా పరిశ్రమల ఏర్పాటు కు రూ.10 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాల మంజూరు, ఉద్యోగాల ఏర్పాటు, రైతులు ఇబ్బంది పడకుండా వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ. జనార్ధన్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, రాష్ట్ర నాయకుడు సాజన్, మౌనిక్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం

- నూతన కార్యవర్గం ఏకగ్రీవం

హైదరాబాద్,జూన్15(మనం న్యూస్)ః తెలంగాణ సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారులు అధికారికంగా ఎన్నిక పత్రాలను నూతన బాధ్యులకు అందజేశారు. సంఘం ఐక్యతను చాటుతూ అన్ని ప్రధాన పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. సంఘం అధ్యక్షుడిగా మంగదొడ్డి శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శిగా టి. వెంకటరమణ, అడిషనల్ సెక్రటరీగా జి. శ్రవణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఉడుత అశోక్, జి. లావణ్య లత ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా అంబటి వీరాంజనేయులు, కూరపాటి ఆశాజ్యోతి, కమటం తిరుపతి, బి. రామ్ గోపాల్ (లెజిస్లేచర్) బాధ్యతలు స్వీకరించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి. సైదులు (ఫైనాన్స్), పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్. రామలింగయ్య (ట్రైబల్ వెల్ఫేర్), కోశాధికారిగాకాదరి నవీన్ కుమార్ ఎన్నికయ్యారు.

బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలేల ఆశయాలకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సచివాలయంలో బీసీ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, ప్రమోషన్లు, ఇతర సేవా విషయాలలో ఎదురయ్యే సమస్యలపై నిరంతరం గళం విప్పుతామని, 2025 బ్యాచ్ యువ ఉద్యోగులను కలుపుకుంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అధ్యక్షులు మంగదొడ్డి శ్రీనివాసులు,ప్రధాన కార్యదర్శి వెంకట్ రమణ ప్రకటించారు.

# వారంటే? నాకు గౌరవం.. జాప్యంపై తగదు?

## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో నిర్లక్ష్యంపై అగ్రహం

## 12 ఏళ్లు సరిపోలేదా? నేటికి అమరుల అశయాలు నేరవేరలే?

## ఢిల్లీలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా?.. రాష్ట్రం కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన అమరవీరులను గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... తెలంగాణ ఏర్పాటు కోసం 1200 మంది పౌరులు అమరులైతే.. వారిని గుర్తించేందుకు ఇంకా ఎన్నేళ్లు తీసుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ తనకు స్ఫూర్తినిచ్చిన నేల అని.. తమ గడ్డ కోసం వందల మంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించిందని ఆయన పేర్కొన్నారు. అందుకే తెలంగాణ అమరులు అంటే తనకు గౌరవమని.. యువతను బలిచేసి కొందరు నేతలు గద్దెనెక్కారని విమర్శలు గుప్పించారు.

తెలంగాణ ఉద్యమం కోసం 'ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అన్నారు. అందుకే, నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది' అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు. యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

తెలంగాణ నేతలు, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులు అర్పించేందుకు తాను హైదరాబాద్ బయలుదేరితే.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తనకు పర్మిషన్ ఇవ్వలేదని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. తాను హైదరాబాద్‌కు వెళ్లొద్దా అని ప్రశ్నించారు. ఇండియా గేట్ వద్దకు వెళ్లి సైనికులకు వందనం చేయాలంటే కాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో పుట్టాలా? అని ప్రశ్నించారు. తెలంగాణ తన నేల కాదా? అని.. ఇది తన దేశం కాదా? అని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. అమరుల నివాళులకు కూడా అనుమతి కావాలా? అని నిలదీశారు. తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని ఆయన మండిపడ్డారు.

# డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు

## ఎండీఎంఏ తయారీపై ఈగల్ ఎటాక్

## రూ. 50 లక్షల రసాయనాలు స్వాధీనం

హైదరాబాద్,జూన్ 15(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః హైదరాబాద్ నగర శివారులోని అబ్దుల్లా పూర్మెట్లో అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టును ఈగల్ టీం రట్టు చేసింది. ఖరీదైన డ్రగ్స్ తయారు చేస్తున్న నరేష్, మత్స్యగిరిలను ఈగల్ టీం సోమవారం అరెస్ట్ చేసింది. ఈ ముఠాలో సంతోష్ సింగ్ అలియాస్ రాజు అలియాస్ రాజేష్, విజయ్, అశ్విని పాఠక్ కీలక సభ్యులుగా ఉన్నారని, నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన మెఫెడ్రోన్‌తో పాటు రసాయనాలను స్వాధీనం చేసుకున్నామని ఈగల్ టీం తెలిపింది. అలాగే రూ.50 లక్షల విలువైన ఆ ఫ్యాక్టరీని సీజ్ చేశామని, ఈ కేసులో కీలక నిందితులు నరేష్, కీసర మత్స్యగిరిలు గత కొన్ని సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నారని ఈగల్ టీం వెల్లడించింది.

రసాయన శాస్త్రవేత్త నుంచి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా సభ్యులుగా ఈ ముఠా ఎదిగారని, గతంలో వీరు హత్యలు, దోపిడీలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని వివరించింది. చివరకు వీరు డ్రగ్స్ తయారీదారులుగా మారారని గత ఆరు నెలలుగా వీరి కోసం గాలిస్తున్నామని చెప్పింది. 2015 నుంచి దేశవ్యాప్తంగా అక్రమ డ్రగ్స్ తయారీ కేంద్రాలను ఈ ముఠాఏర్పాటు చేసి.. తన కార్యకలాపాలు కొనసాగిస్తుందని ఈగల్ టీం వివరించింది. నిందితులకు అంతర్జాతీయ డ్రగ్ రాకెట్తో కీలక సంబంధాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైందని, డ్రగ్స్ ముఠాలో సంతోష్ సింగ్ అలియాస్ రాజు, అలియాస్ రాజేష్, విజయ్, అశ్విని పాఠక్ కీలక సభ్యులుగా గుర్తించామని పోలీసులు తెలిపారు.

# విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఉండొద్దు

- రాష్ట్రవ్యాప్తంగా'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్'
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎండీ జితేష్ వి. పాటిల్



హైదరాబాద్,జూన్15(మనం న్యూస్)ః వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ వ్యవస్థను మరింత భద్రంగా ఉంచడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ప్రధాన లక్ష్యమని టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. వర్షాకాలంలో నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా టీజీఎస్పీడీసీఎల్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తిరుమలగిరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ వేణుగోపాల్ నగర్ ఫీడ్‌పై వాక్ ఎలాంగ్ విత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫీడర్ వెంబడి పాదయాత్ర చేస్తూ విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు, ఇన్సులేటర్లు, కండక్టర్లు,ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో 33 కేవీ సబ్‌స్టేషన్లు, 33 కేవీ,11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు , ఎల్.టి. నెట్వర్క్‌లను సమగ్రంగా తనిఖీ చేసి వర్షాకాలానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్, రంగారెడ్డి,మేడ్చల్ జోన్‌ల ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నాణ్యత, లైన్ క్లియరెన్స్, నిర్వహణ పనులు, పరికరాల స్థితిగతులు,నెట్‌వర్క్ పనితీరును సీఎండీ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యుత్ అంతరాయాలకు దారితీసే సమస్యలను ముందుగానే గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తిరుమలగిరి సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ వేణుగోపాల్ నగర్ ఫీడ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ జితేష్ వి. పాటిల్ పాల్గొని విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మరు,ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గన్‌రాక్‌లోని మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో మున్సూన్ సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, లైన్ క్లియరెన్స్‌లు, ట్రీ ట్రిమ్మింగ్ పనులు, ఫీడర్ల నిర్వహణ, ట్రాన్స్ఫార్మర్ల భద్రత,అత్యవసర స్పందన వ్యవస్థలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ ప్రత్యేక కార్యక్రమం నెలాఖరు వరకు కొనసాగనుందని, విద్యుత్ లైన్లను తాకే చెట్ల కొమ్మలను తొలగించడం ద్వారా షార్ట్ సర్క్యూట్లు, ఫీడర్ ట్రిప్పింగ్‌లు,విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నారు.

# విదేశాల్లో తెలంగాణ బియ్యానికి ఫుల్ డిమాండ్

- ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి:
- కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచన
- 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు..
- మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం
- ప్రజాభవన్ లో డిప్యూటి సీఎం భట్టిఅధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం
- సమావేశానికి హాజరైన మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు,



హైదరాబాద్,జూన్15(మనం న్యూస్)ః దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లోనూ అద్భుతమైన డిమాండ్ ఉన్న 8 రకాల మేలురకం వరి సాగుపై రైతులకు పెద్ద ఎత్తున విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజా భవన్‌లో సోమవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు,ఉత్తమ్ కుమార్ రెడ్డి,తుమ్మల నాగేశ్వర్ రావులు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చాలా లోతుగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు పాల్గొని పలు కీలక ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు లాభదాయకం, ఎగుమతులకు అనుకూలమైన బీపీటీ 5204, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), కేఎన్ఎం-1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్ 962, డబ్ల్యూజీఎల్ 44, జేజీఎల్ 1798 ఈ 8 రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక 8 రకాల వంగడాలను సాగు చేయడం వల్ల రైతులకు మార్కెట్లో తిరుగులేని డిమాండ్ లభిస్తుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వివరించారు.

**విపరీతమైన ఆదరణ ః**

మార్కెట్లో తెలంగాణ బియ్యానికి ఉన్న విపరీతమైన క్రేజ్ దృష్ట్యా, ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని,''తెలంగాణ నుంచి విదేశాలకు ఎగుమతి చేయడానికి ఇవి అత్యంత అనుకూలమైనవని, ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉంది. దీనివల్ల ఇది రైతులకు అత్యంత లాభదాయకమైన పంటగా మారనుంది. ఈ మేలు రకం పంటలను సాగు చేయడానికి మార్కెట్లో విత్తనాల కొరత అస్సలు లేదని, కాబట్టి సాగును విస్తృతం చేయడం సులువని'' శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. రైతుల ఆదాయం గణనీయంగా పెరగాలన్నా, అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకులనుండి రైతులకు పూర్తి రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల వంగడాల సాగు ఒక్కటే మార్గం. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడంద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్లు సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించారు.

**మార్కెట్ డిమాండ్ ఆధారిత పంటలుః**

రాష్ట్రంలో సాగు చేస్తున్న అన్ని రకాల సన్న బియ్యానికి మార్కెట్లో ఆదరణ లభించడం లేదని సివిల్ సప్లై అధికారులు మంత్రులకు వివరించారు. కొన్ని రకాల వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు బియ్యం ఎక్కువగా విరిగిపోతుండటం (బ్రోకెన్ రైస్), అలాగే వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా అవి లేకపోవడంతో మిల్లర్లు, వ్యాపారులు వాటిని కొనుగోలు చేయడానికి ఇష్టపడటం లేదని, వినియోగదారులు, మిల్లర్లు మరియు వ్యాపారులకు ఇష్టమైన.. అలాగే అంతర్జాతీయంగా ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాలను మాత్రమే ఇకపై ప్రోత్సహించాలని, డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించడం మంచిదని అభిప్రాయపడ్డారు.

ఈ విధానం వల్ల మిల్లర్లే నేరుగా రైతుల వద్దకు వచ్చి మంచి ధరలకు వరిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని, తద్వారా రైతులకు లాభం చేకూరడమే కాకుండా, ప్రజలకు కూడా ఇష్టమైన నాణ్యమైన బియ్యం అందుబాటు ధరల్లో లభిస్తాయని అధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని కేబినెట్ సబ్ కమిటికి అధికారులు నివేదించారు.భవిష్యత్తులో రైతులకు నష్టాలు రాకుండా ఉండేందుకు పూర్తిగా మార్కెట్ డిమాండ్ ఆధారిత పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులు మంత్రులకువివరించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్ కుమార్ సుల్తానియా,వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి సురేందర్ మోహన్, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపీ, మార్క్‌ఫెడ్ ఎం.డి రాహుల్ రాజ్, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## అంత జాగ్రత అక్కరలేదు

అంతజాగ్రత్తగా ఏమీ వుండకు
నీకు దెబ్బలేమీ తగలవు

కాలినడకన వెళ్ళు
కాళ్లకు రాళ్లు గుచ్చుకుంటే గుచ్చుకోనీ

బాటపక్కన పెరిగిన ముళ్లు,
వొళ్లంతా గీరుకుంటే గీరుకోనీ

అంత జాగ్రత్తగా ఉండక్కర్లేదు
ఎముకలేమీ విరిగిపోవు

నీవు ఇష్టపడే పువ్వునెవరు కోసివ్వరు
ఇంద్రధనుస్సును కత్తిరించుకొచ్చి

నీ తలకెవరు చుట్టరు
అందకపోయినా పైకి ఎగరడం నేర్చుకో

అంత జాగ్రత అక్కరలేదు
నిన్నెవరు భుజాలామీద ఎత్తుకోరు

వర్షంలో తడవాలి, చలిలో వణకాలి
ఎండలో ఏముందో, మండిపోయి చూడాలి

అంత జాగ్రత పడక్కరలేదు
నీవేమీ ఓడిపోవు, గెలుస్తాననుకోవాలి

జీవితం నదిమీది వంతెనకాదు
ఈతరాకపోయినా, కొట్టుకుపోయి ఒడ్డుకు చేరాలి

అంత జాగ్రత అక్కరలేదు
నిన్నునీవు కట్టేసుకొని బందీగా వుండకు

**- ఆశారాజు**
9392302245

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**
**- ఎడిటర్**

# విద్యారంగంలో సరికొత్త సంస్కరణలు

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కేవలం అక్షరాస్యతను పెంచే సాధనం మాత్రమే కాదు. అది సామాజిక సమానత్వానికి, ఆర్థిక ప్రగతికి అత్యంత బలమైన పునాది. 2026 జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న 2026-27 నూతన విద్యా సంవత్సరం ఈ ప్రయాణంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవబోతోంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం మాత్రం తెలంగాణ విద్యా చరిత్రలో సరికొత్త ఆశలకు, మహత్తర ఆకాంక్షలకు వేదికగా మారుతోంది. కేవలం పాఠ్యపుస్తకాల పరిమిత పరిధిని దాటి, డిజిటల్ విప్లవాన్ని అందిపుచ్చుకుంటూ, మౌలిక వసతుల నాణ్యతను పెంచుకుంటూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలకు దీటుగా ముస్తాబవు తున్నాయి.

విద్యా రంగం అనేది ఒక వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దడమే కాకుండా, సమగ్ర సమాజ భవిష్యత్తును సాకారం చేసే అద్భుత శక్తి. అందుకే విద్యా సంవత్సరం ప్రారంభం అనేది కేవలం ఒక పరిపాలనా ప్రక్రియ కాదు, అది ఒక నవసమాజ నిర్మాణానికి, కొత్త తరానికి జ్ఞానదీపాలను అందించే ఒక పవిత్ర యజ్ఞం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు (మోడల్ స్కూళ్లు) అన్నీ కలిపి సుమారు 50 వేలకు పైగా విద్యాసంస్థలు విస్తరించి ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యా రంగంలో సంభవించిన సంస్కరణలు విప్లవాత్మకమైనవి. గడిచిన దశాబ్ద కాలంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించడానికి అనేక పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. అందులో అత్యంత ప్రధానమైనది 'మన ఊరు - మన బడి' (పట్టణాల్లో 'మన బస్తీ - మన బడి') కార్యక్రమం. ఈ బృహత్తర ప్రణాళిక కింద మొదటి, రెండవ విడతల్లో వేలాది ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి వసతులతో పునర్నిర్మించ బడ్డాయి. తరగతి గదుల ఆధునీకరణ, అదనపు గదుల నిర్మాణం, రక్షిత సురక్షిత తాగునీటి సౌకర్యం, బాలబాలికలకు ప్రత్యేక ఆధునిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుద్దీకరణతో పాటు డిజిటల్ బోధనా పరికరాలను అమర్చడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల బాహ్య స్వరూపమే మారిపోయింది. విద్యాశాఖ గణాంకాల ప్రకారం, ప్రభుత్వ పాఠశాలల్లో స్థిరమైన ప్రవేశాల వృద్ధి నమోదు కావడం ఈ సంస్కరణల విజయానికి నిదర్శనం.

నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పరిపాలనా యంత్రాంగం మరియు విద్యాశాఖ ఎంతో వ్యూహాత్మకంగా అడుగులు వేశాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పోషకాహార స్థాయిని పెంచడానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలను మరింత పెంచారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు రాగి జావ, గుడ్లు వంటి




బలవర్ధకమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా అందించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

వేసవి సెలవుల అనంతరం బడి బాట పట్టే చిన్నారులకు, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో తొలిసారి అడుగుపెట్టే ఒకటో తరగతి విద్యార్థులకు ఈ అనుభవం జీవితాంతం గుర్తుండిపోతుంది. అప్పటివరకు ఇళ్లకే పరిమితమైన పసి హృదయాలు కొత్త వాతావరణం, కొత్త ఉపాధ్యాయులు, కొత్త స్నేహితులను చూసి ఒకింత భయపడే అవకాశం ఉంటుంది. పాఠశాలలను కేవలం చదువు చెప్పే కేంద్రాలుగా కాకుండా 'ఆనంద నిలయాలుగా' మార్చాలి. ఆటపాటలతో, కథలతో కూడిన విద్యా బోధన ద్వారా బాలల మానసిక వికాసానికి అనుగుణంగా అభ్యాస ప్రక్రియ సాగాలి.

తెలంగాణ విద్యారంగంలో ప్రస్తావించదగ్గ మరొక అద్భుత విజయం - గురుకుల విద్యా వ్యవస్థ. ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ సంక్షేమ గురుకుల విద్యాలయాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. నిరుపేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఉచిత వసతి, నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యను ఇక్కడ అందిస్తున్నారు. ఈ గురుకులాల ఫలితాలు విద్యా ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇక్కడి విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ మెయిన్స్, నీట్ , క్లాట్ వంటి కఠినమైన పరీక్షల్లో అద్భుతమైన ర్యాంకులు సాధించి దేశంలోని అత్యున్నత ఐఐటీలు, ఎన్ఐటీలు, ప్రతిష్టాత్మక వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారు.

ప్రస్తుత 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా విద్యారంగం సాంకేతికతతో వేగంగా మమేకమవుతోంది. డిజిటల్ విద్యా విస్తరణలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, కంప్యూటర్ ల్యాబ్ల ఏర్పాటు వేగవంతమైంది. అయితే సాంకేతికత అనేది కేవలం బోధనా సామర్థ్యాన్ని పెంచే ఒక అదనపు సాధనం మాత్రమే కానీ, అది ఏనాటికీ సజీవమైన ఉపాధ్యాయుని స్థానాన్ని భర్తీ చేయలేదు. ఉపాధ్యాయుని ఆత్మీయ స్పర్శ, వ్యక్తిగత పర్యవేక్షణ మాత్రమే విద్యార్థులను సరైన మార్గంలో నడిపించ గలవు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూనే విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనా ధోరణి , సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం నేటి కాలపు ప్రధాన ఆవశ్యకత.

అయితే, విద్యా వ్యవస్థ ప్రగతి పథంలో సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా వేధిస్తూనే ఉన్నాయి. గ్రామీణ మరియు ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యార్థుల క్రమబద్ధమైన హాజరు లేక పోవడం, ప్రాథమిక స్థాయిలోనే చదువు మానేయడం (డ్రాపౌట్స్), అభ్యాసన సామర్థ్యాలలో లోపాలు, ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు లేమి వంటి సమస్యలపై గట్టిగా దృష్టి సారించాల్సి ఉంది. కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు, కాలానుగుణ వలసలు, బాల్య వివాహాలు వంటి సామాజిక రుగ్మతలు ఇప్పటికీ కొంతమంది పిల్లలను బడికి దూరం చేస్తున్నాయి.

దేశవ్యాప్తంగా అమలులోకి వస్తున్న నూతన విద్యా విధానం - 2020 ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ విద్యాశాఖ కూడా తన పాఠ్యప్రణాళికలను క్రమంగా మార్చుకుంటోంది. కేవలం మార్కులు, ర్యాంకుల కోసం చదివే బట్టీ పద్ధతికి స్వస్తి పలికి, 'అనుభవాధారిత అభ్యాసానికి' ప్రాధాన్యత ఇస్తున్నారు. మాతృభాషలో ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తూనే, ప్రపంచ స్థాయి అవకాశాల కోసం ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచుతున్నారు. దీనితో పాటు ఉన్నత పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యా నైపుణ్యాలను పరిచయం చేయడం ద్వారా విద్యార్థులు చదువు పూర్తి కాగానే స్వయం ఉపాధి పొందేలా లేదా ఉద్యోగ సామర్థ్యాలను సాధించేలా ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఈ మార్పులన్నింటిని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా నిరంతర శిక్షణ ద్వారా తమ నైపుణ్యాలను నవీకరించు కోవాల్సి ఉంటుంది.

విద్యా ప్రయాణంలో పాఠశాల, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర సమానంగా ఉంటుంది. పిల్లలపై మార్కుల కోసం మితిమీరిన ఒత్తిడిని తీసుకురావడం వల్ల వారి సహజ సిద్ధమైన ప్రతిభ నలిగిపోతుంది. అకడమిక్ విజయాలతో పాటు వారి మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం కూడా అంతే ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తించాలి. ప్రతిరోజూ పిల్లలతో సమయం గడుపుతూ పాఠశాలలో ఏం నేర్చుకున్నారో అడిగి తెలుసుకోవడం, ఉపాధ్యాయులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం ద్వారా వారి ప్రగతిని పర్యవేక్షించవచ్చు.

పాఠశాలలు కేవలం అక్షరాలు నేర్పే కర్మాగారాలు కావు, అవి నైతిక విలువల ఉద్యానవనాలు. ఇక్కడే విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, తోటివారి పట్ల సహానుభూతి, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి అమూల్యమైన విలువలను అంతర్గతం చేసుకుంటారు. కేవలం క్లాస్ రూమ్ బోధనకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ ప్రదర్శనలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు వంటి పాఠ్యేతర అంశాలలో పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయి.

2026 జూన్ 15న తెలంగాణ వ్యాప్తంగా మోగనున్న పాఠశాలల గంట కేవలం ఒక దినచర్య ప్రారంభానికి సంకేతం కాదు. అది బంగారు తెలంగాణ పునర్నిర్మాణానికి, ఒక సరికొత్త మేధో తరం ఆవిర్భావానికి దిక్సూచి. సమష్టి కృషితోనే ప్రభుత్వ ఆశయాలు నెరవేరి, మన విద్యా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటాయి. ఈ నూతన విద్యా సంవత్సరం తెలంగాణలోని ప్రతి బిడ్డకు జ్ఞాన కాంతులను పంచాలని, ప్రతి ఉపాధ్యాయునికి వృత్తిపరమైన సంతృప్తిని ఇవ్వాలని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిద్దాం.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ఉద్యమంగా ఎగిసిన 'వ్యంగ్యం'

ఒక చిన్న వ్యంగ్య వ్యాఖ్య ఎలా పెను సంచలనంగా మారుతుందో, యువత తలచుకుంటే డిజిటల్ వేదికల ద్వారా వ్యవస్థను ఎలా ప్రశ్నించవచ్చో చెప్పడానికి సజీవ ఉదాహరణ సీజేపీ. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా, కేవలం సోషల్ మీడియా పునాదిగా పుట్టుకొచ్చింది ఈ పార్టీ. సీజేపీ పుట్టుక వెనుక ఒక అనూహ్యమైన సంఘటన ఉంది. మే 15, 2026న సుప్రీం కోర్టులో నకిలీ ప్రొఫెషనల్ డిగ్రీలు, సంస్థాగత విమర్శలకు సంబంధించిన విచారణ జరుగుతున్నప్పుడు ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్.. వ్యవస్థతో ఘర్షణ పడే కొన్ని శక్తులను 'బొద్దింకల'తో పోలుస్తూ వ్యాఖ్య చేశారు. ఈ వ్యాఖ్యను నిరుద్యోగులకు, దేశ యువతకు జరిగిన అవమానంగా భావించిన డిజిటల్ కమ్యూనికేషన్స్ వ్యూహకర్త అభిజిత్ దీప్కే ఆ 'అవమానాన్నే' తన ఆయుధంగా మలుచుకున్నారు. దానికి ప్రతిస్పందనగా అధికార భారతీయ జనతా పార్టీ పేరును పేరడీ చేస్తూ మే 16, 2026న కాక్రోచ్ జనతా పార్టీని ఆన్‌లైన్‌లో స్థాపించారు. సీజేపీ వెనుక ఉన్న ప్రధాన మెదడు అభిజిత్ దీప్కే. ఆయన సెప్టెంబర్ 29, 1995న మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జన్మించారు. పూణేలో జర్నలిజంలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. గతంలో ఆయన ఆమ్ ఆద్మీ పార్టీ కి పొలిటికల్ కమ్యూనికేషన్స్ స్ట్రాటజిస్ట్‌గా పనిచేశారు. తనకున్న డిజిటల్ నైపుణ్యంతో ఏఐ టూల్స్ సహాయంతో రాత్రికి రాత్రే సీజేపీ వెబ్‌సైట్‌ను, మ్యానిఫెస్టోను రూపొందించారు.

ఈ పార్టీ భవిష్యత్తు ప్రణాళిక చూసుకున్నప్పుడు సీజేపీ సాంప్రదాయ రాజకీయ పార్టీ కాదు. ఇది 'యువత కోసం, యువత చేత' నడపబడే ఒక ప్రెషర్ గ్రూప్. దీని అంతిమ లక్ష్యం ఒక్కటే విద్యా వ్యవస్థలో సంస్కరణలు. ప్రస్తుతం దేశాన్ని కుదిపేస్తున్న పరీక్షల పేపర్ లీకేజీలు, అవకతవకలపై సీజేపీ తీవ్ర పోరాటం చేస్తోంది. విద్యార్థుల జీవితాలతో పాలకులు, చెలగాటమాడుతున్నారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అల్టిమేటం జారీ చేసింది సీజేపీ.

వాస్తవానికి ఈ పార్టీ ఎలక్షన్ కమిషన్ వద్ద నమోదు కానప్పటికీ తాము సమాచార హక్కు చట్టం కి జవాబుదారీగా ఉంటామని, ఎలాంటి 'సీక్రెట్ ఫండ్స్' నిర్వహించబోమని ప్రకటించింది. మరోవైపు రాజకీయ నాయకులకు పార్టీలోకి ఎంట్రీ లేదని స్పష్టం చేసింది. ప్రస్తుత రాజకీయ నాయకులను పార్టీలోకి తీసుకునే ఉద్దేశం తమకు లేదని, ఇది పూర్తిగా యువ వేదికగా కొనసాగుతుందని చెబుతోంది.




పార్టీ పెట్టిన 78 గంటల్లోనే ఇన్‌స్టాగ్రామ్ లో 3 మిలి యన్ల ఫాలోవర్లు, ఐదు రోజుల్లో ఏకంగా 10 మిలియన్ల మంది ఫాలో అయ్యారు. ప్రస్తుతం వారి సంఖ్య 20 మిలియన్లు (2 కోట్లు) దాటి అధికార పార్టీని సైతం వెనక్కి నెట్టిందంటే యువతలో, నిరుద్యోగుల్లో ఏ స్థాయిలో అసహనం పెరిగిపోయిందో చెప్పకనే చెప్పవచ్చు. ఇదిలా ఉంటే క్షేత్ర స్థాయిలో ఇంపాక్ట్ ఎలా ఉందో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలే తెలియజేసు_్తన్నాయి. ఆన్‌లైన్ వారియర్స్ కేవలం కీబోర్డులకే పరిమితం కాలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి వేలాది మంది యువత చేతిలో రాజ్యాంగం, పువ్వు, కాక్రోచ్ మాస్కులతో తరలివచ్చారు. ప్రముఖ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్చుక్ సైతం వీరికి మద్దతుగా నిలిచారు. దీనిని బట్టి చూస్తే క్షేత్రస్థాయిలో ఎన్నికల్లో పోటీ చేసే పార్టీగా కంటే సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే యువ త గొంతుకను బలంగా వినిపిం చే ఒక 'డిజిటల్ పవర్ హౌస్'గా సీజేపీ మను గడ సాధిస్తుందని స్పష్టమవు తోంది.

ఇక పేపర్ లీకేజీల వలయంలో విద్యా వ్యవస్థ చిక్కుకొని అప్రతిష్టను మూటగట్టుకుంటోంది. నెలల తరబడి నిద్రలేకుండా చదివిన కష్టం.. రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థుల ఆశలు...అన్నీ ఒక్క పేపర్ లీకేజీ వార్తతో ఆవిరైపోతున్నాయి. పకడ్బందీగా జరగాల్సిన పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగత లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంగడి సరుకులా మారుతున్న ప్రశ్నాపత్రాలు విద్యా వ్యవస్థ డొల్లతనాన్ని నగ్నంగా సమాజం ముందు నిలబెడుతున్నాయి. సరిగ్గా ఈ ఆవేదన, ఆగ్రహం నుంచే ఒక నూతన ప్రత్యామ్నాయ గొంతుక పుట్టుకొచ్చింది. అదే 'కాక్రోచ్ జనతా పార్టీ'. లీకేజీల వెనుక దాగున్న వాస్తవాలను బయట పెడుతూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలైనా, యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలైనా ఈ రోజుల్లో లీకేజీలు సర్వసాధారణం అయిపోయాయి. ఈ వ్యవహారంలో దళారులు, అధికారులు, కిందిస్థాయి సిబ్బంది హస్తం ఉందనే ఆరోపణలు నిత్యకృత్యమయ్యాయి. ఏళ్ల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండి సన్నద్ధమౌతున్న యువతకు ఈ లీకేజీలు తీవ్ర మానసిక క్షోభను మిగులుస్తున్నాయి. లీకేజీలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఎడ్యుకేషన్ మాఫియా మరింతగా రెచ్చిపోతోంది. సాంప్రదాయ రాజకీయ పార్టీలు ఈ సమస్యను కేవలం ఒకరిపై ఒకరు బురదజల్లుకునేందుకు వాడుకుంటున్నాయనే విమర్శల నేపథ్యంలో యువత ఆగ్రహానికి ప్రతీకగా 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆవిర్భవించింది. 'బొద్దింక (ఇౌఛిజుట్ర్ఛిజి) ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా బ్రతికి బట్టకట్టగలదు'. బహుశా ఈ పోరాట పటిమను, మొండితనాన్ని స్ఫూర్తిగా తీసుకునే ఈ పార్టీకి ఆ పేరు పెట్టి ఉంటారని విశ్లేషకులు భావిస్తున్నారు. కలుషితమైన ప్రస్తుత రాజకీయ వ్యవస్థను, విద్యా రంగంలోని లొసుగులను కడిగేసేందుకే తాము వచ్చామని వారు నినదిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా సమర శంఖం పూరిస్తున్నారు. వీధుల్లో ధర్నాలు చేయడం, పోలీసుల లాఠీదెబ్బలు తినడం కంటే... నేటి యువతకు అత్యంత చేరువలో ఉండే డిజిటల్ ప్లాట్ ఫామ్స్‌ను కాక్రోచ్ జనతా పార్టీ తమ ప్రధాన ఆయుధంగా మలచుకుంది. నిర్దిష్టమైన హాష్ ట్యాగ్ లతో ప్రభుత్వాల వైఫల్యాలను, లీకేజీల వెనుక ఉన్న అధికారుల పేర్లను ఎప్పటికప్పుడు ట్రెండ్ చేస్తూ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. వ్యవస్థలోని లొసుగులను, అధికార పక్షం, ప్రతిపక్షాల డబుల్ స్టాండర్డ్స్‌ను మీమ్స్, ఇన్ఫోగ్రాఫిక్స్, సెటైరికల్ వీడియోల రూపంలో సామాన్యులకు సైతం ఇట్టే అర్థమయ్యేలా వివరిస్తున్నారు. పేపర్ లీకేజీలు కేవలం ఒక పరీక్షకు లేదా ఒక ఉద్యోగానికి సంబంధించిన సమస్య కాదు. అది లక్షలాది మంది యువత భవిష్యత్తుకు, దేశ ప్రగతికి సంబంధించిన అంశం. ఈ తరుణం లో కాక్రోచ్ జనతా పార్టీ సోషల్ మీడియా వేదికగా సంధిస్తున్న అస్త్రాలు, లేవనెత్తుతున్న ప్రశ్నలు పాలకులకు మింగుడుపడటం లేదు. వర్చువల్ ప్రపంచంలో మొదలైన ఈ 'కాక్రోచ్' ఉద్యమం. క్షేత్రస్థాయిలో కూడా బలపడి వాస్తవ రాజకీయ ప్రక్షాళనకు దారి తీస్తుందా లేదా అనేది రాబోయే కాలమే నిర్ణయిస్తుంది.

**- నీలేష్**
8341399599

## శిథిలాల కింద

బతుకు బండికోసం
బాలలింకా చక్రాలవుతూనే
వున్నారు
పుస్తకాలై తెరుచుకోవాల్సిన
పసిమొగ్గలు కార్మికుల కార్ఖానాల్లో
శ్రమల ఖైదీలవుతున్నారు

సైకిల్ చక్రాలకిందో
మోటారు బైకు చక్రాల కిందో
పడి నలిగిపోతున్నారు
సాసరూ ఛాయ్ కప్పుల
శిథిలాల కింద
తప్పిపోయిన బాల్యాన్ని
వెతుక్కుంటున్నారు

ఈ గొంగళి పురుగు
బతుకు దశనుంచి
బాలలు సీతాకోక చిలుకలై
నిరాటంకంగా
చదువుల బడి తోటకు
సాగిపోయేదెపుడో

బాలకార్మికులు లేని
నా దేశం ముఖచిత్రం మీద
చిరునవ్వుల సంతకమై
బాల్యం మెరిసేదెప్పుడో!

**- చిత్తలూరి**
9133832246


# గిది పుక్కెడికెట్లైతది!?



మొన్న గా నడ్మ మా సోపతిగాడు పట్నంల దవాఖానలో షేరీకైండంటే సూసినట్టుంటది, గట్లనే మంద లించినట్టుంటదని సాయిత గాల్లతో కల్సి పోయిన. మన్లాంటి సాతగాని ముసలోల్లు బస్సులల్ల పోవుడంటే 'నీలార్మ్ స్ట్రాంగ్' సెంద్రుని మీన కాలువెట్టినంత బరాబర్ అనుకోవాలే. గిప్పుడు మన్సర్కారు ఆడోల్లకు ఫిరి బస్సులేసి, ఆధార్ కారటుకు ముడివెట్టినంక అండ్ల అన్నీ'రామరావణ, బొబ్బిలి' యుద్దాలేనాయే. ముసలి, ముడిగ అని సూసుడ్లేదు. పోరగాల్లు సుత అయ్యో పెద్దమనిసి నిలవడ్డడు మనం నిలవడి, ముసలోల్లను కూసింత కూకోనిద్దాం అనేది లేదు. పెద్దోల్లెవన్న అత్తే లేసి నిలవడే యెన్కటి ఇలువలేడ సచ్చినయ్. యెవల్ని సూసిన సెవులల్ల తీగలు వెట్టుడు, సెల్ఫోన్ల బాతాఖానీ బస్. గంతే. బవుతిప్పలవడి పట్నం సొచ్చినం. నోర్ దిరుగని దావఖాన పేర్జెప్పి, అటో రిచ్చాల ఆడికిజేరినం. అండ్ల యెదురుంగనే కూకున్న నర్సమ్మకు మా దోస్త్ పేర్జెప్తే, నాలుగో అంత్రంల పదో అర్రల ఉన్నడు పొండ్లి అంటే, దవ దవ నడుద్దామని లగుజేసినం. కని నాలుగో అంత్రం అంటే యేమింత తక్వ మా రాముని గుట్ట యెక్కనీకి కోమటోల్ల సీను వాసు (సదువు పంతులు)కట్టించినన్ని తంతెలున్నయ్. ఇగ గీ తంతెలు జూసి బయపడ్తే పనుల్జరగవని మా లచ్మన్ బుత్తాంత దైర్నం జెప్పినంక యెక్కుడు సురుజేసినం. ఇగ తంతెలన్ని యెక్కినంక తలుపుకాడున్నాయినను అడిగితే, రోగమచ్చినోల్లకు ఇరాం లేకుంట మందులిచ్చేఅర్ర(ఐసీయు)ల ఉన్నడు. అయితే దానికోయాల్ల ఉంటది గప్పుడే రావాలే. గిప్పుడు యెవ్వల్ని లోపలికి పోనియ్యరని, 'జయ,ఇజయు' ల్లెక్క దర్వాజ కాన్నే ఆపిండ్లు. మరెట్ల జూసుడూ అంటే,ఆ యేముంది?అద్దాలల్లనుంచి జూసుడే...! గంతే ఇగ బుత్తాంత సేపు సూసి మల్ల గా తంతెల్దిగి,ఆడున్న మా దోస్త్ పెండ్లం, పొలగాల్ల తోని ముచ్చటవెట్టి, దైర్నం జెప్పి, పా.... యిగ పోదాం అనుకుంట తిరుగు పయినం సురుజేసినం.

బస్సెక్కి కూకున్నంక సూసినవ లచ్మన్ సారూ గ దవాఖానా బంగ్ల యెట్ల గట్టిండ్లు, సూత్తెనే కండ్లువెయ్ దిర్గవట్టె. అబ్బో... మాలేస్గా కట్టిండ్లు అన్న. ఇగ మా లచ్మన్ గిదంత గాయినకేం బట్టనట్టు నాకెయ్ జూసి బుద్దుని లెక్క ఓ సిన్న నవ్వు నవ్వి, మల్ల గమ్మునున్నడు. గింతగనం ఏంసోచాయిస్తండో అనుకొని, గదే అడిగిన. నువ్వు దవాఖానా మీద మెరిసే సింగారం జూసి మురుత్తన్నవు. నేను అట్ల మెరిపించటాన్కి, ఆల్లు జేత్తన్న కతలు యెట్టాంటియని సోచాయిత్తన్న అనుకుంట, మన సిన్నప్పుడు రోగాల్రాలేదా? మనం బత్కలేదా? గా గుండేటి లచ్చులచ్చి నరంబట్టి యెంటనే గదేం రోగమో! యెందుకచ్చిందో!! టక్కున జెప్పేటోడు. గ దానికేవో గోలీలిచ్చి, యేందినాలే, యేందినద్దు (పత్తెం) అని ఇగురంగ జెప్పేటోడు. యెండకాలంల గుట్టలపొంటి దిరిగి సెట్ల యేర్లు, ఆకులుదెచ్చి, యెండబెట్టి,మాంచిగ పొతంజేసి, గోలీల్జేసేటోడు. ఇగ గిప్పుడు గిదేం రోగమో తెల్సుకోనీకే లచ్చల కర్సు. మామూలోల్లయితే దవాఖానా కర్సు యింటేనే గుండెవగిలి సచ్చుడే. ఇగ బుత్తాంత ఉన్నోల్లయితే జాయిజాతు లమ్ముకునుడే! సర్కారు దవాఖన్లకువోతే మొత్తం పుకడ్కే గదా సార్ అంటే, నువ్ అన్నీ యెర్కుండి సిన్న పోరన్లెక్క సెప్పుత వేందయా? ఇయ్యల్ల, రేపచ్చే రోగాలకు సిన్న సిన్న దావఖాన్లేం జేత్తయి. అండ్ల సౌలతులేముంటయనీ.., ఆటిని దురస్తు జేయాలనే సోయి యేలేటోల్లకు లేదు,సేయించుకోవాలనే సోయి జనాలకు లేదని అన్నడు. గాల్లు గసొంటి సోయి లేపోతెనే సర్కారు జనాలకోసం 'ఆరోగ్యశ్రీ, పైసల్లేకుంట (పుకడ్కి) రోగాలు తగ్గిచ్చే' పత్కాల్దెచ్చిండ్లా?అని కొంత గట్టిగనే అడిగిన. యేంది సారూ గిట్ల నవ్వుతాండ్లు అంటే, గా సర్కారు సంగతంత నీకు మాయెరుకేనని నాకెరికే తియ్. నాతోన్జెప్పియ్యాలని సూత్తన్నవుగదా! యే గట్లగాదు సారు,జర్రంత తెలుసుకుందామని అని అన్న.

సర్లేగని యేంజెప్పాలే నీ ముచ్చట్లన్నీ 'పుకడ్కీ' రోగాల్దగ్గిచ్చే పత్కం సుట్టే తిర్గు తన్నయ్. ఇంతకూ అది పుకడ్




పత్కం అనుకుంటన్నవా? అయితే ఇను. సర్కారు యేదైనా సేయాల్నంటే ఓ... కమిటీల మీన కమిటీ లేసి, నెలల కానంగ ముచ్చట్లు వెట్టి పన్జేసినట్టుగా ఉండేటోల్లు, ఇగ గిప్పుడు గిదాని మీన'ఆదరబాదర ఊదర మొగుడా' అన్నట్టుగా మొదలువెట్టిండ్లు. దీనెనుక అసలు కత యేరే ఉంది. నౌకరిగాల్లు, నౌకరి దిగిపోయి నోల్లు,ఆల్లకచ్చే బత్తేలమీన, ఐదేండ్లకోపారి ఆల్లజీతాల పెరుగుడు మీన, నౌకరి దిగి పోయినోల్లకచ్చే బకాయిల మీన లొల్లి లొల్లి జేత్తండ్లు గదా! గసొంటియన్ని మర్సిపోనీకి,ఆల్ల ముచ్చట్లన్నీ గీ'పుకిడి దవాఖాన్ల' సుట్టే తిర్గనీకి సర్కారు చేసిన ఉపాయం ఇది.

నౌకరోల్లను అడగకుండ, ఆల్లతో ముచ్చటవెట్టకుండ, అల్లుఒప్పుకుంటరా? లేదా? సోచాయించకుండ,పైసల్లేకుంట దవాఖాన్ల షెరీక్జేయాలంటే గా దావాఖానోల్లతో మాట్లాడాలే గదా! గదేది లేకుంటనే యెకాయెకిన జీతాల్లో,పించన్లలో ఓటిన్నర పాల్లు(1.5%) కోతేసుడంటే యేలేటోల్లు జెప్పుకునే పెజాసామ్యం,పజాపాలన అంటే గిదేనేమో..! ఇంక గీ సావగత్(ఉదాహరణ) ముచ్చట సూడుండ్లీ పెండ్లాం,మొగుల్లు నౌకరి జేసేటోల్లయితే, ఆల్ల జీతంలకెల్లి తలో పదేనువందలు కోతవెడ్తే సాల్ మొత్తంమీన 36000 లైతయ్. కని,దీంట్ల అవ్వయ్య లుంటే, ఆల్లకు పన్జేత్తది. పొలగాండ్లకు ఇరువైయేండ్ల ఈడు దాటిందంటే ఖతం. మల్ల ఆల్లకు పైసలు వెట్టుడేనాయే. గిదెట్లుందంటే'సూపులు దేవునియి, మేపులు మాయి' అన్నట్టుంది. గిదే పైవేటు బీమాలల్లనైతే నెలకు 2250/- లెక్కన కడితే ఇంట్ల ఉన్నోల్లందరికీ కోటి రూపాయల దాకా దవాఖన్ల ఫిరి. ఇంక సర్కారు మజాకా సూడుండ్లీ జీతం బెరుగతంటే కట్టేది(1.5%) పెరుగుతది. కనీ పొలగాండ్ల ఈడుపెరుగుద్ది కదా కారట్లల్ల ఆల్ల పేర్లు కొట్టేత్తలు.అంటే కారట్ల ఇంట్ల ఉన్నోల్లందరి పేర్లు ఉండయి. పెండ్లం, మొగుడు ఇద్దరి పేర్లు ఉంటయ్. బస్.గిది కొత్తగా నౌకర్లచ్చినోల్లకయితే బెహత్తరీన్ గా ఉంటది. ఇంకా గిదీంట్ల ఇట్టమున్నోల్లు ఉండచ్చు, ఇట్టంలేనోల్లు ఉండకపోవుడనే ముచ్చట సుత అడ్గాలే గదా! గది సుత లేదాయే. యేయే దవాఖాన్ల యేయే రోగాలకు మందులిచ్చి మంచిగజేత్తరో సుత చెప్పాలే గదా! చెప్పలే.

ఇంక గా కారట్లు గుడుక ఇయ్యలేదు.పాత కారట్లు పన్జేసుడు లేదు.గట్లనే కొంతమంది రాసపుండు(కాన్సరు), గుండెనొప్పులు,నెత్తుటి పోటు,చక్కెర రోగమసొంటి పాత (దీర్ఘకాలిక) రోగాలకు యేంజేత్తరు.అప్పు డప్పుడచ్చే జరం, పడిసం,దగ్గు,కాల్సేతులు గుంజుడసొంటాటికి ఇంటికెల్లిపోయే రోగపోల్లకు (అవుట్ పేషెంట్)మందులిచ్చుడుంటదా? ఉండదా?ఇంకా అన్నీటికంటే బెహత్తరీన్ ముచ్చటేందంటే నౌకరోల్లజీతాల్నుంచి కోతవెడ్తన్నవు సరే అంతకు సమానం సర్కారు యిచ్చి, దవాఖ నోల్లకు యిత్తదా? యిది లచ్చల కోట్ల పశన? యెందుకంటే కడుపుగట్టకోని,నోల్లు కుట్టేసుకొని దాసుకున్న జి.పి.ఎఫ్,జి.ఎల్.ఐ.అసొంటి పైసల్లోని జనాలకు కొత్త పతకాలిత్తన్న సర్కారు పుకటికే రోగాల మందులకు మన జీతాలు కోత పైసల్ని సుత రెపో మాపో యేరే కర్సులకు మల్లించదనే పూచీ యెవలిత్తరు. ఇంకా గమ్మతేందంటే యేం పన్జేయనోల్లకు సర్కారు సొమ్ము తోని పుకడికే సానా సౌలత్లుజేత్తండ్లు, మంచిదే. మరి కం సే కం ముప్పై నుంచి నలుబైయేండ్లు ఇంటోల్లను పట్టిచ్చుకోకుండా, పెయిని పట్టిచ్చుకోకుండా నౌకరిజేసినోల్లు, సేసేటోల్లు యేం పాపం జేసిండ్లు? నౌకరికోసం ఇరుగూట లేకుండ సదువుడాయే!గట్ల సదివి నౌకరిజేసుడే పాపమా? కొట్లాడి తెచ్చుకున్న ఆల్ల సౌలత్లను సుత ఒక్కొక్కటిగా పొతంబెడుతండ్లు! కరువు బత్తెం ఇయ్యడాన్కి పైసల్ కరువే. పాత బకాయిలియ్యడాన్కి సుత పైసలు కరువే. పించన్దార్లకియ్యాల్సిన బకాయిలు కాయితాల మీన లెక్కలే. యెవలిచ్చిన్లో, యెవలకియ్యలేదో అదంత ఇష్నుమాయనే గదా! అనుకుంట లచ్మన్ నాకెయ్ జూసిండు.

గట్లగాదుగని సారు ఇదంత సర్కారు కర్సు తప్పిచ్చుకునే ఉపాయం లెక్క అనిపి త్తలేదా?'రోగి అడిగింది డాటరు (డాక్టరు) ఇచ్చింది ఒకటే అన్నట్లు లేదా?' ఫిరీగ దవాఖాన్ల సౌలతుల్ జెయ్యాలని లొల్లివెట్టి, పెట్టి సివరాకరికీ కొంత పైకమిత్తమని మనమే అంటిమి. సర్కారు మొత్తానికి యెగ్గొట్టాలని యికమతుల్జేసి, ఇరుకకుంట కొరుకకుంట మెలికలు వెడుతండే. సివరాకరి యాట్టకచ్చి మా రోగాలకు మేమే కర్సు వెంటుకుంటం అటెంక మీ దయ ఉంటే,మీరిత్తె యియ్యుండ్లీ లేపోతే లేదనేతట్లు జేత్తంది. కులాల పేర్ల మీన,మతాల పేర్ల మీన,క్యాడర్ వారిగా బొచ్చెడు సంగాలు వెట్టిరి.గసొంటి సంగాల నోల్లు మెత్తగా, సాతగానోల్లెక్క ఉన్నాయి. గందుకనే సర్కారు కు ఇంకింత బలమైతంది. గదిగాదు గనీ లచ్మన్ సారూ మనజీతాలకెల్లి పైసల్ కోతవెట్టి, పైసల్దీసుకొని, ఉజ్జోగం జేసేటోల్లకు,నౌకరి దిగి పోయినోల్లకు రోగమత్తే పైసల్లేకుండా సర్కారు మందులిత్తందని అనుడు కరస్టేనా? నిచ్చంగా ఇది పుకడికీ రోగాల్ను తక్వజేసే పత్కమేనా'? లచ్మన్‌ను అడిగితే,యే నీకు దెల్వదా? సరేగాని జర నెత్తినొత్తంది బుత్తాంత సేపు పడుకుంట. మనూరచ్చినంక లేపు' అనుకుంట యెన్కకు ఆలిండు.గాయినకు ఇంతకంటె యెక్వ ముచ్చటజెప్పుడు ఇట్టం లేనట్టుందనుకొని, నేను సుత కాసేపు కన్నుమూసిన.ఇద్దరం కల్సి మా వూరు దాటినంక బస్సు దిగి నడ్సుకుంట ఇంటి మొకం బట్టినం.

**- మీస రాజమల్లయ్య**
9491319904

## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి



- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- 205 దరఖాస్తుల రాక

**రాజన్న సిరిసిల్ల, జూన్ - 15 (మనం ప్రతినిధి ):** ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 205 వచ్చాయి. ఐడీఓసీ ప్రజావాణిలో డీఆర్ఓ జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి



**పెద్దపల్లి, జూన్ 15 (మనం ప్రతినిధి):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి పెద్దపెల్లి జిల్లాలో అదనపు కలెక్టర్ రెవెన్యూగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ముత్తారం మండలం లక్కారం గ్రామ పంచాయతీ కు చెందిన వీరగొని రాజేశం మచ్చ పేట గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 79 లో ఎకరం 33 గుంటల వ్యవసాయ భూమి చట్టబద్ధంగా కొనుగోలు చేయడం జరిగిందని, తన భూమిని అధికారికంగా పున సర్వే చేయించి సంబంధిత రెవెన్యూ రికార్డులలో ఉన్న తప్పులను సరిచేసి చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఏడీ సర్వే ల్యాండ్ రికారడ్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఓదెల గ్రామ పంచాయతీ పరిధిలో మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూల్ సెంటర్ ను హై స్కూల్ ప్రాంగణంలోకి మార్పు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచి కనకిరెడ్డి సతీష్ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.గోదావరిఖని కళ్యాణ్ నగర్ కు చెందిన కొత్తపల్లి సమ్మక్క తన ఇంటి వెనకాల ఉన్న కోత్వాల్ వెంకటేష్ అక్రమంగా మా ఇంటి సరిహద్దులను ఆక్రమంగా చొర పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.పెద్దపల్లి పట్టణం ప్రగతి నగర్ కు చెందిన కొండా రమాదేవి తమకు గృహ జ్యోతి పథకం కింద లబ్ధి చేకూర్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపీడీఓ కు రాస్తూ అవసరాన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రథమ ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందనలు

**కరీంనగర్, జూన్ 15(మనం బ్యూరో):** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థిని కడారి రశ్మితను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో రశ్మితకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో మొత్తం 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో తొలి ర్యాంకు సాధించడం విశేషమని కలెక్టర్ కొనియాడారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతోనే ఇలాంటి అసాధారణ విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జిల్లా పేరును మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని విద్యార్థినికి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, రామడుగు సర్పంచ్ మొయిజ్, రామడుగు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి, సాదాబైనామాల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు



- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, జూన్ 15(మనం బ్యూరో):** భూభారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో భూభారతి, సాదాబైనామా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియల పురోగతిపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్లో ఉన్న దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తహసీల్దార్లు దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి దరఖాస్తును బాధ్యతా యుతంగా పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సీసీఎల్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత రికార్డులు, ఆధార పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని పేర్కొన్న కలెక్టర్, పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి దరఖాస్తుకు నిర్దిష్ట గడువులో పరిష్కారం చూపేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, కరీంనగర్ ఆర్డీవో శర్మిల, హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి నాయక్ వాడి కలెక్టరేట్ డీ సూపరింటెండెంట్ మోబిన్తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

# హెలిప్యాడ్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి



- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా...

**కరీంనగర్, జూన్ 15(మనం బ్యూరో):** నూతన కలెక్టరేట్ భవనం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ నిర్మాణంపై సోమవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్లో ఏవియేషన్, పోలీసు, ఆర్ అండ్ బి, రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా హెలిప్యాడ్ నిర్మాణ పనులపై అధికారులతో చర్చించిన కలెక్టర్, భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని పరిశీలించినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్కు వివరించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను శాఖల వారీగా సమీక్షిస్తూ పర్యటన విజయవంతం అయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, ఏవియేషన్ అధికారి హరీష్, కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహాచారి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం.. రైతు ప్రభుత్వం

- తెలుగుదేశం పార్టీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున

**దేవనకొండ, జూన్ 15,( మనం న్యూస్):** దేవనకొండ మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామం రైతు సేవ కేంద్రం నందు సోమవారం నాడు రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించే ఎరువులు మరియు వేరుశనగ విత్తనములు పంపిణీ కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున హాజరై రైతులకు ఎరువులు విత్తనములు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టిందని రైతులకు ట్రాక్టర్లు, ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు, గోకులం షెడ్లు, హార్టికల్చర్ రైతులకు ,ప్యాక్ హౌస్ లు, అన్నదాత సుఖీభవ లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సురేంద్రనాయుడు, పెద్ద కౌలుట్లయ్య. వెంకటేష్, ఎర్ర కౌలుట్ల, చాకలి లక్ష్మన్న, సుంకన్న, శివలింగడు, తిప్పన్న, గిడ్డయ్య, హార్టికల్చర్ అసిస్టెంట్ నాగన్న, అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 15 (మనం బ్యూరో):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధ్యక్షతన స్టాప్ డయేరియా, పల్స్ పోలియో, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం అమలుపై జిల్లా టాస్క్ ఫోర్స్ (డీటీఎఫ్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జూన్ 16 నుంచి జూలై 31వ. తేది వరకు నిర్వహించనున్న స్టాప్ డయేరియా కార్యక్రమం, జూన్ 28న. చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమం, అలాగే జూలై 13న. నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం అమలు పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ....ప్రజారోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు మాట్లాడుతూ... వర్షాకాలంలో నీటి నిల్వలు, గాలిలో తేమ పెరగడం వల్ల దోమల ఉత్పత్తి అధికమై మలేరియా, డెంగ్యూ, చికున్గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై మాట్లాడుతూ, భారతదేశంలో పోలియో వ్యాధి నిర్మూలన సాధించినప్పటికీ పొరుగు దేశాల నుంచి వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పీఓ-సీహెచ్ఐ డా. ఎన్. శైలజ మాట్లాడుతూ...స్టాప్ డయేరియా కార్యక్రమం కింద చిన్నారుల్లో అతిసార వ్యాధి నివారణకు క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను తగినంతగా అందుబాటులో ఉంచడంతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జూలై 13న. నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్బెండాజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని శాఖలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, భూ సేకరణ ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, జడ్.పి.సి.ఈ.ఓ ఇంచార్జి డి. పి.ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ పోర్టల్లోకి చొరబడి.. రీఫండ్ సొమ్ము కాజేసి..!




**ఢిల్లీ, జూన్ 15:** ఇటీవల నీట్ పరీక్ష పత్రం లీక్ అవ్వడంతో దేశ వ్యాప్తంగా ఈ నెల 21న రీ-ఎగ్జామ్ నిర్వహించడానికి ఎన్టీఏ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో నీట్ పోర్టల్లో మరో వైఫల్యం వెలుగులోకి వచ్చింది. నీట్ అభ్యర్థుల పాస్వర్డ్‌లు, పిన్‌లను దొంగలించి.. బ్యాంకు ఖాతాల నుంచి రీఫండ్‌ను కాజేస్తున్న నిందితుడిని అహ్మదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని బిహార్‌కు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నీట్ పోర్టల్లోని భద్రతా లోపాలు, బలహీనమైన పాస్వర్డ్‌ను ఉపయోగించుకొని బీహార్‌లోని గయాకు చెందిన నవీన్ యాదవ్ నీట్-యూజీ అభ్యర్థుల ఖాతాలలోకి అనధికారికంగా ప్రవేశించాడు. 350 మందికి పైగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న నిందితుడు సుమారు 150 ఖాతాలను విజయవంతంగా యాక్సెస్ చేశాడు. వీటిని యాక్సెస్ చేయడానికి పాస్వర్డ్, ఎన్క్రిప్షన్ కీలు, పిన్‌లను ఛేదించడానికి ఉపయోగించే ట్రయల్-అండ్-ఎర్రర్ పద్ధతి అయిన బ్రూట్-ఫోర్స్‌ను ఉపయోగించి ఖాతాలలోకి చొరబడ్డాడు. అనంతరం విద్యార్థుల ప్రొఫైల్‌తో లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతా వివరాలు తొలగించి తన ఖాతా వివరాలతో అప్డేట్ చేశాడు. దీంతో ఒక్కో విద్యార్థికి అందాల్సిన రూ.1,700 అతడి ఖాతాలో జమ అయ్యాయి. నీట్-యూజీ పోర్టల్లో మోసపూరిత రీఫండ్ లావాదేవీలు జరుగుతున్నట్లు అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ బ్రాంచ్కు ఫిర్యాదు అందడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఖాతా వివరాల ఆధారంగా నిందితుడిని బీహార్లో అరెస్ట్ చేశారు. మొదట నిర్వహించిన నీట్2026 పరీక్షను రద్దు చేయడంతో ఎన్టీఏ అభ్యర్థులకు ఎగ్జామ్ ఫీజును రీఫండ్ చేస్తోందని.. దానిని అవకాశంగా తీసుకొని నిందితుడు ఈ దోపిడీకి పాల్పడ్డాడని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో నీట్ పోర్టల్ భద్రతా ఫీచర్లను ఎన్టీఏ పటిష్టం చేసింది.

## శ్రీ మఠంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు పాలకుర్తి తిక్కారెడ్డి



**మంత్రాలయం, జూనియర్ 15,మనం న్యూస్:** అమావాస్య ను పురస్కరించుకుని ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు పాలకుర్తి తిక్కారెడ్డి సోమవారం వచ్చారు. వీరికి టీడీపీ మండల కన్వీనర్ పన్నగా వెంకటేష్ స్వామి స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. వీరికి టీడీపీ నాయకులు ఎల్లారెడ్డి , మాధవరం అమర్నాథ్ రెడ్డి , కృష్ణమోహన్ రెడ్డి, హండే హనుమంతు , వట్టెప్ప నరసింహ , విజయరామిరెడ్డి , చిన్న భీమ , సున్నం రామకృష్ణ , గనెకంటి గురురాజ్ , తదితరులు ఉన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం వల్లే సూగురు రిజర్వాయర్‌కు గండి

- ఇరిగేషన్ అధికారులపై ముఖ్యమంత్రి కి ఫిర్యాదు చేస్తా
- నిధులను పందికొక్కుల్లా మెక్కిన ఇరిగేషన్ అధికారులు
- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలకుర్తి తిక్కారెడ్డి



**మంత్రాలయం జూన్ 15,మనం న్యూస్ : -** మండల పరిధిలోని వగరూరు గ్రామ సమీపంలో ఉన్న సూగురు రిజర్వాయర్ కు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే గండి పడిందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్నూలు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపించారు. సోమవారం గండి పడిన విషయం స్థానిక టిడిపి నాయకులు అబ్దుల్ సమాచారం ఇవ్వడం తో ఆయన గండి పడిన చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏట వర్ష కాలంలో సూగురు రిజర్వాయర్ కు గండి పడడం పరిపాటిగా మారిందని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో చెరువు కట్ట పై ముళ్ల కంప చెట్లు పెరిగి గండి పడేందుకు అవకాశం ఉందన్నారు. సూగురు రిజర్వాయర్ కు మరమ్మతులు కోసం వస్తున్న నిధులను అధికారులు పందికొక్కుల్లా మేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం పై అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. చెరువు మరమ్మతులు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్, కర్నూలు జిల్లా ఇంచార్జీ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి, మాధవరం అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, ఎల్లారెడ్డి, అబ్దుల్, చిన్న భీమన్న, వట్టేప్ప నర్సింహులు, విజయ రామిరెడ్డి, ఇరిగేషన్ డిఈ విద్యాసాగర్ జేఈ పరమేష్ నాయక్, డిఎల్ డిఓ బాలకృష్ణ రెడ్డి, ఎంపిడిఓ నూర్జహాన్, తహసీల్దార్ రమాదేవి, ఆర్ ఐ జనార్దన్, విఆర్ఓ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## 'ఒకే కులం - ఒకే వృత్తి క్లస్టర్' అమలు చేయాలి

- ధనుంజయ ఆచారి

**కర్నూలు, జూన్ 15(మనంన్యూస్):** రాష్ట్రంలోని 25 లక్షల మంది విశ్వకర్మ-విశ్వబ్రాహ్మణుల ఆర్థిక, పారిశ్రామిక, ఉద్యోగాభివృద్ధి కోసం 'ఒకే కులం - ఒకే వృత్తి క్లస్టర్' విధానాన్ని అమలు చేయాలని కోరుతూ అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మశ్రీ దేవపూజ ధనుంజయ ఆచారి గారి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు కమ్మరి తిమ్మయ్య ఆచారి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖరాచారి, జిల్లా నాయకులు శరభయ్య ఆచారి తదితరులు కలెక్టరేట్లో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి పంపే వినతిపత్రాన్ని కలెక్టర్కు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ధనుంజయ ఆచారి గారు మాట్లాడుతూ, 'భారత దేశానికి వెన్నెముక రైతన్న అయితే, రైతన్నకు వెన్నెముక మా కమ్మరం, వడ్రంగం, కంచరం, శిల్పం, స్వర్ణకారం కుటీర పరిశ్రమలు. కానీ ఆధునిక యంత్రాల తాకిడితో మా కులవృత్తులు గ్రామాల్లో కనుమరుగై, మా వారసత్వం వలసబాట పడుతోంది. దీన్ని కాపాడాలి' అని తెలిపారు.



## జె.ఆర్ ఫ్యామిలీ ధాబాపై పోలీసుల దాడి



- 55 లీటర్ల మద్యం స్వాధీనం

గజ్వేల్ జూన్ 15 మనం న్యూస్: నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ఫోర్స్ పోలీసులు మరియు గజ్వేల్ టౌన్ పోలీసులు సంయుక్తంగా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామంలోని 'జె.ఆర్ ధాబా' పై మెరుపు దాడి నిర్వహించారు. దాభలో అక్రమంగా నిల్వ ఉన్న మొత్తం 55.7 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ నిర్వాహణకు కారణమైన నిందితుడు దాబా ఓనర్ అర్రవెల్లి రవి (45) పై , ఈ దాడిలో ధాబాలో అక్రమంగా మద్యం సేవిస్తున్న 17 మందిపై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ టౌన్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తెలిపారు. మీ ప్రాంతంలో ఎలాంటి అక్రమ లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే, వెంటనే డైల్ 100 కు లేదా టాస్క్ఫోర్స్ నంబర్ 8712667447 కు సమాచారం అందించాల్సిందిగా కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి అని తెలిపారు.

## ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలి

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జూన్ 15 మనంప్రతినిధి: సంగారెడ్డి మహిళా పోలీసు స్టేషన్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్., ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్, స్టేషన్ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న కేసులను సమీక్షించిన ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి, బాధితులకు అండగా నిలవాలని అన్నారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జీట్ దాఖలు వరకు ప్రతి వివరాన్ని ఆన్లైన్లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. అలాగే, నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలన్నారు. అనంతరం సిబ్బంది కిట్ బ్యాగ్లను తనిఖీ చేస్తూ, అందులోని ప్రతి వస్తువు విధి నిర్వహణలో ఉపయోగపడుతుందని, వాటిని జాగ్రత్తగా సంరక్షించి వినియోగించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ నీట్ టర్న్అవుట్ను నిర్వహిస్తూ, ప్రతిరోజూ వ్యాయామం చేసి శారీరక దృఢత్వాన్ని (ఫిట్నెస్ను) మెరుగుపరచుకోవాలని సూచించారు ప్రజలకు సులభంగా, పారదర్శకంగా పోలీసు సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పోలీసు స్టేషన్కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా విని, వారి సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా కల్పించాలని అన్నారు .ఈ తనిఖీలోసంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య గౌడ్, మహిళా పోలీసు స్టేషన్ ఎస్.హెచ్.ఓ మహేష్ గౌడ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్స్, శివ కుమార్, ప్రసాద్ రావ్, ఎస్ఐ మాణిక్ రెడ్డి, మహిళా ఎస్ఐ పూల భాయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టాలి

- పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి
- 100శాతం పల్స్ పోలియో పూర్తి కావాలి
- డెంగ్యూ రోగులకు ఆర్ఎంపీలు చికిత్స అందించకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ కే. హైమావతి



సిద్దిపేట,జూన్ 15 (మనం ప్రతినిధి): సీజనల్ వ్యాధులకు అనుకూలంగా ఉన్న ప్రస్తుత వాతావరణ సమయంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ హేమావతి సూచించారు. పోలియో చుక్కల మందు 100% పూర్తి కావాలన్నది లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని పేర్కొన్నారు. సిద్దిపేట లో సోమవారం జరిగిన అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలలో మురికినీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఫాగింగ్ పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. తడి పొడి చెత్తను రోడ్లపై వేయకుండా ఎప్పటికప్పుడు డంప్ యార్డ్ లకు తరలించే చర్యలను స్థానిక యంత్రాంగం చేపట్టాలన్నారు. జిల్లావ్యాప్తంగా డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాఠశాలల్లో ఆర్బిఎస్కె బృందాలు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పర్యవేక్షించాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి రోగులకు ఆర్ఎంపీలు చికిత్స అందించకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం, థాంక్యూ నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించే పోస్టులను జిల్లా కలెక్టర్ఆవిష్కరించారు. ఈ నెల 28, 29న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశాలు చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

- ఐ వి ఎఫ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం
- సంఘం డివిజన్ అధ్యక్షుడు వంగపల్లి నవీన్




గజ్వేల్ 16 మనం న్యూస్: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని ఐవిఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు నవీన్ కుమార్ అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నదానం ఇంతగానో ఉపయోగపడుతుందని వారి ఆకలి తీర్చితే మనకు ఎంతో పుణ్యం వస్తుందన్నారు. సోమవారం నాడు సోమావతి అమావాస్య సందర్భంగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ బాచుపల్లి డివిజన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు వంగపల్లి నవీన్ కుమార్ నేతృత్వంలో బాచుపల్లి మమత మెడికల్ కళాశాల ముందు జరిగిన ఈ కార్యక్రమం లో దాదాపు 250 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా బాచుపల్లి డివిజన్, ఆర్యవైశ్య సంఘం బాచుపల్లి అధ్యక్షులు, ఐ వి ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు నవీన్ కుమార్ మాట్లాడుతూ గత 22 నెలలుగా ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగిస్తున్నామని ఇలాగే ముందు ముందు కూడా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలు అందరికీ పేరుపేరునా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి డివిజన్ సభ్యులు , మహిళ అధ్యక్షురాలు కవిత తో పాటుగా మహిళా సభ్యురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ను ప్రారంభించిన కలెక్టర్



గజ్వేల్ జూన్ 15 మనం న్యూస్: సోమవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి మర్కుక్ మండల కేంద్రంలో నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి వరగంటి శాస్త్రి తో కలిసి అన్ని క్లాస్ రూమ్ లను, మౌలిక వసతులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా విద్యార్థులను పాఠశాలకు తీసుకురావడం అది ఇండ్లలోకి సురక్షితంగా చేరవేయడానికి 4 బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు సెక్షన్లలో 100 ప్రీఫైనరీ స్కూల్ విద్యార్థులు, 1 వ తరగతి నుండి 8 వ తరగతి వరకు ప్రతి క్లాస్కు 40 మంది చొప్పున 320 మంది విద్యార్థులు మొత్తం 420 మంది విద్యార్థులతో ఈరోజు పాఠశాలను ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. వచ్చే సంవత్సరం నుండి రెండవ సెక్షన్లలో కూడా విద్యార్థులు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించినప్పుడే అక్కడి నుండే మార్కుక్ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభించారనీ ఈరోజు నుంచి తరగతులు ప్రారంభమయ్యాయనీ గతంలో పోలీస్ వారి క్వాటర్స్ కోసం ఉపయోగించిన ఈ భవనాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ కోసం ఉపయోగిస్తున్నామనీ శాశ్వత భవనాల నిర్మాణానికి 16 కోట్ల 62 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయనీ వాటితో పాఠశాల భవనం నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక మండల స్థాయి అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కాలువలోకి నీరు వదిలితే చర్యలు తీసుకుంటాం



ముమ్మిడివరం, జూన్ 15, మనం న్యూస్. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ముమ్మిడివరం నగర పంచాయతి ప్రాంతం బాలయోగి కాలువకు సంబంధించి కాలువ ప్రక్కన నివసిస్తున్న ప్రజల నీటివాడకం మరియు బాత్రూంలలో వాడిన నీరు కాలువలోకి వదిలివేస్తున్నారని తెలిసిన మీదట కమిషనర్ పి.రవివర్మ శానిటేషన్, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో ఆ ప్రాంతమును పరిశీలించి గుర్తించిన పైప్ లైన్ లను మూయించి వేశారు. కాలువ వెంబడి సాయిబాబా గుడి మరియు భగవాన్ శ్రీ బాలయోగి స్వామి గుడి కలవు భక్తులు స్నానములు చేసి స్వామిని దర్శించుకుంటారని అంతటి పవిత్రత కలిగిన కాలువలోకి ఎవరు ఎ విధమైన నీరు వదలరాదని వదిలినచో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కమిషనర్ వారి వెంట సచివాలయ మరియు నగర పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## పిజిఆర్ యస్ లో 283 ఆర్జీలు స్వీకరణ

- అర్జీదారుల సమస్యలపై ప్రతి ఒక్కరూ జవాబుదారితానంతో పని చేయాలి



అమలాపురం జూన్ 15 మనం న్యూస్ ప్రజల సంతృప్తే అధికారుల పని తీరుకు కొలమానమని,అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కు మార్ సూచించారు..స్థానిక కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్ వైఖో నైదియాదేవి డిఆర్ఓ బి సుబ్బారావు లు ప్రజలు నుండి పిజి ఆర్ఎస్ రెవిన్యూ క్లీనిక్ లో నుండి సుమారుగా 283 ఆర్జీ లను స్వీకరించారు. పిజిఆర్ ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన అర్జీలు పరి ష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశిం చారు. ప్రజలు నుండి అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖలు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, ధరఖాస్తు దారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా సత్వర పరి ష్కారం చూపాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాల న్నారు. అర్జీదారులు కార్యాలయాలు చుట్టూ తిరగ కుండా, వారికి సంతృప్తి కలిగే విధంగా నాణ్య మైన పరిష్కారం చూపాలన్నా రు ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణా లను లబ్దిదారులకు అర్థమయ్యే విధంగా ఎండార్స్మెంటు ఇ వ్వాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూప కూడదని, సమస్యలు పరిష్కారంలో ఆలస్యం జరిగితే సంబంధిత అధి కారులకు శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలుసరైన స్పందన ఇవ్వడం ద్వారా పెన్షన్ పంపిణీ రేషన్ బియ్యం ఎల్పిజి గ్యాస్ సరఫరా, ఆసుపత్రి సేవలు వంటి అంశాలలో జీరిట్స్ సర్వేలో గణనీయమైన పురోగతిని తీసుకురావాలన్నారు జాయింట్ కలెక్టర్ ప్రసంగిస్తూ అధికారులు ఫిర్యా దులను సమగ్రంగా స్వయంగా విచా రించి, ప్రజలకు శాశ్వతమైన పరిష్కారాలు సమగ్రంగా అందించాలన్నారు మన మిత్ర యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను అధికా రులు ఎప్పటికప్పుడు పరిష్క రిం చాలని ఆదేశించారు. పరి ష్కరించిన ప్రతి ఫిర్యా దులో నాణ్యమైన, శాశ్వ తమైన పరిష్కారం అందిం చాలన్నారు. సమన్వయం తో పనిచేసి వచ్చిన ప్రతి ఫిర్యా దును పరిష్కరిం చాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లాస్థాయి అధి కారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



శంఖవరం జూన్ 15 మనం ప్రతినిధి: పోతులూరు గ్రామంలో సోమవారం ఉదయం వైకాపా నేత ముదునూరి పర్యటించారు. గ్రామంలో గల మొరుకుర్తి శ్రీనివాస్ కుమారుడు ఉదయ్ కిరణ్, పోలిశెట్టి సత్తిబాబు ఇరువురు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం పోతులూరి గ్రామంలో వారి స్వయగ్రహమునందు విశ్రాంతి తీసుకుంటున్న తరుణంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణం రాజు వారి కుటుంబాలను పరామర్శించి ప్రమాదం లో గాయపడిన ఇరువురికి రూ. 5000 చొప్పున రూ. 10000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసానివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరు సర్పంచ్ బొండి రాంబాబు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు శెట్టి సత్తిబాబు, చెక్కపల్లి నాగేశ్వరరావు,మాజీ వైస్ సర్పంచ్ పంచాది చంటిబాబు, తలారి రాజుబాబు, ఎలుగుబంటి బాబ్జి, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, చెక్కపల్లి బుజ్జిబాబు, రేఖ కృష్ణ అర్జున, చిన్నం వెంకటేష్ గారు,రాయుడు ఎలీషా గారు,శివకోటి ప్రసాద్, బొండి యోహాను, బొండి కృష్ణ, పొట్టూరి పెద్ద అప్పారావు, రాయుడు శ్రీను గారు,రేఖ బాబురావు, శ్రీపతి. నాగేశ్వరరావు, వళ్ళు సత్తిబాబు, దేవరపు బుజ్జి,బొండి నాగేశ్వరరావు, నాగులపల్లి వీరబాబు,మాది రూబెన్,జువ్వల దొరబాబు,దాడి పుత్రయ్య, నానిపల్లి వెంకన్న ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది గైర్హాజరు, మెమో జారీ చేసిన ఎంపీడీఓ



కాట్రేనికోన జూన్ 15 మనంప్రతినిధి: పల్లం గ్రామ పంచాయతీ స్వర్ణ గ్రామాలను ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు సోమవారం ఆకశ్మిక సందర్శన చేశారు. ఆయా స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది ఆన్లైన్ హాజరు వివరాలను నిశితంగా పరిశీలించారు. సాయంత్రం 3:00 గంటలకే సిబ్బంది ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా, స్టాఫ్ మూవ్ మెంట్ రిజిస్టర్ లో వివరాలు నమోదు చేయకుండామహిళా సంరక్షణ కార్యదర్శి,ఇంజినీరింగ్ అసిస్టెంట్,ఫిషరీస్ అసిస్టెంట్ వెటర్నరీ అసిస్టెంట్ సిబ్బంది గైర్హాజరు కావడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ వారికి మెమో జారీ చేశారు.24 గంటల్లో మండల పరిషత్ కార్యాలయానికి స్వయంగా హాజరై వివరణ సమర్పించాలని ఆదేశించారు. విధిగా సమయపాలన పాటించాలని, పౌర సేవలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని హితవు పలికారు.పారిశుధ్యం, మంచినీరు మరియు వీధిదీపాలు వంటి మౌళిక అంశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు . విధుల నిర్వాహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అమర్నాథ్ గౌడ్ ఘటనపై గత ప్రభుత్వాన్ని విమర్శించిన టీడీపీ నేతలు

- వెసీపీ హయాంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆరోపణ.
- బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వ్యాఖ్య.




పోడూరు జూన్ 15 మనం న్యూస్ : గత ఐదేళ్ల వైసిపి పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చారని, అమర్నాథ్ గౌడ్ ఘటన ఇందుకు నిదర్శనమని టిడిపి తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమదం సొసైటీ మాజీ అధ్యక్షుడు దొంగ సూర్య ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన పోడూరులో సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్ రాజు పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం జరిగిన అమర్నాథ్ గౌడ్ ఘటన యావత్ భారతదేశం మరచిపోలేని విషాదం ఘటనగా ఆయన అభివర్ణించారు. అక్కను వేధిస్తున్నారని అమర్నాథ్ గౌడ్ ప్రశ్నించినందుకు వైసీపీ నేత, మరో ముగ్గురు కలిసి పెట్రోల్ పోసి హత్య చేశారని, ఇదే క్రమంలో గత గొడ్డలి పార్టీ పాలనలో లెక్కలేనన్ని దారుణాలు జరిగాయి అన్నారు.అమర్నాథ్ గౌడ్ హంతకుడు పాము వెంకటేశ్వరరెడ్డి బెయ్యి బయటకొచ్చి, బాధిత కుటుంబాన్ని చంపేస్తానంటూ బెదిరించడమే కాకుండా, అర్ధరాత్రి ఇంట్లోకి వెళ్లి హత్యాయత్నం చేశాడు అన్నారు.గొడ్డలి పార్టీ హయాంలో శాంతిభద్రతలు వికటించాయి అనేందుకు అమర్నాథ్ గౌడ్ ఘటన నిదర్శనం అన్నారు. చట్టం ముందు అందరూ సమానమే, ఎవరు తప్పు చేసినా 21 రోజుల్లో శిక్ష వేస్తామని హోరెత్తించే జగన్ రెడ్డికి.. ఈ కేసుల్లోని నేరస్తులపై ఏం చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు. టిడిపి మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేష్ రాజు, టిడిపి ఆచంట నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ గణపతినీడి రాంబాబు, పోడూరు మండల క్లస్టర్ ఇంచార్జ్ దశిక రామమోహనరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రరాజు, టిడిపి తెలుగు రైతు విభాగ మండల అధ్యక్షుడు బొక్క సూర్యనారాయణ, పోడూరు నీటి సంఘం అధ్యక్షుడు కోడేటి రామకృష్ణ, టిడిపి పోడూరు గ్రామ అధ్యక్షుడు బొంతు కాశీ విశ్వనాథ్, నిర్మించిన పాడు టిడిపి గ్రామ అధ్యక్షుడు నెక్కంటి సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాం జగన్మోహన్ రెడ్డి పాలనలో నేరస్తులకు అండగా నిలిచారని స్పష్టం చేశారు. నేరగాడైతే చాలు వైసీపీలో పార్టీ సభ్యత్వం ఉంటుందన్నారు. ప్రభుత్వాన్ని, పాలకులు చేస్తున్న అరాచకాలను ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని ధ్వజమెత్తారు. నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ప్రజలను మోసం చేసి జగన్ అధికారంలోకి వచ్చి ఆ సామాజిక వర్గాలకు మంచి చేసింది లేదన్నారు.ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపేసి డోర్ డెలివరీ చేసిన ఘనత ఆ ప్రభుత్వానికి దక్కింది అన్నారు.చిన్నాన వివేకానంద రెడ్డిని హత్య చేసిన నిందితులకు జగన్ కొమ్ముకాస్తూ కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం ఘనుడు జగన్ అన్నారు. సొంత చెల్లిని ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిప్పుతున్న క్రూరుడు జగన్ అన్నారు.అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అప్పటి ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అండగా నిలివడమే కాకుండా.. బాధితులకు ధైర్యాన్ని కల్పించిందని స్పష్టం చేశారు.
ఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం బాధితులకు న్యాయం, నేరస్తులకు శిక్ష దిశగా ముందుకు వెళ్తంది అన్నారు.నేరస్తులకు భయం పుట్టించేలా పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరపాలి



శంఖవరం జూన్ 15 మనం ప్రతినిధి: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరపాలని శంఖవరం మండలం వైసిపి అధ్యక్షులు నరాల శ్రీనివాసరావు అధికారుకు సూచించారు.ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు, శంఖవరం మండలం వైసిపి అధ్యక్షులు నరాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలో గల పలువురు వైసిపి నాయకులు సోమవారం ఉదయం శంఖవరం మండల తహసిల్దార్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నుండి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ ) ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అంతా పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా సక్రమంగా నిర్వహించాలని తహసిల్దార్ ను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, నిబంధనల ప్రకారం ప్రక్రియ సాగాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి గ్రామ వైసిపి అధ్యక్షులు అడపా సోమేశ్, కత్తిపూడి ఎంపీటీసీలు చొప్పా రాంబాబు, చల్లా సత్య ప్రసాద్,శంఖవరం గ్రామ వైకాపా నేత పి. శాంతి భరత్, మరియు మండల పరిధిలోని పలువురు వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహశీల్దార్ను కలిసిన శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటి

శంఖవరం జూన్ 15 మనం ప్రతినిధి: శంఖవరం మండలం నూతన తహశీల్దార్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మొసలి సూరిబాబును శంఖవరం గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసారు. గ్రామ అభివృద్ధికమిటీ సభ్యులైన సామాజిక కార్యకర్త మేకల కృష్ణ, బొమ్మిడి సత్యనారాయణ (చిట్టిబాబు), బొర్రా సత్తిబాబు, పర్వత రామకృష్ణ, గునపర్తి అపురూప్, రేలంగి వెంకట సత్యనారాయణ (దొంగబాబు) నూతన తహశీల్దార్ సూరిబాబును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. రెవెన్యూ రీ సర్వేలో నెలకొన్న సమస్యలపైన, ఆయా గ్రామాల్లో గత కొంతకాలంగా నియామకం ఒక చోట, విధులు మరోచోటగా కొందరు విఆర్వోలు ఉన్నారని, వారిని పూర్తిస్థాయి విఆర్వోలుగా నియమించాలని కోరారు.

## త్రిబుల్ ఐటీలో సీటు సాధించడం హర్షనీయం

- మాజీ ఎంపీ సీతారామలక్ష్మి



భీమవరం, జూన్ 15 (మనం న్యూస్): ప్రతిభ దొంగలించలేని సొత్తు అని ప్రతిభావంతులు ఏ ప్రాంతంలోనైనా గౌరవింపబడతారని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు త్రిబుల్ ఐటీలో సీటు సాధించడం విశేషమని రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఎంపీ కార్యాలయంలో త్రిబుల్ ఐటీకు ఎంపికైన భీమవరం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం, కులం, మతం అడ్డు రావని ప్రైవేట్ పాఠశాలకు దీటుగా మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి త్రిబుల్ ఐటీలో సీటు సాధించడం హర్షినీయమని దీనిలో బాలికలు ఎక్కువగా ఉండటం మరింత విశేషమని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ ఏడాది పదోతరగతిలో 592 మార్కులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చరిత్ర సృష్టించారని భీమవరం నుంచి 8 మంది విద్యార్థులు త్రిబుల్ ఐటీలో సీటు సాధించారన్నారు. ఈ సందర్భంగా త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, కోళ్ల సీతారామ్, కొండ్రు శ్రీనివాస్, టివివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు వేగంగా పూర్తి చేయాలి



రైతులకు సాగునీరు అందించే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

కూలీలకు ఎండల నుంచి రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి

పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు, గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే సాగునీటి వనరుల అభివృద్ధి పనులను ప్రాధాన్యతగా చేపట్టి, మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. సోమవారం వైరా నియోజకవర్గ పరిధిలో పర్యటించిన జిల్లా కలెక్టర్, వైరా మండలం సొన్నాల లక్ష్మీపురం గ్రామంతో పాటు కొనిజర్ల మండల కేంద్రంలో కొనసాగుతున్న కేనాల్ లింక్ కాలువ పూడికతీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కలెక్టర్ కార్మికులతో మాట్లాడారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామీణ ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు వ్యవసాయాభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. కాలువల పూడికతీత, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులు, రైతులకు సాగునీరు అందించే మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల లభ్యతను పెంచి, ఎక్కువ మంది కార్మికులకు పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చూడాలని, కూలీల హాజరు నమోదును పారదర్శకంగా నిర్వహించాలని, మాస్టర్ రోల్స్‌లోఎటువంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనుల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని, పనుల నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి పనిని ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ఫోటో క్యాప్చరింగ్ చేసి నమోదు చేయాలని, జియో ట్యాగింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించు కోవాలని కలెక్టర్ అన్నారు. పనుల ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకొని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పని స్థలాల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించడంతో పాటు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల ప్రభావం వల్ల కార్మికులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం గురించి మరింత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మాస్టర్ కార్డులను పరిశీలించిన కలెక్టర్, పని దినాల నమోదు, హాజరు వివరాలు, చెల్లింపుల స్థితిగతులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు మహిళా సంఘ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎంపీడీవోలు పనుల అమలు, పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అధిక సంఖ్యలో కార్మికులను సమీకరించి పనులు నిర్వహిస్తే అదనపు కాంపోనెంట్ నిధులు పొందే అవకాశం ఉందని తెలిపారు.కార్మికులు చేసిన పనికి సంబంధి ంచిన వేతన వివరాలను అదే రోజున వారికి స్పష్టంగా తెలియజేయాలని, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయ మౌలిక సదుపాయాల బలోపేతంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీలలో కొనిజర్ల తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో ఉపేంద్రయ్య, సర్పంచ్ గూదే పుష్పావతి, వైరా తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సక్రు నాయక్, లక్ష్మీపురం సర్పంచ్ నూతి వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నామ భద్రయ్య మృతి పట్ల సంతాపం

- అంతిమ యాత్రలో పాడే మోసిన మాజీ ఎంపీ నామ

ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః మహబూబాబాద్ జిల్లా బలపాల గ్రామానికి చెందిన నామ భద్రయ్య (95) ఆదివారం రాత్రి వృద్ధాప్య కారణాలతో పరమపదించారు. ఆయన మృతి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలిసిన బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సోమవారం ఉదయం వారి స్వగృహానికి చేరుకుని భద్రయ్య పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్న నామ స్మశాన వాటిక వరకు పాడె మోసినారు. భద్రయ్య కుమారుడు రమేష్, కుమార్తె విజయ లను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామస్థులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై చివరి వీడ్కోలు పలికారు.



## రెండు అంతర్జాతీయ, ఒక జాతీయ రికార్డ్ సాధించిన గాయకుడు నాగసాయి

- సర్టిఫికెట్స్ ప్రదానం చేసిన మాజీ స్పీకర్ మధుసూదనాచారి

ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ భక్తి గీతాల గాయకుడు, నాగసాయి ఎన్ఎస్పి రామగిరి రామాలయం వేదికగా 14 గంటలపాటు సుదీర్ఘంగా హనుమాన్ చాలీసా పారాయణం గానం చేసి రెండు అంతర్జాతీయ రికార్డులు (విశ్వం వరల్ రికార్డ్, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డు), ఒక జాతీయ స్థాయి రికార్డ్ (ఆక్సిజన్ బుక్ ఆఫ్ నేషనల్) సాధించినట్లు కార్యక్రమ పర్యవేక్షణ, గౌరవాధ్యక్షులు ఎన్ఎస్పి రామగిరి రామాలయ ప్రధాన అర్చకులు సముద్రాల వెంకటనరసింహ చార్యులు తెలియజేశారు. గాయకుడు నాగసాయికి మాజీ స్పీకర్ మధుసూదనాచారి, వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, గోల్డెన్ స్టార్ వరల్ రికార్డ్స్ తెలంగాణ చీఫ్ కోఆర్డినేటర్ వంజా మాలతి నాయుడు, మెగా రికార్డ్స్ క్రియేషన్స్ సంస్థ అధినేత పి.శ్రీనివాసరావు , తెలంగాణ శ్రీ అయ్యప్ప సేవార్థి ఐక్యవేదిక అధ్యక్షులు వాకటి భాస్కరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

# బడి మూతేశారు..

## తెరుచుకోని పాఠశాల తలుపులు..



మొదటి రోజే విధులకు డుమ్మా

చదువులు, మధ్యాహ్న భోజనానికి దూరమైన చిన్నారులు

అడవులను పట్టుకొని తిరుగుతున్న విద్యార్థులు

ఎర్రంపాడు ఉపాధ్యాయుల ఘనకార్యం





చర్ల, జూన్ 15 (మనం న్యూస్) : అధికారుల పర్యవేక్షణా లోపం అడవిబిడ్డలకు శాపంగా మారింది. వేసవి సెలవులను ముగించుకొని నూతన విద్యా సంవత్సం ప్రారంభమైన మొదటి రోజే బడి తలుపులు తెరుచుకోలేదు. మారుమూల అటవీప్రాంత గ్రామం కావడంతో ఎవరూ పట్టించుకోరనే ధైర్యంతో మొదటి రోజే ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొట్టడంతో బడి మూతపడింది. దీంతో మొదటి రోజే చిన్నారులు చదువులతో పాటు మధ్యాహ్న భోజనానికి దూరమయ్యారు.

చర్ల మండలం ఎర్రంపాడు గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభం రోజే మూతపడింది. నిబంధనల ప్రకారం విద్యా సంవత్సరం ప్రారంభం రోజున తప్పనిసరిగా పాఠశాలను తెరవాల్సి ఉండగా ఉపాధ్యాయులు విధులకు గైర్హాజర్ కావడంతో తలుపులు తెలుచుకోలేదు. ఫలితంగా 1 నుండి 5 వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న 26 మంది విద్యార్థులు చదువులతో పాటు మధ్యాహ్న భోజనానికి దూరమయ్యారు. పాఠశాల తెరవకపోవడంతో విద్యార్థులు అడవులలోని చెట్టుపుట్ట పట్టుకొని తిరుగుతున్నారు. మరి కొంతమంది తమ తల్లిదండ్రులకు చేదోడుగా విప్ప బద్దలను కొడుతూ కాలక్షేపం చేసారు.

మండలంలోని మారుమూల అటవీప్రాంత గ్రామాలలో అధికారుల పర్యవేక్షణాలోపం కారణంగా విద్యా వ్యవస్థ గాడితప్పిందన్న వాదనలు ఉన్నాయి. మారుమూల దట్టమైన అటవీప్రాంతంలోని పాఠశాలలు కావడంతో ఎవరూ పట్టచుకోరన్న ధైర్యంతో అక్కడి ఉపాధ్యాయులు తరచూ విదులకు గైర్హాజరవడం షరా మామూలే. విద్యా సంవత్సరం మొదటి రోజే ఉపాద్యాయులు విదులకు గైర్హాజరవడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది దసరా సెలవుల అనంతరం కొండెవాయి పాఠశాల ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరవడంతో అదికారులు అతడిపై చర్యలు తీసుకున్నారు. ఇదే పద్ధతిలో మరో ఉపాధ్యాయుడు డుమ్మా కొట్టడం గమనార్హం. భద్రాచలం ఐటిడిఏ యాజమాన్యం కింద పనిచేసే పాఠశాల కావడంతో ప్రాజెక్ట్ అధికారి విచారణ జరిపింది గైర్హాజరైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఎన్నిక

## ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కాసోజు శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్ సుదగాని





ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా కమిటీని సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షులు ఎలిగెండ్ల వెంకటేష్ నియమించారు. సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కాసోజు శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్ సుదగానిని నియమిస్తూ, నియామక పత్రాలను జారీ చేశారు. ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై మరింత అవగాహన కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాల్లో పోరాటాలు నిర్వహించడం, సంస్థను గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా, ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు సంస్థ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ, ప్రజల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేస్తారని, నాయకత్వం ఆశాభావం వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్య ప్రజలకు న్యాయం అందించడంలో కమిటీ కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజలకు అవసరమైన సమాచారం అందేలా చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే సంస్థ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా కమిటీల పునర్వ్యవస్థీకరణ కొనసాగుతోందని, అన్ని జిల్లాల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పారదర్శక పాలన సాధనకు సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన ఆయుధమని, దాని పరిరక్షణకు కమిటీ నిరంతరం కృషి చేస్తుందని, వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ వర్కింగ్ అధ్యక్షులు ఎటి ఆంజనేయులు చేతుల మీదుగా కాసోజు శ్రీధర్, కరుణాకర్ సుదగాని లకు నియామక పత్రాలను అందజేశారు. నూతన బాధ్యులకు సంస్థ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో ఖమ్మం జిల్లాలో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా డిప్యూటీ సీఎం భట్టి జన్మదిన వేడుకలు



ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ తదితరులతో కలిసి కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచి రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం 300 మంది వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరి అంచలంచెలుగా జాతీయ స్థాయి నేతగా ఎదిగినారని, ఆంధ్రా బ్యాంక్ డైరెక్టర్‌గా, పిసిసి కార్యనిర్వహక సభ్యులుగా పిసిసి కార్యదర్శిగా పని చేసినారని తెలిపారు. 2007లో ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిదుల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనమండలి సభ్యులు ఎన్నికై అనంతరం 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మధిర నియోజకవర్గంలో కంచుకోటను బద్దలుకొట్టి శాసనసభ సభ్యులుగా విజయం సాధించి తన నిరంతర ప్రజాసేవతో మధిర నియోజక వర్గాన్ని కాంగ్రెస్ ఖాతాలోకి మార్చడమే కాకుండా వరుసగా నాలుగు సార్లు శాసనసభ సభ్యులుగా తిరుగులేని విజయం సాధించి రికార్డు సృష్టించిన మహానాయకుడని అన్నారు.

ఆయన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో చీఫ్ విప్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా పని చేశారని, అనంతరం తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ పార్టీ నుండి ప్రతిపక్షనేత పని చేశారని అనంతరం 2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టి ముండుటెండ్లను సైతం లెక్కచేయకుండా ఒక పక్క ఆరోగ్యం సహకరించకపోయినా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1400 కిలోమీటర్లు పాదయాత్ర సాగించి చరిత్ర సృష్టించి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టేందుకు ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. డిసెంబర్ నుండి తెలంగాణ రాష్ట్ర నాల్గవ ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక,ప్రణాళిక,ఇంధన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి గత ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టి రాష్ట్ర ఆర్థిక వనరులు సమకూర్చుతూ ,అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళలగా చూస్తూ బడుగు, బలహీన, అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం సంక్షేమ పథకాలు అమలు పరుస్తూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్న కృషీవలురని అన్నారు.

# ఏడాది గడిచినా విడుదలకు నోచుకోని కాస్మోటిక్ చార్జీలు


- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి యాకూబ్ పాషా డిమాండ్



ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః రాష్ట్రంలోని మైనార్టీ గురుకులాల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాలికలకు చెల్లించాల్సిన కాస్మోటిక్ చార్జీలు ఏడాది గడిచినా ఇప్పటికీ వారి ఖాతాల్లో జమ కాకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. 2024-25 విద్యా సంవత్సరంలో మైనార్టీ బాలికలకు కాస్మోటిక్ కిట్లు పంపిణీ చేసిన ప్రభుత్వం, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కాస్మోటిక్ కిట్ల స్థానంలో నగదు మొత్తాన్ని నేరుగా బాలికల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించిందన్నారు. ఈ మేరకు ఆరు నెలల క్రితమే బాలికలందరికీ బ్యాంకు ఖాతాలు తెరిపించి, వాటి వివరాలను ప్రభుత్వానికి పంపించినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాస్మోటిక్ కిట్లలో షాంపూ, తలనూనె, టూత్ బ్రష్, దువ్వెన, రెండు రకాల రిబ్బన్లు, బట్టలు ఉతికే సబ్బులు, స్నాన సబ్బులు తదితర వస్తువులు ఉండేవని, వాటి కొనుగోలుకు అవసరమైన మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ విద్యా సంవత్సరం పూర్తయి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా చెల్లింపులు జరగకపోవడం విచారకరమని పేర్కొన్నారు. మైనార్టీ బాలికల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను వెంటనే బాలికల బ్యాంకు ఖాతాల్లో జమ చేసి వారికి న్యాయం చేయాలని ఎండి యాకూబ్ పాషా డిమాండ్ చేశారు.

# పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## మంత్రి క్యాంపు కార్యాలయంలో 46 మందికి అందజేత



ఖమ్మం, జూన్ 15(మనం న్యూస్)ః 'అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి మధ్యవర్తులు లేకుండా, వంద శాతం పారదర్శకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన 46 మంది లబ్ధిదారులకు రూ.16,64,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ నిధులు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు రూపాయినీ పక్కదారి పట్టకుండా, ఎలాంటి మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా పంపిణీ చేస్తూ నేరుగా లబ్ధిదారుల చేతులకే ఈ ఆర్థిక సాయం అందేలా చూస్తున్నామని వివరించారు.కార్పొరేట్ వైద్య భారాన్ని మోయలేక సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఈ సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఇక, అపు.. మీ కుప్పిగంతులు



- మెట్రో ఫేజ్-2కు దక్కని అనుమతి..
- ఎల్అండ్‌టీపై బెదిరింపులు..
- కాసుల కోసం కక్కుర్తివడి.. మెట్రో రైల్ భవిష్యత్తును పణంగా పెట్టిండ్రు?
- మీడియా సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : చారిత్రాత్మక మెట్రో రైల్ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అనాటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 28 శాతం కూడా పూర్తి చేయకుండా.. పనుల్లో అసంపూర్తిగా, అసంబద్ధంగా వదిలేస్తే?.. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మెట్రో ప్రాజెక్టును, 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని 72 శాతం పనులను పూర్తి చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రం సహకరించకపోయినా? రుణాలు సాధించి మెట్రోను పరుగులు పెట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేవలం మూడేళ్లలోనే మెట్రో నిర్మాణాన్ని పూర్తి చేసి, నిత్యం 5 లక్షల మంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నామంటే?.. అది బీఆర్ఎస్ ప్రభుత్వ సమర్థత అని వ్యాఖ్యానించారు. అటువంటి మెట్రోపై ఎవరో పనికిరాని చెత్త మాటలు మాట్లాడటం సరికాదని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ పట్ల అద్భుతమైన విజయంతో అనేక ప్రణాళికలను గత ప్రభుత్వం రూపొందించిందన్నారు. రేవంత్ రెడ్డి మాదిరి స్వార్థ ప్రయోజనాల కోసం అసలు ఉనికిలో లేని ఊహాజనిత నగరానికి మెట్రో తీసుకువెళ్లాలన్న మాదిరి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచించలేదు? అన్నారు. కేవలం ప్రజల ప్రయోజనాలు సౌకర్యం కోసమే దష్టిలో ఉంచుకొని మెట్రో ఫేజ్-2ను 6 కారిడార్లు, 72 స్టేషన్లతో 76.4 కిలోమీటర్ల మేర డిజైన్ చేసింది కేసీఆరేనని, నలుదిశలా ఆరు రద్దీ రూట్లలో ప్రణాళికలు రచిస్తే, వాటిని పనికిరాని రూట్లు అంటూ ప్రజల్ని అవమానిస్తారా..? అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. రెండున్నరేళ్లలో ఫేజ్-2ను అటకెక్కించడం మీ వైఫల్యమని, అధికారంలోకి రాగానే శంషాబాద్ మెట్రోను రద్దు చేసిన ద్రోహం మీదేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### ఎల్అండ్‌టీపై బెదిరింపులు..

మెట్రో ఫేజ్-2కు ఎల్అండ్‌టీ సంస్థ అంగీకరించలేదని ఎందుకు బుకాయిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏకంగా ఎల్అండ్‌టీ సీఎఫ్ఓనే బెదిరించి, పారిశ్రామికవేత్తల తలకు తుపాకీ పెట్టినట్లుగా భయభ్రాంతులకు గురిచేసి పారిపోయేలా చేసింది మీరే కదా అని ఆయన ఆరోపించారు. రూ. 30 వేల కోట్ల మెట్రో ఆస్తులను, నడిబొడ్డున ఉన్న మెట్రో భూములను కొల్లగొట్టేందుకే సంస్థను వెళ్లగొట్టే కుట్ర చేశారని ఆయన మండిపడ్డారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం కాసుల కోసం కక్కుర్తిపడ్డ రేవంత్.. హైదరాబాద్ మెట్రో రైల్ భవిష్యత్తును పణంగా పెట్టారని దుయ్యబట్టారు.

### మెట్రో ఫేజ్-2కు దక్కని అనుమతి..

యూపీ, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలను మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు మెట్రో ఫేజ్-2కు అనుమతి ఎందుకు తీసుకురాలేకపోయారో ముందుగా ప్రజలకు జవాబు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టును కేంద్రం నుంచి సాధించలేక, తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇన్ని కుప్పిగంతులు తొక్కుతున్నారని, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆయన తనదైన శైలీలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 71 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టినప్పటికీ, మీ 'బడే భాయ్'ని మెప్పించి ప్రాజెక్టును ఒప్పించలేక పోవడం మీ చేతకానితనానికి, దద్దమ్మ పాలనకు నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రం ప్రతిపాదించిన మెట్రో విస్తరణకు అనుమతి ఇవ్వని కేంద్రం పైన ముఖ్యంగా ప్రధానమంత్రిని విమర్శించే సత్తా ధైర్యం రేవంత్ రెడ్డికి లేదన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

- సోమవారం ప్రజావాణిలో 68 దరఖాస్తుల స్వీకరణ
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 15 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 68 దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అందిన వినతిపత్రాలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మాట్లాడుతూ.. ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ సమర్పించిన దరఖాస్తులను జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అలాగే, దరఖాస్తులపై అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను కూడా పోర్టల్లో నమోదు చేయాలని తెలిపారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యతగా తీసుకుని నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) అమరేందర్, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) దేవసహాయం, డీఆర్వో కె. పాండు, ఏవో చంద్రశేఖర్తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండో విడత మీడియా అక్రిడేషన్ కార్డుపై కమిటీ సభ్యులతో సుదీర్ఘంగా చర్చ

- నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిఎంకు షోకాజు నోటీసు జారీ
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 15 (మనం బ్యూరో):** రెండో విడత మీడియా అక్రిడేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తుల వారీగా కమిటీ సభ్యులతో చర్చించి, ఆమోదించిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్కర్నూల్ జిల్లాలో మీడియా అక్రిడేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెండో విడత అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., రెండో విడత జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అందిన 237 దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. జర్నలిజం వృత్తి సమాజానికి బాధ్యతాయుతమైన సేవ అని, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే విలేకరులకు ప్రభుత్వం కల్పిస్తున్న అక్రిడేషన్ సదుపాయాలు నిజమైన జర్నలిస్టులకే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారుల సేవా వివరాలు, వార్తా ప్రచురణలు, సంస్థల ధృవీకరణ పత్రాలు, పని అనుభవం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పలు దరఖాస్తులపై తమ అభిప్రాయాలు వెల్లడించగా, అర్హతలు, సమర్పించిన పత్రాలు, స్థానిక స్థాయి ధృవీకరణ నివేదికలను పరిశీలిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. పెండింగ్లో ఉన్న కొన్ని దరఖాస్తులపై అదనపు సమాచారం సేకరించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి జె. కిరణ్ కుమార్, జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ రావు, సురేష్ కుమార్, సాయిలు సాగర్, ప్రదీప్ కుమార్, వెంకట్ స్వామి, దస్తగిరి, మొహమ్మద్ ముబీన్ ఖాన్, శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ సంబంధిత అధికారులతో పాటు తదితరులు ఉన్నారు.



## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేత



- ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు
- అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 15 (మనం బ్యూరో):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గాలో అలంపూర్ చౌరస్తా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం అయిజ మండలంలోని పలు గ్రామాలు, అయిజ మున్సిపాలిటీకి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ రూ. 1,37,15,892 (ఒక కోటి ముప్పై ఏడు లక్షల పదిహేను వేల ఎనిమిది వందల తొంభై రెండు) రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే విజయుడు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అయిజ మండల బి ఎస్ పార్టీ ఇన్చార్జి వావిలాల రంగారెడ్డి, కో ఆప్షన్ మెంబర్స్ నాగన్న గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, అశ్వ పెద్దయ్య, చరణ్ రెడ్డి, (బి ఆర్ యస్ వి) అయిజ మండల అధ్యక్షుడు మత్తాలి,) లతో తదితరులు పాల్గొన్నారు.

## స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్ గోడపత్రికల ఆవిష్కరణ

**చిత్తూరు, జూన్ 15 మనం న్యూస్:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్' కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్లు, గోడపత్రికలను జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ సుమిత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 0-5 సంవత్సరాల లోపు పిల్లలలో విరేచనాల కారణంగా సంభవించే మరణాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూన్ 16 నుండి జూలై 31 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య-వెల్నెస్ కేంద్రాలు అంగన్వాడీ కేంద్రాలలో ప్రత్యేకంగా ఓఆర్ఎస్-జింక్ కార్నర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్తల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలను పంపిణీ చేస్తారని చెప్పారు. పిల్లలకు విరేచనాలు వచ్చినప్పుడు ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు 14 రోజుల పాటు జింక్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. దీంతో విరేచనాలు త్వరగా తగ్గడమే కాకుండా, పిల్లల రోగనిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో విరేచనాలు మళ్లీ వచ్చే అవకాశాలు తగ్గుతాయని తెలిపారు. రెండు నెలల నుంచి ఆరు నెలల వయస్సు ఉన్న శిశువులకు రోజుకు అర జింక్ మాత్ర, ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు రోజుకు ఒక జింక్ మాత్రను పరిశుభ్రమైన నీరు లేదా తల్లిపాలతో కలిపి ఇవ్వాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, ముఖ్యంగా సబ్బుతో చేతులు కడుక్కోవడం వంటి అలవాట్లను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఓఆర్ఎస్-జింక్ జోడీ వినియోగం, హ్యాండ్వాష్ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.




తల్లిదండ్రులు ఈ సూచనలను పాటిస్తే ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణాలను గణనీయంగా నివారించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగశశి భూషణ్ రెడ్డి, డీఐఓ డాక్టర్ హనుమంతరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ

- జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు




**తిరుపతి, జూన్ 15 మనం న్యూస్:** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అవసరమైన సహాయక ఉపకరణాలను అందించడం ద్వారా వారి సామర్థ్యాలను పెంపొందించి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. సోమవారం స్థానిక పట్టణంలోని బైరాగి పట్టెడ ఎంజీఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో సమగ్ర శిక్ష, తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల జాలి చూపడం కంటే వారిలోని ప్రతిభ, సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మూడు నుండి 18 సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరూ భవిత కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే 2025-26 విద్యా సంవత్సరంలో 2,056 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వివిధ రకాల భత్యాలను సమగ్ర శిక్ష ద్వారా అందించినట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ.. అలింకో సంస్థ సహకారంతో రూ.45 లక్షల విలువైన వివిధ రకాల ఉపకరణాలను 499 మంది విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ పరికరాలను సద్వినియోగం చేసుకొని తమ అభ్యాసన సామర్థ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల సంక్షేమం కోసం లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ ఉచిత ఉపకరణాలను అందించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రతి సంవత్సరం సుమారు రూ.65 లక్షల వ్యయంతో వివిధ రకాల భత్యాలను అందిస్తున్నట్లు తెలిపారు.బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రైసైకిల్ - 1,హియరింగ్ ఎయిడ్స్ - 236,సీపీ వీల్చైర్ విత్ కమోడ్ - 11,క్రచ్ ఎల్బో (లార్జ్) - 32,క్రచ్ ఎల్బో (స్మాల్) - 4,రోలేటర్ (అడల్ట్) - 45,రోలేటర్ (చైల్డ్) - 27, వీల్చైర్ (మీడియం) - 47,వీల్చైర్ (అడల్ట్) - 65,వీల్చైర్ (మమత) - 20,ట్రై వీలర్ సైకిల్ (కన్వెన్షనల్ సింగిల్) - 11,బ్రెయిల్ కిట్స్ - 3,జ టీఎల్ఎమ్ కిట్స్ (4 విభాగాలు) - 272,ఈ పరికరాలను విద్యార్థులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రూఫ్ టాప్ సోలార్

- 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి'' కార్యక్రమానికి 63 వినతులు
- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి

**తిరుపతి, జూన్ 15 మనం న్యూస్:** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 63 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సీఎండీకి వివరించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు రూఫ్ టాప్ సోలార్ అంశంపై మాట్లాడారు. ఈ అంశంపై సిఎండి సమాధానమిస్తూ సంస్థ పరిధిలో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై దశలవారీగా సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను పూర్తి చేస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరుపై ఆయన మాట్లాడుతూ సీనియారిటీ ప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. రైతుల దరఖాస్తు సీనియారిటీ లిస్టును ఆయా సెక్షన్ కార్యాలయాల వద్ద ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఏపీఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, లత, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో పీఎన్జీ కనెక్షన్ల విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్

**చిత్తూరు, జూన్ 15మనం న్యూస్:** జిల్లాలో పీఎన్జీ కనెక్షన్ల విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలిని సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్.సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లాలో వాణిజ్య, గృహ అవసరాల కోసం పీఎన్జీ (పిపెడ్ నేచరల్ గ్యాస్) కనెక్షన్ల విస్తరణకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ రాజేంద్రన్ పీడీ, డీఆర్డీఏ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, మెప్మా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి , సిటీ గ్యాస్ సంస్థ ప్రతినిధులు సేల్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎన్జీ కనెక్షన్ల విస్తరణకు అనుకూలమైన ప్రాంతాలు, అందుబాటులో ఉన్నసదుపాయాలు, మౌలిక వసతుల వివరాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను మూడు రోజులలోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సిటీ గ్యాస్ సంస్థ సమర్పించే నివేదిక ఆధారంగా సంబంధిత మున్సిపల్ ప్రాంతాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, హోటళ్లు, వాణిజ్య సంస్థలు, గృహ వినియోగదారులను పీఎన్జీ కనెక్షన్ల వైపు ఆకర్షించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.పీఎన్జీ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, తదుపరి దశలో మరో సమీక్ష సమావేశాన్ని కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం




- పీజీఆర్ఎస్ – రెవెన్యూ క్లినిక్‌లో 235 వినతులు స్వీకరణ
- ప్రజా వినతులు పరిస్కరిస్తే ప్రజలలో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుంది
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 15మనం న్యూస్:** ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారుచిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ అమలులో భాగంగా కలెక్టరేట్లో సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ రాజేంద్రన్ , కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమం నందు మొత్తం 235 వినతులు నమోదయ్యాయి. వాటిలో అత్యధికంగా 175 వినతులు రెవెన్యూ,సర్వేశాఖకు సంబంధించినవే కావడం విశేషం. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి వినతిని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న అర్జీలను ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే డిస్పోజ్ చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజా వినతులపై స్పందన వేగవంతమైతేనే ప్రజలలో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

## వైభవంగా శ్రీ వేణుగోపాలస్వామివారి పుష్పయాగ మహోత్సవం

### పది రకాల పుష్పాలు, మూడు రకాల పత్రాలతో దివ్యార్చన

### భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తిన పుష్పయాగ వైభవం



**తిరుపతి జూన్15 మనం న్యూస్:** కార్వేటినగరంమండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో సోమవారం నిర్వహించిన పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా, భక్తి శ్రద్ధల నడుమ జరిగింది. పుష్పాల పరిమళాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, భక్తులు స్వామివారి దివ్యానుగ్రహాన్ని ఆస్వాదించారు.ఈ సందర్భంగా ఉదయం శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేసి విశేషంగా పూజలు సమర్పించారు.అనంతరం వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ తులసి, చామంతి, మల్లె, గన్నేరు, కనకాంబరం, రోజా, తామర, కలువ, మొగలిరేకులు తదితర పది రకాల పుష్పాలు, మూడు రకాల పవిత్ర పత్రాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. పుష్పయాగం అనంతరం స్వామి, అమ్మవార్లు గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు మంగళదర్శనం ప్రసాదించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెంగ్రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధితో విమర్శలకు చెక్ పెడదాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళదాం: చిత్తూరు ఎంపీ,ఎమ్మెల్యే లు


**చిత్తూరు జూన్15 మనం న్యూస్:** ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళగలిగితే, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సమర్ధంగా వంతంగా తిప్పికొట్టవచ్చునని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. అదే సమయంలో స్థానిక సంస్థాగత ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా మనం సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' విజయోత్సవ సభను సోమవారం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా సంక్షేమ విజయోత్సవ సభల నిర్వహణకు సంబంధించి,, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టిడిపి జిల్లా అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, చూడా చైర్పర్సన్ కఠారి హేమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి,టిడిపి, బిజేపి, జనసేన పార్టీ ముఖ్య నేతల సంయుక్త ఆధ్వర్యంలో సమీక్షించారు. ముందుగా తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ మహోన్నత వ్యక్తి సేవలను గుర్తు చేసుకున్నారు.అనంతరం చిత్తూరు నియోజకవర్గాన్ని టాప్ 10లో నిలబెట్టిన చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ కృషిని ఎంపీ దగ్గుమళ్ళ,కూటమి నాయకులు, కార్యకర్తలు కొనియాడారు..గడిచిన రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు మాట్లాడారు. తల్లికి వందనం, ఆటో డ్రైవర్ల సేవలో, ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, దీపం 2.0, స్త్రీ శక్తి ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం లబ్ధిదారులు వారు పొందిన లబ్ధిని వివరించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనను కొనియాడారు. తర్వాత చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ...రెండేళ్ల కూటమిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజ వేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ఫలితంగా రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతిని సాధిస్తోందని చెప్పారు.




ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు ఆలోచనలు, సమర్థవంతమైన పాలనలో రాష్ట్రానికి భారీగా కంపెనీలు పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ కు తరలి వస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు లభిస్తుంది అన్నారు. చిత్తూరు నగర అభివృద్ధికి, రోడ్ల విస్తరణ కోసం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు. ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో చిత్తూరు నియోజకవర్గాన్ని టాప్ 10లో నిలబెట్టిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సమర్థవంతమైన నాయకత్వానికి నిదర్శనంగా నిలిచారని ప్రశంసించారు.

# అమెరికా-ఇరాన్ డీల్ గుడ్..

## 'హర్మూజ్'పై వెయిటింగ్
## ప్రపంచ నేతల పోస్ట్‌లు





**ఢిల్లీ, జూన్ 15:** పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివరలో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి.

''అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధి లో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం'' అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ వెల్లడించారు.

''ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉంది''
**- యూకే ప్రధాని కీర్ స్టార్మర్**

''అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం''
**- జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్**

''ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలి''
**- ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్**

''ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం''
**- తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్**

# హర్మూజ్‌ను తెరిచినా కొన్ని నెలలు ఇబ్బందే

## భారత్ పరిస్థితేంటీ?



ఢిల్లీ, జూన్ 15:: అమెరికా-ఇరాన్ మధ్య శాంతిఒప్పందం కుదరడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి మరికొద్ది రోజుల్లో తెరుచుకోనుంది. అయినప్పటికీ ఇన్నాళ్లుగా నెలకొన్న ఇంధన సరఫరా సమస్యలు, చమురు మంటలు రాత్రికి రాత్రే పూర్తిగా చల్లారే అవకాశం లేదు. పరిస్థితులు సాధారణ స్థితికి చేరి, ఉద్రిక్తతలకు ముందున్న పరిస్థితి నెలకొని చమురు రవాణా జరగాలంటే కొన్ని నెలల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. మరి ఈ పరిణామాలతో భారత్కు ఊరట ఎంత? దేశంలో ఇంధన ధరలు తగ్గేనా..?

యుద్ధం ముందు వరకు ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో ఐదోవంతు హర్మూజ్ జలసంధి మీదుగానే జరిగేది. అయితే ఇరాన్-అమెరికా దాడుల వల్ల ఈ జలమార్గాన్ని మూసివేయడంతో గత కొన్ని నెలలుగా పర్షియన్ గల్ఫ్‌లో వందలాది చమురు నౌకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత తాత్కాలిక కాల్పుల విరమణ, ఇతరత్రా పరిణామాలతో కొన్ని నౌకలు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో హర్మూజ్ను దాటినా.. వాటి సంఖ్య చాలా తక్కువ.

ఇప్పుడు అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం జరగడంతో ఈ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. శుక్రవారం డీల్‌పై సంతకాలు జరిగిన తర్వాత.. హర్మూజ్ మీదుగా నౌకల రాకపోకలు ప్రారంభం కానున్నాయి.

అయితే, దీనివల్ల తక్షణమే ఇంధన సరఫరా పెరగదని పారిశ్రామిక నిపుణులు చెబుతున్నారు. ''సాధారణంగా చమురు నౌకలు చాలా నెమ్మదిగా కదులుతాయి. ఇప్పటికిప్పుడు హర్మూజ్ను తెరిచినా ఆ నౌకలు చేరుకోవాల్సిన దేశాలకు చేరడానికి కొన్ని నెలలు పడుతుంది. అక్కడ ఈ ముడిచమురును రిఫైనరీలకు డెలివరీ చేస్తారు. చమురును శుద్ధి చేసిన తర్వాత రిటైల్ మార్కెట్లోకి సరఫరా చేస్తారు. దీన్నిబట్టి చూస్తే ఇంధనం సరఫరా పెరిగేందుకు చాలా సమయం పట్టొచ్చు'' అని ఎస్అండ్‌పీ గ్లోబల్ ఎనర్జీ ఫ్యూయల్ అండ్ రిఫైనింగ్ రీసెర్చ్ గ్లోబల్ హెడ్ డేనియల్ ఇవాన్స్ అభిప్రాయపడ్డారు. ఇక, బీమా, ఉద్యోగుల నియామకాలు, నౌకల లోడింగ్ వంటి వాటికి కూడా సమయం పడుతుందని పేర్కొన్నారు.

దీనికితోడు ఉద్రిక్తతల కారణంగా పశ్చిమాసియాలోని కొన్ని సంస్థలకు నిల్వ సామర్థ్యం లేకపోవడంతో చమురు వెలికితీత ప్రక్రియను నిలిపివేశాయి. ఇప్పుడు ఆ కార్యకలాపాలు పునరుద్ధరించడం కూడా సమస్యలతో కూడుకున్నదేనని నిపుణులు పేర్కొంటున్నారు. నిల్వ సామర్థ్యం, ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలున్న సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు తక్షణమే ఉత్పత్తిని పునరుద్ధరించే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

### ధరల సంగతేంటీ..?

ఈ డీల్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 83 డాలర్లకు చేరింది. అయితే, యుద్ధం ముందు నాటి (70 డాలర్ల)తో పోలిస్తే ఈ ధర ఇంకా ఎక్కువే. అందువల్ల ఇప్పటికిప్పుడే రిటైల్ మార్కెట్లో వీటి ధరలు తగ్గే అవకాశం లేదు. ఇక, ప్రస్తుతం హర్మూజ్ వద్ద నిలిచిపోయిన నౌకలు అక్కడి నుంచి బయటకు రావాలి. ఆ తర్వాత కొత్త ట్యాంకర్లు మళ్లీ ఇంధనం లోడ్ చేసుకోవాలి. ఈ ప్రక్రియంతా చాలాకాలం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

### భారత్‌కు ఉపశమనమే..

ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధి తిరిగి అందుబాటులోకి వస్తుండటంతో భారత్‌కు ఉపశమనం లభించినట్లే. గల్ఫ్ దేశాల నుంచి మళ్లీ మనకు చమురు దిగుమతులు పెరిగితే దేశీయంగా ఇంధన, గ్యాస్ సరఫరా మెరుగవుతుంది. యుద్ధం కారణంగా చమురు సరఫరా నెమ్మదించడంతో పాటు అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో దేశీయ ఆయిల్, గ్యాస్ కంపెనీలపై అదనపు భారం పడింది. దాన్ని తగ్గించేందుకు కేంద్రం ఎక్సైజ్ సుంకంలో కోత విధించినా.. రిటైల్ ధరలను పెంచక తప్పలేదు. ''ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లు ఏడాది మొత్తంలో ఆర్జించిన లాభాలను.. ఈ ఒక్క త్రైమాసికంలో కోల్పోయాయి. ఇప్పడు ఒప్పందం కుదరడంతో ఇంధన సరఫరా పెరుగుతుంది. దానివల్ల ధరల భారం కూడా తగ్గొచ్చని ఆశిస్తున్నాం'' అని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

ఇక, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు దిగి రావడంతో భారత్‌కు దిగుమతుల భారం తగ్గుతుంది. దీనివల్ల రూపాయి బలపడటంతో పాటు ద్రవ్యోల్బణ ఆందోళనలు తొలగుతాయి. కంపెనీలకు షిప్పింగ్, బీమా ఖర్చులు తగ్గుతాయి. ఇవన్నీ ఆర్థికవ్యవస్థకు ఊతమిస్తాయని ఇండస్ట్రీ నిపుణులు పేర్కొంటున్నారు. యుద్ధానికి ముందువరకు భారత్ ముడిచమురు అవసరాల్లో 88శాతం దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంది. ఇందులో దాదాపు సగం గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ మీదుగా రవాణా అయ్యేది. ఇక, మన దేశ ఎల్పీజీ అవసరాల్లో 60శాతానికి దిగుమతులే ఆధారం. ఇందులో 90శాతం ఈ జలసంధి మీదుగానే రావాలి.

# యోగా దినోత్సవం.. కోల్కతాలో పాల్గొననున్న మోదీ

**కోల్‌కతా, జూన్ 15:** యోగాతో ఆరోగ్యకర ఉపయోగాలను తెలియజేసే లక్ష్యంతో ఐరాస ఏటా జూన్ 21ను 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా ప్రపంచవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బెంగాల్ రాజధాని కోల్‌కతా లో భారీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్రావ్ జాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ నేతృత్వం వహించి, యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు.'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే థీమ్తో ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని జాదవ్ పేర్కొన్నారు. లక్షలాది మంది ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకున్నారని తెలిపారు. 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్' సమన్వయంతో, విదేశాల్లోని 210కి పైగా భారత మిషన్లు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,500 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.




### మోడీ అభ్యర్థన మేరకు...

యోగాను విశ్వవ్యాప్తం చేసే ఉద్దేశంతో భారత ప్రధాని నరేంద్ర మోడీ 2014, సెప్టెంబరు 27న ఐక్యరాజ్య సమితి (ఐరాస) జనరల్ అసెంబ్లీ 69వ సెషన్ ప్రారంభోత్సవంలో ఏటా జూన్ 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరపాలని అభ్యర్థించారు. అదే ఏడాది డిసెంబరు 11న ఈ తీర్మానానికి 177 సభ్య దేశాల ఆమోదం లభించింది. దీంతో 2015 నుంచి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా యోగా డేను నిర్వహించుకుంటున్నారు.

# రెండు హెలికాప్టర్లు ఢీ..

## ప్రముఖ సింగర్‌తోసహా ఆరుగురు మృతి



**బ్రెజిల్, జూన్ 15:** గగనతలంలో రెండు హెలికాప్టర్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రముఖ సింగర్, సంగీతకారుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బ్రెజిల్లోని రియో డి జెనిరోలో జరిగింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. రియో డి జెనిరో గగనతలంలో ఢీకొన్న హెలికాప్టర్లు నగరానికి పశ్చిమప్రాంతంలో కూలిపోయాయి. అందులో ఒకటి కార్ డీలర్‌షిప్ పార్కింగ్ ప్రాంతంలో కూలింది. అక్కడ ఎలక్ట్రిక్ వాహనాలు పార్క్ చేసి ఉండటంతో.. కొన్నింటికి మంటలు అంటుకున్నాయి. వాటిని ఆర్పివేసినట్లు అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. వారి శరీరాలు గుర్తుపట్టలేనివిధంగా కాలిపోయాయి. విమానయాన అధికారులకు అందజేసిన ప్రయాణికుల జాబితా ప్రకారం.. మృతుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. వారిలో అమెరికన్ సింగర్ ఒలివర్ ట్రీతో పాటు ఓ సంగీతకారుడు, అర్జెంటీనా వీడియో డైరెక్టర్, అర్జెంటీనా యూట్యూబర్ ఉన్నారు. 32 ఏళ్ల ఒలివర్ ట్రీ వరల్ టూర్లో భాగంగా బ్రెజిల్లో పర్యటిస్తున్నారు. ఈయన వెరైటీ హెయిర్‌స్టైల్తో యువతలో విశేష ఆదరణను సొంతం చేసుకున్నారు. స్పాటిఫైలో ఆయన పాటలకు నెలకు 11 మిలియన్ల మంది శ్రోతలు ఉన్నారు. వరల్ టూర్‌లో భాగంగా 30 దేశాల్లో 70 ప్రదర్శలు ఇవ్వాల్సిఉండగా, ఆదివారం ఈ ఘటన జరిగింది.

# కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్‌పై దాడి



**జైపూర్, జూన్ 15:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. జైపూర్‌లో నిరసన కార్యక్రమంలో అతడు ప్రభుత్వానికి వ్యతికేరంగా నినాదాలు చేస్తుండగా.. కొందరు వ్యక్తులు అతడి వాహనం వద్దకు దూసుకువచ్చారు. అనంతరం అభిజీత్ చెంపపై కొడుతూ దాడికి యత్నించారు. వెంటనే స్పందించిన సీజేపీ కార్యకర్తలు అతడిని కొట్టిన వ్యక్తులపై మూకుమ్మడి దాడి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జైపూర్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద సీజేపీ నిరసన చేపట్టిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అభిజీత్‌పై దాడి చేసిన నిందితులు పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి..దర్యాప్తు చేస్తున్నామన్నారు. దీనిపై అభిజీత్ స్పందిస్తూ.. ఈ ఘటనతో ఆగ్రహానికి గురవ్వద్దని యువతకు సూచించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తమ ఉద్యమాన్ని ఆపబోమన్నారు.

# గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రసంగం

## విద్యార్థుల వాకౌట్



**వాషింగ్టన్, జూన్ 15:** గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్కు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ప్రసంగించేందుకు వేదిక పైకి రాగానే పలువురు స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులు వాకౌట్ చేశారు. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ వ్యతిరేకత వ్యక్తమైంది. ఇజ్రాయెల్ ప్రభుత్వంతో గూగుల్‌కు ఉన్న ఒప్పందాన్ని నిరసిస్తూ పాలస్తీనాకు మద్దతుగా వారంతా వేదిక వద్ద నుంచి వెళ్లిపోయారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..ఈ నిరసనకు ప్రాజెక్ట్ నింబస్ కారణం. ఇజ్రాయెల్, గూగుల్, అమెజాన్ మధ్య కుదిరిన ఈ క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కాంట్రాక్ట్ విలువ 1.2 బిలియన్ డాలర్లు. గాజాలో ఘర్షణ విషయంలో ఇజ్రాయెల్ ప్రభుత్వ కార్యకలాపాలకు ఈ ప్రాజెక్ట్‌తో ప్రయోజనం లభిస్తోందని స్టాన్‌ఫోర్డ్ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వారం ముందే వాకౌట్ గురించి ప్రకటన చేశారు. అయితే స్నాతకోత్సవ ప్రసంగంలో ఇతర స్పీకర్లానే పిచాయ్ ఏఐ గురించి ప్రస్తావించకపోయినా వ్యతిరేకతను మాత్రం ఎదుర్కొన్నారు. పలువురు విద్యార్థులు వేదిక వద్ద నుంచి వెళ్లిపోతున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి.

కాగా.. తన ప్రసంగాన్ని కొనసాగించిన పిచాయ్ స్టాన్ఫోర్డ్‌లో తాను చదివిన రోజుల్ని గుర్తుచేసుకున్నారు. ఆశావహ దృక్పథం అవసరాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రతీతరం తమదైన రీతిలో కష్టాలను ఎదుర్కొందన్న విషయాన్ని గుర్తుచేశారు. ''మనం డిగ్రీలు తీసుకొని ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టిన తర్వాత అదెలా ఉండాలో మనం ఎంచుకోలేం. కానీ, పరిస్థితులను ఎలా అర్థం చేసుకోవాలనేది మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది'' అని విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల వాకౌట్ గురించి ఆయనకు ప్రశ్న ఎదురైంది. అయితే ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు పిచాయ్ ఆసక్తి చూపలేదు.

# రష్యా చమురు ట్యాంకర్లో సోదాలు.. భారతీయుడి అరెస్ట్



**లండన్,జూన్ 15:** రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్ 'స్మిట్రోస్'ను బ్రిటన్ దళాలు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో సోదాలు చేపట్టిన బ్రిటన్ నేషనల్ క్రైమ్ ఏజెన్సీ.. నౌకలోని ఓ భారతీయుడిని అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు తాజాగా వెల్లడించారు.


''రష్యా షాడో ఫ్లీట్ నౌకలో సోదాల అనంతరం 38 ఏళ్ల భారత పౌరుడిని అరెస్ట్ చేశాం. మాస్కోపై ఉన్న ఆంక్షలను ఉల్లంఘించాడనే అభియోగాలపై ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నాం'' అని బ్రిటన్ నేషనల్ క్రైమ్ ఏజెన్సీ (ఎన్సీఏ) అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే, ఆ వ్యక్తి ఎలాంటి నేరానికి పాల్పడ్డారనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నామని, ఇప్పుడే ఏ విషయం చెప్పలేమని ఎన్సీఏ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ నౌకలో ఇంకా 24 మంది సిబ్బంది ఉన్నారు. వీరంతా జార్జియా, భారత్కు చెందిన పౌరులని యూకే అధికారులు వెల్లడించారు. కాగా.. అరెస్టయిన వ్యక్తి పేరు, ఇతరత్రా వివరాలు బయటకు రాలేదు.

ఈ చమురు నౌక కామెరూన్ జెండాతో ఇంగ్లిష్ ఛానల్లో ప్రయాణిస్తున్న సమయంలో బ్రిటన్ సైనిక దళాలు అందులోకి ప్రవేశించాయి. 6 గంటలపాటు సాగిన ఈ ఆపరేషన్‌లో బ్రిటన్ రాయల్ మెరైన్ కమాండోలు, ఎన్సీఏ అధికారులు పాల్గొన్నారు. అందుకు సంబంధించిన వీడియోను ఎన్సీఏ తమ ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. ఆపరేషన్ తర్వాత నౌకను ఇంగ్లాండ్ దక్షిణ తీరంలో ఓ సురక్షిత స్థానానికి తీసుకెళ్లినట్లు బ్రిటన్ ప్రకటించింది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు.. రష్యా వందల సంఖ్యలో నౌకలను వివిధ దేశాల జెండాలతో నడుపుతోంది. ఈ 'షాడో ఫ్లీట్'లో భాగంగానే ఈ ట్యాంకర్ రష్యా నుంచి చమురు రవాణా చేస్తోందని బ్రిటన్ ఆరోపించింది.

# డీల్‌కు ఇజ్రాయెల్ అడ్డం పడుతోందా..?

## లెబనాన్‌పై కొనసాగుతున్న దాడులు





**జెరూసలెం, జూన్ 15:** డీల్ కుదుర్చుకోవడానికి ఇరాన్-అమెరికా సిద్ధంగా ఉన్న సమయంలో ఈ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్ అడ్డం పడుతోంది. లెబనాన్‌పై దాడులు ఆపితేనే ఒప్పందం కుదురుతుందని టెహ్రాన్ స్పష్టంచేసినా.. క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఒప్పందం ఇంకా కుదరనందున గాజా, సిరియా, లెబనాన్లలో స్వాధీనం చేసుకున్న భూభాగాల నుంచి తాము వైదొలగబోమని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ ప్రకటించారు. హెజ్బొల్లా స్థావరాలపై తాము చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ఇరాన్ దాడులకు తెగబడితే మళ్లీ యుద్ధ పరిస్థితులు నెలకొంటాయని హెచ్చరించారు. ఇజ్రాయెల్ స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఇరాన్ చేసే ఏ డిమాండ్‌నైనా రెడ్ లైన్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు.

ఆదివారం అమెరికా-ఇరాన్ ఒప్పందం ఖరారవడానికి కొన్ని గంటల ముందు ఇజ్రాయెల్ భూభాగం వైపు హెజ్బొల్లా కాల్పులు జరిపింది. దీంతో ఆ కాల్పులకు ప్రతిస్పందనగా బీరుట్లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఐడీఎఫ్‌ను ఆదేశించారు. హెజ్బొల్లా కాల్పుల విరమణను గౌరవిస్తేనే లెబనాన్లో దాడులు ఆగుతాయని.. లేదంటే మళ్లీ విరుచుకుపడతామని ఐడీఎఫ్ హెచ్చరించింది.

లెబనాన్లో అమెరికా శాశ్వతంగా సైనిక ఆపరేషన్లను నిలిపివేయాలని ఇరాన్ ఒప్పందంలో నిబంధన పెట్టింది. ఈ డీల్‌పై జూన్ 19వ తేదీన సంతకాలు చేయనున్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ ఉప మంత్రి కాజెమ్ గరీబాబడీ వెల్లడించారు. ఇక తుది చర్చలు మాత్రం ఈ డీల్‌లోనిల అంశాల అమలుపైనే ఆధారపడి ఉంటాయన్నారు. ఒప్పందంపై సంతకాలు చేసేందుకు ఇరుపక్షాలు శుక్రవారం జెనీవాలో సమావేశం కానున్నట్లు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ తెలిపింది. ఈ సమయంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం.

# డీల్‌లో ప్రధాన ఒప్పందాలు

- వెల్లడించిన ఇరాన్ వార్తా సంస్థ



**టెహ్రాన్, జూన్ 15:** ఇరాన్-అమెరికా ఒప్పందం కుదరడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ డీల్‌పై ఆసక్తి నెలకొంది. ఈసందర్భంగా ట్రంప్ మెత్తబడ్డారా..? ఇరాన్ ఒక అడుగు వెనక్కి వేసిందా..? అనేవి చర్చనీయాంశాలుగా మారాయి. 107 రోజుల పాటు కొనసాగిన ఈ సంక్షోభానికి తాజా ఒప్పందం ఎంతవరకు ముగింపు పలికిందో తెలుసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇరుదేశాల మధ్య అంగీకారానికి వచ్చిన ఒప్పందంలోని వివరాలను ఇరాన్ వార్తా సంస్థ మెహ్ర్ న్యూస్ వెల్లడించింది. దీనిలో మొత్తం నిబంధనలు ఉన్నట్లు పేర్కొంది. విస్తృత ఒప్పందానికి ఇవే పునాదులని వెల్లడించింది.

లెబనాన్ సహా ఇరాన్ మిత్రపక్షాలపై తక్షణం యుద్ధాన్ని నిలిపివేయాలి. ఇరాన్ అంతర్గత విషయాల్లో అమెరికా జోక్యం చేసుకోకూడదు. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలి. అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని 30 రోజుల్లో పూర్తిగా తొలగించాలి. ఇరాన్ చుట్టుపక్కల ప్రదేశాల నుంచి అమెరికా దళాలను పూర్తిగా వెనక్కి తీసుకొనేందుకు కట్టుబడి ఉండాలి. ఇరాన్ 'అరేంజ్మెంట్స్' ప్రకారం హర్మూజ్ జలసంధిని 30 రోజుల్లో పూర్తిగా తెరవాలి. ఇరాన్ పై చమురు ఆంక్షలు తొలగించడం. పెట్రోకెమికల్ ఉత్పత్తులు, డెరివేటివ్ల నుంచి వచ్చే ఆర్థిక లబ్ధి పూర్తిగా ఇరాన్కు అందేటట్లు చేయడం ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా, దాని మిత్రదేశాలు 300 బిలియన్ డాలర్ల విలువైన ప్రణాళిక సమర్పించాలి. అణు అంశాలపై ఒప్పందానికి, అమెరికా విధించిన ప్రాథమిక, ద్వితీయశ్రేణి ఆంక్షల తొలగింపునకు, ఐరాస, ఐఏఈఏ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ తీర్మానాలను తొలగించేందుకు 60 రోజులపాటు చర్చలు. ఎన్పీటీ ఒప్పందం ప్రకారం అణ్వాయుధాలు ఉత్పత్తి చేయబోమని ఇరాన్ పునరుద్ఘాటించాలి. చర్చల సమయంలో అమెరికా ఈ ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించకూడదు. అమెరికా స్తంభింపజేసిన ఇరాన్కు చెందిన 24 బిలియన్ డాలర్లను విడుదల చేయాలి. చర్చల ప్రారంభానికి ముందే వీటిల్లో సగం విడుదల చేయాలి. ఒప్పందం అమలుకు పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటుచేయాలి. తుది ఒప్పందాన్ని ఐరాస భద్రతా మండలి తీర్మానం ద్వారా ఆమోదించాలి.

## ఉపముఖ్యమంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



తిరుమలగిరి, జూన్ 15 (మనం న్యూస్): హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే భవన్లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కుటుంబం సతీష్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఆహార భద్రతపై తనిఖీలు చేయాలి కలెక్టర్

సూర్యాపేట, జూన్ 15 (మనం ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలో సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఆహార భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.15 రోజులకొకసారి కార్యాచరణ ప్రణాళిక ప్రత్యేక నిఘా ప్రతి పదిహేను 15 రోజులకు ఒకసారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు. వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందేలా పాలు, పాల ఉత్పత్తుల విక్రయదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిత్యావసర పాలు, నూనెలు, మాంసం, గుడ్లు, స్వీట్లు, సిద్ధం చేసిన ఆహార పదార్థాలపై నిఘా పెంచి, నమూనాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

**జాతీయ రహదారిపై ప్రత్యేక తనిఖీలు...**


65వ జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు,



దాబాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఆహార నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదైన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. పాఠశాలలు, అంగన్వాడీల్లో శిక్షణ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వారికి, చిన్న పిల్లలకు ఆహారం అందించే అంగన్వాడీ కార్యకర్తలకు దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు సైతం ఆహార భద్రతపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో ఆహార వస్తువుల నిల్వ, భద్రతకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమాజానికి హానికరమైన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ, రవాణా. అమ్మకాలపై ఆహార భద్రత, పోలీస్, మరియు ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్లు చేపట్టాలని ఆదేశించారు.

**ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తప్పనిసరి...**

ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం జిల్లాలోని చిన్న, పెద్ద ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. వినియోగదారుల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కల్తీ ఆహారంపై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్య పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కల్తీ ఆహారం లేదా నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే గూగుల్ ప్లే స్టోర్ లోని ఫుడ్ సేఫ్టీ కనెక్ట్ యాప్ ద్వారా గానీ, లేదా జిల్లా ఆహార భద్రతా కార్యాలయం 9133291926, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం 08684-222666, రాష్ట్ర ఆహార భద్రతా హెల్ప్‌లైన్ 9100105795, 040-21111111 హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్వో వెంకటరమణ, డిటిడిఓ శంకర్, ఎస్సి డిడి దయానందరాణి,డిఐఓ కోటి రత్నం డిడబ్ల్యూఓ, నరసింహారావు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలి

తిరుమలగిరి, జూలై 15 (మనం న్యూస్): ఖమ్మం జిల్లాలోని ఏడో తరగతి చదువుతున్న రజక సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తిరుమలగిరి మండల తహసిల్దార్ హరి ప్రసాద్ కు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు మాట్లాడుతూ అభం శుభం తెలియని మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడమే కాకుండా,మూడంతస్తుల బిల్డింగ్ నుండి నెట్టి వేయడంతో నిస్సహాయ స్థితిలో పడిపోయిందని దానితో అక్కడ ఉన్న జనం ఆ మైనర్ బాలికను ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందని చెప్పారు. మైనర్ బాలిక పై అత్యాచారానికి పాల్పడిన మహమ్మద్ గౌస్ పాషాను కఠినంగా శిక్షించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి ఫోక్సో కేసు నమోదు చేసి ఉరితీయాలని డిమాండ్ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న మైనర్ బాలికకు నాణ్యమైన వైద్యం అందించాలని, మైనర్ బాలిక తో పాటు తల్లిదండ్రులకు భద్రత కల్పించాలని రాంప్రభు డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన బాలికకు రాష్ట్ర ప్రభుత్వము 50 లక్షలు నష్టపరిహారంతో పాటు, స్పెషల్ పెన్షన్ కింద నెలనెలా 50 వేల రూపాయలు ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, వారికి సొంత ఇల్లు కూడా లేదని ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని , ఈ ఘటనపై ప్రతి ఒక్కరు స్పందించాలని రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బాలికకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు వంగరి బ్రహ్మం, పులిమామిడి సోమయ్య, బూర్గుల ప్రభాకర్, సుంకర కిరణ్, సోమరాజు,గూడూరు వెంకన్న, అంబాటి మహేష్ గౌడ్, కాసాని శ్యామ్ యాదవ్, ముద్దంగుల యాదగిరి, పులిమామిడి బిక్షం, జంపాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పూలు చల్లి ఆహ్వానం



తిరుమలగిరి, జూన్ 15 (మనం న్యూస్): తిరుమలగిరి మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలకి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం లో పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు పూలు చల్లి సోమవారం ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కసిరెడ్డి అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పాఠశాలకు అధికారికంగా ప్రీ ప్రైమరి తరగతుల నిర్వహణ కొరకు అనుమతులు వచ్చాయని , 3 సం లు నిండిన బాలబాలికలతో పాటు 1వ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న బాల బాలికలని పాఠశాలలో చేర్పించాలని , నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజు తల్లిదండ్రులు స్వచ్ఛందంగా విచ్చేసి వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లలని ( 10మంది ) పాఠశాలలో నూతనంగా నమోదు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సి హెచ్. కవిత , కె. సత్యనారాయణ రెడ్డి , ఎన్. వెంకట్రామనర్సయ్య , బి. సౌమ్యాబాయి , టి. రవీందర్ ,టి. గిరి విద్యార్థులు పాల్గొన్నారు.

# బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం




యాదగిరిగుట్ట, జూన్ 15(మనంన్యూస్): దేవస్థానంలో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి అధికారుల కళ్ళు తెరిపించి కొండపై ఉన్న దుకాణాలను టెండర్లు వేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి యాదగిరిగుట్ట స్థానిక వ్యాపారి అన్నల్దాస్ వెంకటేష్ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభ్యున్నతికి, పౌరహక్కుల కల్పనకు, రాజ్యం సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాను న్యాయం వైపుగా అడుగులు వేయిస్తారనే స్ఫూర్తితో.. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాలను టెండర్లు వేయాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. భారత దేశానికి వెన్నెముకల నిలిచిన బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారి అడుగు జాడలు నాకు స్ఫూర్తి దాయకంగా భావిస్తూ ఆయన చూపిన బాటలో నడుస్తూ తనకు న్యాయం చేయాలని కోరారు. ఇవేకాకుండా ఎన్నోసార్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కి, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీకి, దేవాదాయ ధర్మాదాయ మంత్రులకు వినతిపత్రాలు సమర్పించి న్యాయం జరుగుతుందని పడిగాపులు కాస్తూ వేచిచూడాల్సిన పరిస్థితి నుండి భారత పౌరులకు సాధారణంగా మారిన దుస్థితిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కి విన్నవిస్తూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ విధంగా నైనా తనకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నానని చెప్పారు. ఇప్పటికైనా దేవస్థాన ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కొండపై ఉన్న తాత్కాలిక దుకాణాలకు టెండర్ల నోటిఫికేషన్ ప్రక్రియ విడుదల చేయాలని కోరారు.

## సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్



సూర్యాపేట, జూన్ 15 (మనం ప్రతినిధి): పంచాయతీ కార్యదర్శుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడిన జడ్పి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్ కె .మెయినోద్దీన్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గరిడేపల్లి మండలంలో పని చేస్తున్న సమయంలో అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో రుజువు కావడంతో మెయినోద్దీన్ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెయినోద్దీన్ గతంలో గరిడేపల్లి మండలంలో సీనియర్ అసిస్టెంట్గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన తన పరిధిలోని పలువురు పంచాయతీ కార్యదర్శుల నుండి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.కలెక్టర్ ఆదేశాల మేరకు మెయినోద్దీన్ చేసిన వసూళ్లపై ఎంక్వైరీ చేపట్టగా విచారణలో పంచాయతీ కార్యదర్శుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలతో సహా నిజాలు నిరూపితమయ్యాయి. విచారణ నివేదిక ఆధారంగా సదరు సీనియర్ అసిస్టెంప్ జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతిని సహించేది లేదనే హెచ్చరికలతో ఆయనను సస్పెండ్ చేస్తూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా అవినీతికి పాల్పడితే ఇలాంటి చర్యలే ఉంటాయని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

# నకిలీ కరెన్సీ నోట్ల గుట్టురట్టు

- ఇద్దరు నిందితుల అరెస్టు
- నకిలీ కరెన్సీ, ప్రింటర్, స్కానర్, పల్సర్ బైక్ స్వాధీనం
- నల్లగొండ డీఎస్పీ కె శివరాం రెడ్డి



నల్లగొండ, జూన్ 15 ( మనం ప్రతినిధి): నకిలీ కరెన్సీ నోట్లను తయారు చేసి, రద్దీగా ఉన్న షాపులు,సంతలు మరియు కౌంటర్ వద్ద వృద్ధులు ఉన్న దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చలామణి చేస్తున్న ఇద్దరు నిందితులను చండూర్ పోలీసులు అరెస్టు చేసినట్లు నల్లగొండ డిఎస్పి శివరామిరెడ్డి తెలిపారు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చండూర్ పోలీస్ స్టేషన్లోకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు బెజవాడ రాజీవ్ రాజు, ఫ్లాట్ నెం. 506, కంచర్ల టవర్స్, ఏచూరి గార్డెన్ సమీపంలో, మిర్యాలగూడ రోడ్, నల్గొండ. దుర్గం పావని స్వస్థలం నివాసం,టేకుమట్ల గ్రామం, సూర్యాపేట మండలం,జిల్లా. వీరి ఇరువురు కలిసి ఈనెల 12న చండూర్ మండలం తాస్కానిగూడెం గ్రామానికి చెందిన ఆవుల కిరణ్ చండూర్ టౌన్లోని శ్రీ మాధురి మిల్క్ సెంటర్ వద్ద పాలు విక్రయిస్తుండగా, సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో నిందితుడు రాజీవ్ అలియాస్ రాజు అక్కడికి వచ్చి పాల ప్యాకెట్ కొనుగోలు చేసి రూ.500 నోటు ఇచ్చాడు. ఆ నోటు నకిలీ అని గుర్తించిన ఫిర్యాదుదారుడు ఆవుల కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చండూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో, చండూర్ సీఐ టి. రాము ఆధ్వర్యంలో, చండూర్ ఎస్ఐ జె. శివకుమార్ సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి కేసును త్వరితగతిన ఛేదించారన్నారు. ఇట్టి నకిలీ నోట్ల చలామణి కేసు దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారం ఈ రోజు అనగా సోమవారం ఉదయం 10.గంటల సమయంలో పైన తెలిపిన నిందితులను వారు ఉంటున్న ఫ్లాట్ నెంబర్ 506, కంచర్ల టవర్స్, ఏచూరి గార్డెన్ దగ్గరలో, మిర్యాలగూడ రోడ్డు, నల్గొండ లో పట్టుబడి చేసి విచారించగా నేరస్థులు రాజీవ్, అతని భార్య పావని లు వారి కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వలన నకిలీ నోట్లు తయారు చేయడం గురుంచి యుట్యూబ్ లో వీడియో లు చూసి నేర్చుకొని, దానికి కావలసిన ప్రింటర్, పేపర్ ను ఆన్లైన్ లో కొనుగోలు చేసి నకిలీ నోట్లు తయారు చేస్తూ, చలామణి చేస్తున్నాము అని, దీని వలన దేశ ఆర్థిక వ్యవస్థ మీద ప్రభావం పడుతుంది అని తెలిసిన కూడా చేసినాము అని తెలిపినారు.

**నిందితుడు బెజవాడ రాజీవ్ గత నేర చరిత్ర**

01 హత్య కేసు , 01 హత్యాయత్నం కేసు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్,తొర్రూర్ పోలీస్ స్టేషన్,కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్,గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్,జనగాం పోలీస్ స్టేషన్,అద్దంకి పోలీస్ స్టేషన్,సుబేదారి పోలీస్ స్టేషన్ లతో కలిపి మొత్తం 07 నకిలీ నోట్ల చలామణి కేసులు నమోదు కాగా మిర్యాలగూడ ఐ టౌన్ పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ నమోదై ఉందన్నారు.నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న వస్తువులు

నకిలీ రూ.500 నోట్లు - 15 , నెంబర్ లేని పల్సర్ బైక్ , 3.ఎ్క కంపెనీ ప్రింటర్ స్కానర్ , 100, బాండ్ పేపర్స్ ,20 కట్ చేసిన పేపర్ ముక్కలు , ఒక కత్తెర , ఒక స్పార్కెల్ పెన్, రెండు స్టీల్ స్కేలులు ఉన్నాయన్నారు. ఈ కేసును నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో, చండూర్ సీఐ టి. రాము ఆధ్వర్యంలో త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ జె. శివకుమార్ మరియు వారి సిబ్బంది ఏఎస్ఐ శ్రీరాములు, కానిస్టేబుల్ ఆనంద్ రెడ్డి, శివరాం కృష్ణ, నరేందర్, ఉపేందర్లను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, అభినందించారు.

## పుట్టినరోజు సందర్భంగా మొక్కల నాటి వేత



నల్లగొండ, జూన్ 15( మనం ప్రతినిధి): 48 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్పొరేటర్ యమ కవిత భర్త యామ దయాకర్ పుట్టినరోజు సందర్భంగా క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యమ దయాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి విరివిగా మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరినారు. అదేవిధంగా 48వ డివిజన్ ను పరిశుభ్రమైన డివిజన్ గా ప్లాస్టిక్ రైతు డివిజన్ గా హరిత మైన ఆహ్లాదకరమైన డివిజన్ గా మార్చాలని దానికి ప్రతి ఒక్కరు సహకరించాలని డివిజన్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మంచాలపు శ్రీనివాస్, దాసరి వెంకట్, జీనుగుల శివ,తోట భగత్, గడగోజు విజయ్,చిన్న బోయిన గణేష్, మిరియాల శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించితీరాలి

- సోమవారం ప్రజావాణిలో 119 దరఖాస్తుల స్వీకరణ
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 15 (మనం బ్యూరో): సోమవారం ప్రజావాణిలో వచ్చిన అర్జిదారుల దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అర్జిదారులకు ఆయన భరోసా ఇచ్చారు. జిల్లా అధికారులు సమావేశం లో స్థానిక సంస్థల కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ....జిల్లాలో ఇప్పటికీ చాలా శాఖలలో ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, ఎంపిడిఓ, కలెక్టరేట్ కార్యాలయంలో ఎక్కువగా ప్రజావాణి ఫైలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. వాటిని తక్షణమే పరిష్కరించి వెంటనే ప్రజావాణి పోర్టల్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని శాఖల అధికారులు ప్రజావాణి పోర్టల్ లో ఇంకా లాగిన్ చేయలేదని గుర్తు చేశారు. ఆయా శాఖల అధికారులు వెంటనే లాగిన్ చేసుకొని ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించి, వెంటనే అప్డేట్ చేయాలని ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు అయ్యే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజావాణిలో పంచాయతీ రాజ్, మున్సిపల్, జిల్లా పౌరసరఫరాల, భూ సర్వే రికార్డుల శాఖ, గృహ నిర్మాణ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, బ్యాంకింగ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, పోలీస్, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ గురుకుల విద్య, వెనకబడిన తరగతుల గురుకుల విద్య, గిరిజన అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించి 119 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. అంగన్వాడీల బలోపేతం, నషాముక్త్ భారత్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాల బలోపేతం, నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం అధికారులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల చేరికలను పెంచేందుకు జూన్ 13 నుంచి 19 వరకు 'అమ్మ మాట - అంగన్వాడి బాట' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు కమ్యూనిటీ భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల అమలుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందించాలని జరీనా బేగం కోరారు. అదేవిధంగా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన లక్ష్యంగా 'నషాముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పహచాన్' కార్యక్రమాన్ని జూన్ 17 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 17న. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, ఎక్సైజ్, ఎన్ఎస్ఎస్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. జూన్ 21న. నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా 'సే నో టు డ్రగ్స్' అంశంపై విద్యార్థులతో వాదోపవాద పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై చేపట్టే ఈ అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సంబంధిత అన్ని శాఖల అధికారులు చురుకుగా పాల్గొని సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి.ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నవితరణకు విరాళం



మహానంది, జూన్15,మనంన్యూస్: మహానంది పుణ్యక్షేత్రం లో భక్తుల కోసం అమలవుతున్న నిత్యా అన్న వితరణకు విరాళం అందినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. సోమవారం నంద్యాల జిల్లా నూనెపల్లికి చెందిన యెగిలి లక్ష్మీ దేవమ్మ అనే మహిళ అన్నవితరణ కార్యక్రమానికి 9 వేల రూపాయలు అందజేశారు. ఆమెకు బాండు తో పాటు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## సరస్వతీ నమస్తుభ్యం



- విద్యార్థులను ఆత్మీయంగా స్వాగతించిన హాస్టల్ సంక్షేమాధికారి రమేష్

తుగ్గలి జూన్ 15(మనం న్యూస్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జొన్నగిరి హాస్టల్ సంక్షేమ అధికారి రమేష్ అన్నారు.సోమవారం జొన్నగిరి ఎస్సీ సంక్షేమ వసతి గృహం లో నూతన విద్యా సంవత్సరానికి హాస్టల్కు చేరుకున్న విద్యార్థులకు హాస్టల్ వార్డెన్ రమేష్ ఆత్మీయ స్వాగతం పలికారు.ముందుగా సరస్వతి దేవికి పూజలు నిర్వహించి విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం ప్రార్థించారు.ఈ సందర్భంగా వార్డెన్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. హాస్టల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.సరస్వతి పూజ అనంతరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు

- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు ,జూన్ 15, మనం ప్రతినిధిః** ప్రజావాణిలో ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 73 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 21,పెన్షన్ లకు 21,ఇతర శాఖలకు సంబంధించినవి 31 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల అర్జీలను నేరుగా జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి వెంటనే కంప్యూటర్ ఆధారిత రశీదు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలపై దరఖాస్తులు అందించినవారు తమ సమస్య స్థితిగతులను కంప్యూటర్ రసీదు ద్వారా పరిశీలించుకోవచ్చు అని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిఆర్ఓ రవి కుమార్, ఆర్డీవో కృష్ణవేణి,అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి

- **పెన్షన్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు, జూన్ 15, మనంప్రతినిధిః** జిల్లాలో వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని,వర్షాకాలానికి పూర్తి సంసిద్ధతతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని,పెన్షన్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి అని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, నూతన పెన్షన్ల మంజూరు, వన మహోత్సవం, గ్రామాల పారిశుద్ధ్యం, వర్షాకాలం సంసిద్ధత అప్రమత్తత,తాగునీటి సరఫరా,వన మహోత్సవం మొక్కల పెంపకం,తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో ఎక్కడా జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక ప్రజా దర్బార్, ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ల మంజూరు కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచాలని సూచించారు.లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, వాగులు, కల్వర్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి, లోతట్టు ప్రాంతాల నుంచి గర్భిణీ స్త్రీలను ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, తదితర అంశాలపై



ముందస్తు కార్యకరణతో అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా అందేలా చూడాలని, సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. మేడారం పరిసర ప్రాంతాలలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిపిఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపీడీవోలు,ఎంపీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇగ్నో ప్రవేశాలకు జూలై 15 వరకు గడువు

- **వరంగల్ ఇగ్నో పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వై. వెంకటేశ్వర్లు**



**వరంగల్, జూన్ 15 (మనం న్యూస్):** ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) జులై -2026 సెషన్ కి సంభందించిన వివిధ మాస్టర్, బ్యాచిలర్ డిగ్రీ, పి.జి. డిప్లొమా,డిప్లొమా సర్టిఫికెట్ ప్రోగ్రాములకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో హైద్రాబాద్ రీజనల్ సెంటర్ అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్.వై. వెంకటేశ్వర్లు, లాల్ బహదూర్ కళాశాల ప్రిన్సిపాల్ డా. అరుణా డి.హెచ్.రావు, ఇగ్నో స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ యస్.వి. రమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఇగ్నో టర్మ్ ఎండ్ పరీక్షల నిర్వహణ తీరును డాక్టర్. వెంకటేశ్వర్లు పర్యవేక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఇగ్నో దేశంలో నిరఫ్ ర్యాంకింగ్స్ లో అత్యుత్తమ ర్యాంకింగ్ తో అత్యుత్తమ ఓపెన్ యూనివర్సిటీ కేటగిరిలో మొదటి ర్యాంకులో నిలిచిందని, ఇగ్నోలోని పలు ప్రోగ్రాములతో పలు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఇగ్నో హైద్రాబాద్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రాజు బొల్లా పేర్కొంటూ, వరంగల్ స్టడీ సెంటర్ లో డిమాండ్ ఉన్న సర్టిఫికెట్ ఇన్ పౌల్ట్రీ ఫార్మింగ్, పి.జీ. డిప్లొమా మరియు మాస్టర్స్ ఇన్ రూరల్ డెవలప్మెంట్, డిప్లొమా ఇన్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పి.జీ. డిప్లొమా ఇన్ సర్టిఫికెట్ ఇన్ జియో ఇన్ఫర్మాటిక్స్, ఎంబిఏ, ఎంసీఏ లాంటి ఇతర ప్రోగ్రాంలు అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు దరఖాస్తు కోసం www.ignou.ac.in ద్వారా ఆన్ లైన్ లో ప్రవేశాలు తీసుకోవాలని, ఏదైనా సందేహాలు ఉంటే ఇతర వివరాలకు 98493 81085 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

# ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌ను కలిసిన సంతోష్

**ములుగు, జూన్ 15 మనం న్యూస్ః** సేవలాల్ విద్యార్థి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ సంతోష్ నాయక్ ఐటిడిఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టొప్పో, ఐఅఖి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు, యువత సంక్షేమం మరియు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారూ తప్పకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు.




# జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి




- **పెండింగ్ దరఖాస్తులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు ,జూన్ 15, మనం ప్రతినిధిః** జిల్లా అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, పెండింగ్ దరఖాస్తులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో రెవెన్యూ అధికారులతో భూ భారతి, భూ సేకరణ, రామచంద్రపురం భూముల రీ సర్వే, మీసేవ ధ్రువీకరణ పత్రాల మంజూరు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూ భారతి కార్యక్రమం అమలు పురోగతి, భూ రికార్డుల పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అవసరాలకు, అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణలో నిబంధనలు పాటిస్తూ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రామచంద్రపురం భూముల రీ సర్వే అంశంపై పెండింగ్లో ఉన్న భూ వివాదాలు, సర్వే ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు స్పష్టమైన హక్కులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మీసేవ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువ కాలం పెండింగ్లో ఉండకూడదని, ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ సేవలను నిర్దిష్ట గడువులో అందించేలా సంబంధిత అధికారులు పనిచేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పురోగతిపై సమీక్షిస్తూ, సంబంధిత అధికారులు సమగ్రంగా పనిచేసి అన్ని వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల అమలు, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, పెండింగ్ సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి,డీఆర్ఓ రవికుమార్, కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్, పర్యవేక్షకులు మంజుల, మహేష్ బాబు, అన్ని మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్



**మహాదేవపూర్, జూన్ 15 మనం న్యూస్ః** మహదేవపూర్ మండలంలోని చంద్రుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాగేపల్లి గ్రామంలో జరుగుతున్నఉపాధిహామీపనులను పై అధికారుల సూచనల మేరకు సోమవారం సర్పంచ్ గుర్సింగ బాపు పరిశీలించారు. ఉపాధి కూలీలు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని సర్పంచ్ అభినందించారు ఈ సందర్భంగా పనుల ప్రగతి, నాణ్యతపై ఆయన సమీక్ష నిర్వహించి సమయపాలన గురించి పలు సూచనలు చేశారు.

అనంతరం చంద్రుపల్లి నర్సరీలోని మొక్కలను పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి సంరక్షణ, నిర్వహణపై మార్గదర్శకాలు ఇచ్చారు గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఆయన సూచించారు.

# జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీలో సత్తా చాటిన మంగపేట యువకులు

**మంగపేట, జూన్ 15, మనం ప్రతినిధిః** ములుగు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంజా సూర్య ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఖ45 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో మంగపేట గ్రామపంచాయతీ టీం సత్తాచాటి మూడవ స్థానం దక్కించుకుంది. గత 20 రోజులుగా ములుగు జిల్లా జాకారం స్టేడియం లో కొనసాగుతున్న ఈ టోర్నమెంట్ లో జిల్లా వ్యాప్తంగా 45 టీం లు పాల్గొన్నాయని ఆ టీం లతో చివరి వరకు పోరాడి 3వ స్థానం దక్కించుకున్నట్లు మంగపేట గ్రామ పంచాయతీ క్రికెట్ టీం కెప్టెన్ సయ్యద్ ఖాళీద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం జాకారం స్టేడియంలో కుంజా సూర్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ చేతుల మీదుగా కప్ తో పాటు తృతీయ బహుమతి క్రింద రూ 15,000 నగదును అందుకున్నట్లు ఖాళీద్ వెల్లడించారు. గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం ప్రధాన్యతను తెలియజేసేందుకు కుంజా సూర్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీ తమకు ఎంతగానో ఊయోగపడిందని అన్నారు. ఈ కార్యక్రమలో డి ఎస్ పి, టీం సభ్యులు పాల్గొన్నారు.




# వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం




**వరంగల్, జూన్ 15(మనంన్యూస్)ః** చెన్నారావుపేట మండల వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించడం మైనది. వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని సంఘ అధ్యక్షులు ఈగ సత్యనారాయణ మరియు ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడమైనది. తదనంతరం సభ్యులందరితో కలిసి గ్రామపంచాయతీకి వెళ్లి, వృద్ధుల సమస్యల పట్ల సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించాలని కోరుతూ, సర్పంచ్ శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి గారికి వినతి పత్రాన్ని అందజేయమైనది.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వరంగంటి మల్లయ్య, కుమారస్వామి, చందుల కృష్ణమూర్తి, కంది నారాయణరెడ్డి, ముత్యం సాంబయ్య, గట్ల కృష్ణ, బిక్షపతి, సిద్ధ కుమారస్వామి మరియు అనేకమంది మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.

# అల్పాహార పథకం ప్రారంభం

**దుగ్గొండి, జూన్ 15 (మనం న్యూస్):** దుగ్గొండి మండలం వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఈరోజు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహార (టిఫిన్) పథకాన్ని ఉదయం 8 గంటలకు ఘనంగా ప్రారంభించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులందరికీ పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు గౌడ్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాటేటి రవి వార్డు సభ్యులు మంద పరిమిల అనిల్ గుండెబోయిన రాజు ఇటుకల మౌతిక్ గుజ్జుల రమ శ్రీను నాంపల్లి రాజయ్య పొగాకు దివ్య బాలకృష్ణ అధత్సండా లక్ష్మి రాజు హెడ్మాస్టర్ సుభాషిని శ్రీవిద్య సృజన రవి తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణి ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి



- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, జూన్ 15(మనంన్యూస్)ః** వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 202 దరఖాస్తులు ప్రజావాణిలో నమోదయ్యాయి. అందులో రెవెన్యూ శాఖకు 64, మున్సిపాలిటీకి 48, హౌసింగ్ శాఖకు 22, డీఆర్డీఓకు 10, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 58 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్వో సాంబశివరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాన్ని కొనసాగించి వినతులు స్వీకరించారు.

# మొహర్రం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- **జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**

**వరంగల్, జూన్ 15(మనంన్యూస్)ః** మొహర్రం పండుగను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మొహర్రం ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య మాట్లాడారు. ఊరేగింపు మార్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, వీధి దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. మత పెద్దలు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మొహర్రం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, ఊరేగింపులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి. రమేష్, వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# నాణ్యమైన, కూరగాయలు ఉపయోగించాలి

- **కలెక్టర్ సత్యశారద**

**వరంగల్, జూన్ 15(మనంన్యూస్)ః** విద్యార్థినులకు మెరుగైన వసతి, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం వరంగల్ నగరంలోని శివనగర్ ప్రభుత్వ షెడ్యూల్ కులాల (ఎస్సీ) బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సందర్శన సందర్భంగా వసతి గృహంలోని వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ సరఫరా, విద్యార్థినులకు అందిస్తున్న వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారి సమస్యలు, అవసరాలు, చదువుకు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకుంటూ, అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహార విలువలు కలిగిన ఆహారం అందించాలని సూచించారు. వంటల్లో తాజా, నాణ్యమైన కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని హాస్టల్ వార్డెన్కు



ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు అల్పాహారం, భోజనం, ఇతర ఆహార పదార్థాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థినులు తమకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువులో రాణించాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీడీఓ భాగ్యలక్ష్మి, డీబీసీడీఓ పుష్పలత, డీటీడీఓ నారాయణరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారంగా బ్రేక్ ఫాస్ట్ భోజన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. విద్యార్థులు వారి యొక్క వసతులను పరిశీలించి బాగా చదువుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ సి డి ఓ భాగ్యలక్ష్మి డిబిసిడిఓ పుష్పలత, డిటిడిఓ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవపూర్ కేజీబీవీపాఠశాలలో పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

**మహాదేవపూర్ జూన్ 15మనం న్యూస్ః** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న సి ఆర్ టి ఇంగ్లీష్ మరియు సి ఆర్ టి గణితం పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోస్టులకు ఈనెల 17 నుండి 18 వ తేదీ సాయంత్రం 4,30 నిమిషాల లోపు అర్హులైన మహిళా అభ్యర్థులుసమర్పించాలని పాఠశాల ప్రత్యేక అధికారికనక లక్ష్మి తెలిపారు పూర్తి వివరాలకు 9493043767ను సంప్రదించగలరు.



# ఇండియా Aపై సూపర్ ఓవర్‌లో శ్రీలంక A విజయం..

ముక్కోణపు సిరీస్ లో భాగంగా సోమవారం ఇండియా అతో జరిగిన మ్యాచ్ లో శ్రీలంక అ విజయం సాధించింది. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ లో ఫలితం తేలింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యఛేదనలో శ్రీలంక ఏ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 265 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయింది. ఆఖరి ఓవర్లో లంక విజయానికి ఐదు పరుగులు అవసరం కాగా.. అర్షద్ ఖాన్ తొలి ఐదు బంతుల్లో మూడే రన్స్ ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. చివరి బంతికి శ్రీలంక విజయ సమీకరణం రెండు పరుగులు కాగా.. ఒక రన్ (లెగ్ బై) పూర్తయిన తర్వాత గుణశేఖర (18) రనౌటయ్యాడు. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్ కు దారితీసింది. సూపర్ ఓవర్ లో శ్రీలంక 16 పరుగులు చేయగా.. భారత్ 9 పరుగులే చేసింది.

265 పరుగుల లక్ష్యఛేదనలో లంక ఇన్నింగ్స్ 10/0తో మొదలుపెట్టింది. భారత బ్యాటర్ విప్రాజ్ నిగమ్ డేంజర్ ఏరియాలోకి రావడంతో అంపైర్లు పది పరుగులను పెనాల్టీగా విధించి.. శ్రీలంక ఇన్నింగ్స్కు కలిపారు. ఈ పెనాల్టీ లేకపోతే మ్యాచ్ ఫలితం మరోలా ఉండేది. లంక బ్యాటర్లలో సదీర సమరవిక్రమ (83; 102 బంతుల్లో 6 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. నిరోషన్ డిక్వెల్లా (37), వనుజ సహన్ (25), అవిష్క ఫెర్నాండో (22), విశేన్ (17) పరుగులు చేశారు. భారత బౌలర్లలో ఆయుష్ బదోని 2, అర్షద్ ఖాన్, నిశాంత్ సింధు, విప్రాజ్ నిగమ్, అనుకుల్ రాయ్, సుర్యాంశ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఏ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో ఒక్కరూ కూడా హాఫ్ సెంచరీ చేయలేదు. 125 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన జట్టును సుర్యాంశ్ షెడ్జే (72; 66 బంతుల్లో), విప్రాజ్ నిగమ్ (51; 49 బంతుల్లో) ఆదుకున్నారు. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (21; 14 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్), ప్రభ్ సిమ్రన్ (11) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. కెప్టెన్ తిలక్ వర్మ (23), వైస్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (37) భారీ ఇన్నింగ్స్ లు ఆడలేకపోయారు. చివర్లో సుర్యాంశ్, విప్రాజ్ జట్టును ఆదుకున్నారు. శ్రీలంక బౌలర్లలో విజయ్ కాంత్ 3, షిరాజ్ 3.. సహన్, ముతులన్, వనుజా సహన్ తలో వికెట్ తీశారు.



## పాక్ పై ఫైఫర్..
# దీప్తి శర్మ ప్రపంచ రికార్డు

మహిళల ప్రపంచ కప్ లో టీమ్ఇండియా శుభారంభం చేసింది. తొలి మ్యాచ్ లోనే పాకిస్థాన్ ను 64 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఆల్ రౌండర్ దీప్తి శర్మ (5/10) ఫైఫర్ తో పాక్ ను గడగడలాడించింది. ఈ క్రమంలో ఆమె ఓ ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ మహిళల టీ20 క్రికెట్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచింది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 166 వికెట్లు ఉన్నాయి. ఈ క్రమంలో థాయ్ లాండ్ బౌలర్ తైపాట్చా పుత్తవాంగ్ (165)ను దీప్తి అధిగమించింది. ఇక ప్రపంచ కప్ ల్లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన మూడో బౌలర్గానూ దీప్తి శర్మ నిలిచింది. ఈక్రమంలో తనకు సవాళ్లు అంటే ఇష్టమని.. పెద్ద వేదికలపై మంచి ప్రదర్శన ఇవ్వడం ఆనందంగా ఉందని దీప్తి తెలిపింది.




''నాకు ఒత్తిడితో కూడుకొన్న పరిస్థితులు అంటే చాలా ఇష్టం. మరీ ముఖ్యంగా ఐసీసీ టోర్నీలను ఆస్వాదిస్తా. గతంలో నేను ఎక్కడ ముగించానో.. ఇప్పుడు అక్కడినుంచే ప్రారంభించానని అనుకుంటున్నా. నేను ప్రాక్టీస్ సమయంలో ఏం చేస్తానో ఇప్పుడు మైదానంలోనూ అదే అమలుచేశా. పిచ్ పరిస్థితులు కూడా ఇందుకు సహకరించాయి. నన్ను నేను మెరుగుపర్చుకొనేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటా. యంగ్ గా ఉన్న అప్పటికి.. సీనియారిటీ వచ్చిన ఇప్పటికి స్పష్టమైన తేడా చూపించాలి. తప్పులను పునరావృతం కాకుండా చూసుకుంటున్నా. నిరంతరం అవిష్కర్ సార్ తో మాట్లాడుతూనే ఉంటా. బౌలింగ్ వీడియోలు చూస్తూ పొరపాట్లను సరిదిద్దుకొనేందుకు ప్రయత్నిస్తా. బ్యాటింగ్ లో స్మృతి, హర్మన్ మంచి పునాది వేశారు. అభిమానుల నుంచి మంచి మద్దతు లభించింది. అదే మాకు స్ఫూర్తినిచ్చింది. ఇది జట్టు విజయం. ఆ దేవుడి దయ వల్ల మాకు అందరి సహకారం లభించింది'' అని దీప్తి తెలిపింది.

# భారత్ - పాక్ మ్యాచ్.. ఆ వీడియోలన్నీ ఫేక్!

ఇప్పుడు ఎక్కడ చూసినా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో వీడియోలు జనరేట్ అవుతున్నాయి. సరదాగా చేసేవి ఫర్వాలేదు కానీ.. దేశాల మధ్య భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉంటేనే సమస్య. ఇప్పుడు నెట్టింట ఓ వీడియో తెగ వైరల్ అయిపోతోంది. మహిళల ప్రపంచ కప్ లో భారత్, పాకిస్థాన్ ప్లేయర్లు గొడవ పడినట్లు.. ఒకరి పైకి మరొకరు దూసుకెళ్లినట్లు అందులో ఉంది. వాస్తవంగా అలాంటి ఘటనలేవీ భారత్-పాక్ మ్యాచులో జరగలేదు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా భారత్, పాక్ ప్లేయర్లు కరచాలనం చేసుకోలేదు. మ్యాచ్ ను వీక్షించేందుకు 18వేలకు పైగా ప్రేక్షకులు హాజరయ్యారు. మహిళల ప్రపంచ కప్ లో ఓ గ్రూప్ స్టేజ్ మ్యాచ్ ను చూసేందుకు ఇంత భారీ సంఖ్యలో ఇంతకుముందెన్నడూ రాలేదు. ఇదే అత్యధికం కావడం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 170/6 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాక్ 106 పరుగులకే ఆలౌటైంది.

# అవును.. విరాట్ అహంకారే.. కానీ: రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు

టీమ్ఇండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ - మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి మధ్య అనుబంధం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విరాట్ కెప్టెన్ గా ఉన్నప్పుడు రవిశాస్త్రి ప్రధాన కోచ్ గా బాధ్యతలను నిర్వర్తించాడు. వీరిద్దరి హయాంలో భారత్ విదేశాల్లో అద్భుతమైన టెస్టు విజయాలను నమోదు చేసింది. తాజాగా ఓ వీడియోలో విరాట్ ను అహంకారి, అతి గారాబంతో పెరిగిన పిల్లాడు అంటూ పెట్టిన పోస్టుపై రవిశాస్త్రి స్పందించాడు. అవును ఆ అభిప్రాయాలు నిజమే కావొచ్చని.. అదంతా క్రికెట్ మైదానానికి మాత్రమే పరిమితమని స్పష్టంచేశాడు. గేమ్ లోకి దిగిన ప్లేయర్.. మైదానం ఆవల ఉండే కోహ్లీ పూర్తి భిన్నమని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.




''అవునండీ.. మీరు అనుకున్నట్లు విరాట్ అహంకారి. అతి గారాబంగా పెరిగిన కుర్రాడు. మితిమీరిన ప్రవర్తన కలిగిన వ్యక్తి. ఉద్రేకంగా ఉంటాడు. ఇవన్నీ నిజమే. కానీ, ఇలా ఉండేది మాత్రం మైదానంలోనే. ఒక్కసారి గేమ్ నుంచి బయటకు వచ్చాక పూర్తి భిన్నం. మైదానంలో అలా ఉండి.. ఒక్కసారిగా దాన్నుంచి బయటకొచ్చి సాధారణంగా ఉండే వ్యక్తులంటే నాకు చాలా ఇష్టం'' అని రవిశాస్త్రి తెలిపాడు.

గాయం కారణంగా విరాట్ కోహ్లీ అఫ్గానిస్థాన్ తో వన్డే సిరీస్ కూ దూరమైన సంగతి తెలిసిందే. ఐపీఎల్ లో ఆర్సీబీకి వరుసగా రెండో కప్పు రావడంలో కోహ్లీదే కీలక పాత్ర. ఫైనల్ లో అద్భుత ఇన్నింగ్స్ తో తన జట్టును గెలిపించాడు. అయితే, తొడ కండరాలు పట్టేయడంతో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ లో ఆడటమే తన లక్ష్యమని ఇప్పటికే స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారత్ తరఫున కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్నాడు.

# 'వారణాసి' క్లైమాక్స్ కోసం భారీగా కసరత్తులు !

దర్శకధీరుడు రాజమౌళి - మహేష్ బాబు కలయికలో రాబోతున్న సినిమా 'వారణాసి'. కాగా తాజాగా ఈ చిత్ర యూనిట్ క్లైమాక్స్ షూట్ కి సన్నాహాలు చేసుకుంటోంది. నాలుగు కోట్ల రూపాయల భారీ సెట్ లో ఈ సినిమా క్లైమాక్స్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట. మహేష్ అభిమానులకు ఈ యాక్షన్ సీక్వెన్స్ కనుల విందుగా ఉంటుందని టాక్. ప్రియాంక ఈ సినిమాలో మందాకినిగా కనిపిస్తూ ఉండగా.. మహేశ్ రుద్రగా.. శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు.

అన్నట్టు 'వారణాసి' చిత్రం రూ.1300 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో నిర్మితమవుతోంది. కాగా ఈ భారీ ప్రాజెక్ట్ ను కెఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, కథా కథనాన్ని విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. ఇక ఈ సినిమాకి దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు. ఈ సినిమాను పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్లో చిత్రీకరిస్తుండగా, పలు భాషల్లో విడుదల చేయనున్నారు.



## స్టైలిష్ దుల్కర్



'ఐయామ్ గేమ్' అంటూ త్వరలో ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతున్నారు హీరో దుల్కర్ సల్మాన్. కొత్తదనం నిండిన కథలతో అలరించే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 20న రాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇన్ స్టా వేదికగా మరో కొత్త పోస్టర్ ను పంచుకుంది. 'సిద్ధమవ్వండి.. సమయం ఆసన్నమైంది' అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో స్టైలిష్ లుక్ లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు దుల్కర్. ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కయాదు లోహార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# 'డ్రాగన్'లో కృతి?

ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమా డ్రాగన్. ఇప్పుడు ఈ సినిమాలో మరో బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ కూడా ఓ కీలక పాత్రలో కనిపించబోతుంది. ఆ మధ్య వదిలిన గ్లింప్స్ వీడియోలో సినిమాలోని అనేక పాత్రలను ఇంట్రొడ్యూస్ చేసిన ప్రశాంత్ నీల్, కథలోని మెయిన్ కాన్ ఫ్లిక్ట్ ను రివీల్ చేయకుండా ఉంచాడట. ఆ మెయిన్ కాన్ ఫ్లిక్ట్ కి సంబంధించిన ట్రాక్ లో కృతి సనన్ కూడా కనిపించబోతుందని తెలుస్తోంది. అన్నట్టు ప్రశాంత్ నీల్ సినిమా అనగానే ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్ మాత్రమే ఎక్కువ కనిపిస్తోంది. కానీ, ఎన్టీఆర్ తో తీస్తున్న ఈ సినిమా ఫ్లాష్ బ్యాక్ మొత్తం ఫుల్ కలర్ ఫుల్ గా ఉంటుందట. పైగా ఈ ఫ్లాష్ బ్యాక్ లో బ్లాక్ షేడ్ ఫ్రేమ్ కూడా కనిపించదట. మరి ప్రశాంత్ నీల్ ఫ్లాష్ బ్యాక్ కోసం అంత కలర్ ఫుల్ గా ఏం తీస్తున్నాడో చూడాలి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆరట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. మొత్తానికి ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది 2027 జూన్ 11న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.



# ఆనందంతోనే అందం: రష్మిక

మెరిసే చర్మం వెనుక రహస్యం ఏంటని అడిగితే క్రీములు, ఫేస్ ప్యాక్ ల పేర్లు చెబుతుంటారు అందరూ.రష్మిక మాత్రం 'మనసులో ఆనందం' అంటున్నారు. ఇటీవల ఇన్ స్టాగ్రామ్ లైవ్ లో అభిమానులతో ముచ్చటించిన ఆమె.. తన గ్లోయింగ్ స్కిన్ సీక్రెట్ బయటపెట్టారు. ఒక అభిమాని రష్మికను ఆమె బ్యూటీ వెనుక ఉన్న రహస్యం ఏంటని అడగ్గా.. దానికి 'ఎప్పుడూ సంతోషంగా ఉండండి. మిమ్మల్ని నవ్వించే వాళ్లతోనే ఉండండి. మనలోని ఆ అమాయకత్వాన్ని కాపాడుకుంటేనే నిజమైన ఆనందం దొరుకుతుంది' అని ఆమె జవాబిచ్చారు. మనసు సంతోషంగా ఉంటే ముఖం దానంతట అదే మెరుస్తుందని వివరించారు. బ్యూటీ ప్రొడక్ట్స్ కంటే పాజిటివిటీనే అసలైన అందమని రష్మిక చెప్పిన మాటలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



ఈ ఏడాది ప్రారంభంలోనే 'రాజాసాబ్'తో తెరపై సందడి చేసింది కథానాయిక మాళవిక మోహనన్. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకోవడం వైపు మొగ్గు చూపుతున్న ఈ భామ.. ప్రస్తుతం 'సర్దార్ 2', 'పాకెట్ నోవెల్' లాంటి చిత్రాలతో తీరిక లేకుండా గడుపుతోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మాళవిక.. తను కలిసి పనిచేసిన దర్శకుల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. ''నేను

# ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని!

కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటాను. ఒక నటుడి ప్రతిభ అనేది వారు పనిచేసే దర్శకులపైనే ఆధారపడి ఉంటుందని నేను బలంగా నమ్ముతాను. ఎందుకంటే దర్శకులే సినిమాకి సారథులు. వారు ఒక కథను ఊహించుకొని.. సినిమాగా మలుస్తారు. ఒక వేళ ఆ చిత్రం అంత గొప్పగా లేకపోతే.. పాత్ర విషయంలో గానీ, ప్రేక్షకులపై ఆ పాత్ర చూపే ప్రభావం విషయంలో గానీ.. ఎంత కష్టపడినా మిమ్మల్ని మీరు గొప్పగా చూపించుకోవడం సాధ్యం కాదు. సినిమాను రూపొందించే వ్యక్తి సమర్థులు కాకపోతే.. ఆ చిత్రాన్ని ఏ విధంగానూ మనం కాపాడలేం. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. నేను కార్తీక్ సుబ్బరాజ్, లోకేశ్ కనగరాజ్, పా.రంజిత్, పి.ఎస్ మిత్రన్ లాంటి అద్భుతమైన దర్శకులతో పనిచేశాను. వారందరి నుంచి ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకున్నా'' అని చెప్పుకొచ్చింది మాళవిక.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.